నమ్మలేని నిజాలు

రాకాసి బల్లులు
పక్షుల పూర్వజులు
వెలుగులోకి.

హింసరచనం
అపాంస ప్రచన
కీడించి మేలు.

గాలి మేడలు
ప్రభుత్వ ఉద్యోగాలు
విజ్ఞాన విద్య.

రూపం మారింది
రాజులే సచివులు
రాజభరణం.

పందుటకులు
వేధింపుల గాలులు
వృద్ధ జీవితం.

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

శ్రీ నిజం

గొప్పగా ఏర్పాటైంది
టీ.హబ్ టూ.జీరో!
ఐటీ చరిత్ర లోనే
తెలంగాణ హీరో!

టెక్నాలజీ ద్వారానే
ఎన్నెన్నో అద్భుతాలు!
విప్లవాత్మక మార్పులే
నూతనంగ ఉద్భవాలు!

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ | గురువారం 30-6-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 266 | పేజీలు:6 | వెల: రూ.1/-


## ప్రపంచం అబ్బుర పడేలా యాదాద్రి దేవాలయం : మంత్రి ఎర్రబెల్లి



యాదాద్రి భువనగిరి, జూన్ 29: యాదాద్రి ఆలయాన్ని ప్రపంచ ప్రఖ్యాత ఆలయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్చిదిద్దారని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, దివ్యాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవ రెడ్డి లతో కలిసి మంత్రి దర్శించుకున్నారు. స్వామివారికి పూజలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామివారు మా ఇలవేల్పు. గతంలో యాదాద్రి కి వచ్చిన వారు ఇప్పుడు వచ్చి చూస్తే యాదాద్రి కేనా వచ్చింది అన్నంత అభివృద్ధి జరిగిందన్నారు. ప్రపంచం అబ్బుర పడేలా ప్రఖ్యాత దేవాలయంగా యాదాద్రిని సీఎం తీర్చిదిద్దారని ఆయన ప్రశంసించారు.

సీఎం కేసీఆర్ దార్శనికత తో రాష్ట్రం అన్ని రంగాల్లో మరింతగా అభివృద్ధి చెందాలని ఆ దేవుడిని ప్రార్థించానని మంత్రి చెప్పారు. అంతకు ముందు మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులుస్వామి వారి పట్టు వస్త్రాలతో ఆశీర్వచనం అందించి.. స్వామి వారి ప్రసాదం అందజేశారు.


## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ బస మార్పు

హైదరాబాద్, జూన్ 29: భారత ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన షెడ్యూల్లో మార్పులు జరిగాయి. రెండు రోజులపాటు ఇక్కడి హెచ్ఐసీసీలో జరగనున్న భాజపా జాతీయ కార్యవర్గ సమావేశాలకు ప్రధాని హాజరవుతున్నారు. జులై 2వ తేదీ మధ్యాహ్నం ఆయన ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి బయలుదేరి హైదరాబాద్ వస్తారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమం ప్రకారం బేగంపేట విమానాశ్రయంలో దిగాక అక్కడి నుంచి సోమాజిగూడలోని రాజ్‌భవన్ చేరుకుని అక్కడి అతిథి గృహంలో బస చేయాలని నిర్ణయించారు. అయితే అగ్నిపథ్ పథకాన్ని నిరసిస్తూ వివిధ రాజకీయ పక్షాలు, సంఘాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తుండటం, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఈడీ విచారణకు పిలవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రధాని రాజ్‌భవన్‌లో బస చేయడం శ్రేయస్కరం కాదని హైదరాబాద్ నగర పోలీసులు ప్రధాని భద్రతను పర్యవేక్షించే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపు (ఎస్‌పీజీ) ఉన్నతాధికారులకు నివేదించినట్టు తెలిసింది. దీంతో ప్రధాని మోదీ రాజ్‌భవన్‌లో కాకుండా హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్‌లోనే బస చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.










## జులై 5న అంగరంగ వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం-మంత్రి తలసాని



హైదరాబాద్, జూన్ 29:జులై 5వతేదీన అంగరంగ వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం జరుగుతుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అమ్మవారి కళ్యాణం సందర్భంగా నూతన వీర తయారైన ఆలయ ఆవరణలో మంత్రి ప్రారంభించారు. ఈసారి అమ్మవారి కళ్యాణానికి 5 లక్షల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు.

అమ్మవారి కళ్యాణానికి వచ్చే లక్షలాది మంది భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని పండుగలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. 30 నుండి ప్రారంభమయ్యే బోనాలను ఘనంగా నిర్వహించేలా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

గురువారం నుండి గోల్కొండ బోనాలతో ప్రారంభమవుతాయన్నారు. జగదాంబ అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ చేయడం జరుగుతుందన్నారు.

## వీణ-వాణిలను కలిసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు

హైదరాబాద్, జూన్ 29:హైదరాబాద్,యూసఫ్ గుడ, బాలసదన్ లో ఇంటర్మీడియట్ ఫస్ట్ క్లాస్ లో పాస్ అయిన అవిభక్త కవలలు వీణ -వాణిలను తెలంగాణ రాష్ట్ర గిరిజన, స్త్రీ- శిశు సంక్షేమ శాఖల మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్, విద్యా శాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి కలిసి అభినందించి,స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు..మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ..ఇంటర్ ఫలితాల్లో వీణ-వాణి లకు మంచి మార్కులు వచ్చాయి.వీణాకు 712, వాణికి 707 మార్కులు వచ్చాయి.ఇంటర్ లో అత్యుత్తమ మార్కులు సాధించిన వీణా వాణిలకు అభినందనలు.కోవిడ్ సమయంలో కూడా ఆన్ లైన్ క్లాస్ లు అటెండ్ అయ్యారు.వీణావాణీలకు ఈ సమయంలో తల్లి అవసరం ఉంటుంది అందుకని తల్లికి కూడా ఉద్యోగం ఇక్కడే ఇచ్చాం.బాల సదనములో అనాథ పిల్లలు కూడా వున్నారు.

వాళ్ళు కూడా ఫస్ట్ క్లాస్ లో పాస్ అయ్యారు.. వీణావాణీలు సీఏ కోర్సు చేయడానికి ఇంట్రెస్ట్ చూపుతున్నారు,వారికి మేథ్ లో కాలేజ్ అడ్మిషన్ తీసుకున్నాం,వారికి ఫ్రీ కోచింగ్ అందిస్తాం.

గురుకులాల్లో చదివిన విద్యార్థులు ఫస్ట్ క్లాస్ లో పాస్ అయ్యారు.వీణ-వాణిలకు దేవుడు అన్యాయం చేసినా.. గౌరవ ముఖ్యమంత్రి కెసిఆర్ , ఈ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది.కోవిడ్ కారణంగా అనాథలైన పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం అక్కున చేర్చుకొని చదివిస్తోంది.ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని విద్యార్థులెవరూ తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని.. ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ఏడాది నష్ట పోకుండా ఉండేందుకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహణ ఉంటుంది. ఈ సమయంలో విద్యార్థులకు మానసిక ధైర్యాన్ని ఇవ్వాలని వారి తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులతోపాటు మహబూబాబాద్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్స్ ఐఖీా లక్ష్మిదేవి, సునంద, అసిస్టెంట్ డైరెక్టర్ పద్మజ, రీజినల్ జాయింట్ డైరెక్టర్ శారద .. ఇతర అధికారులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులందరికీ రైతుబంధు.. ఎలాంటి ఆంక్షలు లేవు : మంత్రి నిరంజన్ రెడ్డి


రాష్ట్రంలోని లబ్ధిదారులందరికీ రైతుబంధు జమ చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుబంధుపై ఆంక్షలు పెడుతామని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఎలాంటి ఆంక్షలు లేవని ఆయన తేల్చిచెప్పారు. ఎక్కువ భూమి ఉన్న వారికే రైతుబంధు అనేది అవాస్తవం అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. రైతుబంధును స్వీకరిస్తున్న రైతులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ఇవాళ మంత్రి నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 9వ విడుత రైతుబంధు కింద లబ్ధిదారులకు రూ. 7,508 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. ఇవాళ రెండు ఎకరాల్లోపు ఉన్న 16.32 లక్షల మందికి రైతుబంధు నగదును జమ చేశామని పేర్కొన్నారు. 24.68 లక్షల ఎకరాలకు రూ. 1,234.09 కోట్లు జమ చేశామని ప్రకటించారు. ఈ రెండు రోజుల్లో ఎకరా, రెండు ఎకరాలు ఉన్న వారికి రూ. 1820.75 కోట్లు జమ చేశామన్నారు. ఈ రెండు రోజుల్లో మొత్తం 36.41 లక్షల ఎకరాలకు ఆర్థిక సాయం అందిందని తెలిపారు.

10 ఎకరాలకు పైగా ఉన్న లబ్ధిదారులకు అందిస్తుందని రూ. 250 కోట్లు మాత్రమే అని స్పష్టం చేశారు. రైతుబంధు లబ్ధిదారుల్లో ఐదు ఎకరాలు ఉన్న వారు 92.50 శాతం మంది ఉన్నారు. ఈ ఏడాది వానాకాలంలో 68.10 లక్షల మందికి రైతుబంధు అందిస్తున్నామని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలోనూ రైతులకు చేసిందేమీ లేదని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోదీ.. ఎరువులు, పెట్రోల్, డీజిల్ ధరలను మాత్రం రెట్టింపు చేశారని మండిపడ్డారు. 60 ఏండ్లు నిండిన రైతులకు పెన్షన్ ఇస్తామని చెప్పిన కేంద్రం హామీ నెరవేరడం లేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ప్రతిష్టాత్మక చండీగఢ్ పిజిఐ ఆసుపత్రిని సందర్శించిన మంత్రి హరీష్ రావు



పంజాబ్ జూన్ 29:చండీగఢ్ లో జరుగుతున్న జీఎస్టీ కౌన్సిల్ మీటింగ్ లో పాల్గొంటున్న తెలంగాణ ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు బుధవారం ప్రతిష్టాత్మక చండీగఢ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ వివేక్ లాల్, డీన్ డాక్టర్ పురి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వివేక్ కౌశల్ మంత్రికి సాదర స్వాగతం పలికారు. ఆసుపత్రిలోని సదుపాయాలు, అందిస్తున్న సేవల గురించి మంత్రికి వివరించారు.

సీఎం కేసీఆర్ మార్గనిర్దేశనంలో తెలంగాణ వైద్య రంగంలో తీసుకొస్తున్న మార్పుల గురించి మంత్రి హరీష్ రావు వారికి వివరించారు. హైదరాబాద్ లోని నిమ్స్ విస్తరణ, నగరం నలువైపులా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న టిమ్స్, వరంగల్ లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు వంటి అంశాల గురించి వారితో చర్చించారు.

ఒక్క హైదరాబాద్ లోనే కొత్తగా ఆరు వేల పడకలు, వరంగల్ లో వేయి పడకలతో పాటు, సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. మరింత మెరుగైన వసతులు కల్పించడానికి సలహాలు, సూచనలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వెంట వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ నీతూ ప్రసాద్, సీఎం ఓఎస్డీ డాక్టర్ గంగాధర్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్ లు ఉన్నారు.

## దళిత బంధు అమలు చారిత్రాత్మక నిర్ణయం : మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



ఖమ్మం, జూన్ 29 (నేటినిజం ప్రతినిధి): దళిత కుటుంబాల ఆర్థిక అభ్యున్నతిని కాంక్షిస్తూ కేసీఆర్ ప్రభుత్వం దళిత బంధు పథకం అమలుకు సంకల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. మధిర నియోజకవర్గం చింతకాని మండలం పూర్తి స్థాయిలో దళిత బంధు పథకం అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమంలో భాగంగా నాగులవంచ, కోదుమూరు గ్రామంలో ఎస్సీ లబ్దిదారులకు దళిత బంధు పథకం ద్వారా మంజూరైన ఏఅఃలు, ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలు, ట్రాలీ జీప్ లు తదితర యూనిట్స్ ను మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పంపిణి చేశారు. తొలుత గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెల్త్ సబ్ సెంటర్ ను ప్రారంభిం చారు. ఆనంతరం దళిత బంధు పథకం క్రింద మంజూరైన యూనిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హర్వెస్టర్ ను ఎక్కి నడపారు. వాటిని పొందడం పట్ల ఆయా రైతుల తో కసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడు తూ.. ఖమ్మం జిల్లాల్లో చింతకాని మండల ఒకు పూర్తి స్థాయిలో అమలు చేయ దం చారిత్రాత్మకం అన్నారు. రూ.400కోట్ల ప్రభుత్వం నిధులతో దళితుల ఆర్థిక పురోగతిని కాంక్షించినందుకు సంతోషంగా ఉందన్నారు.

ప్రయో గాత్మంగా ముందుగా నియోజకవర్గంకు 100 చొప్పున దళిత బందు అమలు చేశా మని, రానున్న రోజుల్లో ప్రతి దళిత కుటుం బాలకు ఈ పథకాన్ని వర్తింపజేయడం జరుగుతుందని, ఈ విషయంలో ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని మంత్రి పువ్వాడ భరోసా కల్పించారు. నిన్న నుండి రైతు బంధు నుండి ప్రతి రైతుల ఖాతాల్లో నగదు పడుతుందన్నారు. రైతుబందు పథకం ప్రారంభించినప్పుడు కూడా ప్రతిపక్షాలు అపహాస్యం చేశారని కానీ నేటి వరకు ప్రతి రైతుకు క్రమం తప్పకుండా నగదును వేస్తున్నారని వివరించారు. నేటి వరకు రైతు బంధు పథకం ద్వారా మొత్తం దాదాపు 57వేల 540 కోట్ల రూపాయలు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

## అప్‌డేట్ లేకపోవడంతో భారీగా దారి మళ్లుతున్న ఆదాయం : మంత్రి హరీశ్‌రావు

న్యూఢిల్లీ, జూన్ 29: రాష్ట్ర విభజన వల్ల, నిర్దిష్ట పన్ను చెల్లింపుదారుల కస్టమర్ చిరునామాలను అప్‌డేట్ చేయకపోవడం వల్ల భారీగా ఆదాయం దారి మళ్లుతున్నదని జీఎస్టీ కౌన్సిల్ దృష్టికి రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు తీసుకెళ్లారు. కొన్ని సందర్భాల్లో కొంతమంది పన్ను చెల్లింపుదారుల రికార్డుల్లోని కస్టమర్ చిరునామాలు తెలంగాణలో ఉన్నప్పటికీ, ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌గానే పరిగణలో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ప్రతిపాదిత కొత్త 3ఃఫారమ్‌లో ఊఖీ 3ః రిటర్న్‌లలో ప్రతికూల విలువలను (నెగిటీవ్ వాల్యూను) అనుమతించాలని ప్రతిపాదించినందుకు కౌన్సిల్‌కు హరీశ్‌రావు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత 3బి రిటర్న్‌లో కూడా అదే సదుపాయాన్ని పొందుపరచాలని జీఎస్టీ కౌన్సిల్ ఛైర్‌పర్సన్‌ను మంత్రి కోరారు. తద్వారా ప్రస్తుత సంవత్సరంలో పన్ను చెల్లింపుదారుల చిరునామాల తప్పులను సరిదిద్దడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.

ఈ నెల 28, 29 తేదీల్లో చండీగఢ్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన 47వ ఊూ కౌన్సిల్ సమావేశానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావుతో పాటు ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రం తరపున పలు అంశాలను మంత్రి హరీశ్ రావు జీఎస్టీ కౌన్సిల్ లో ప్రస్తావించారు.మళ్లించబడిన ఐజిఎస్‌టిని రికవరీ చేయడానికి రాష్ట్రం వెలుపల ఉన్న పన్ను చెల్లింపుదారుల టాక్స్ జ్యూడిరిక్షన్ విషయంలో మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు ఢిల్లీ రాష్ట్రాల అధికారుల సహకారం కావాలని హరీశ్‌రావు కోరారు. ఈ విషయంలో రెవెన్యూ సెక్రటరీ ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. పన్ను చెల్లింపుదారులపై మళ్లీ ఐజిఎస్‌టి చెల్లింపుతో భారం పడకుండా, ఇప్పటికే చెల్లించిన పిఒఎస్‌తో ఐజిఎస్‌టిని వాపసు చేయాలని కోరారు.

స్థానిక సంస్థల విధులకు సంబంధించి అందించిన స్వచ్ఛ పరికరాలకు సంబంధించిన మినహాయింపుల జాబితాను విస్తరించాలని ఆర్థిక మంత్రి హరీశ్ రావు, జీఎస్టీ చైర్‌పర్సన్‌ను కోరారు. లేకుంటే అది స్థానిక సంస్థలపై భారం పడుతుందని వివరించారు. ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిలో స్థానిక సంస్థలు ఉన్నాయని తెలిపారు.

## 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' న్యూస్ ప్రజెంటర్‌కు అవార్డు




ప్రముఖ న్యూస్‌చానల్ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి న్యూస్ ప్రజెంటర్‌కు ఉత్తమ ప్రతిభా అవార్డు లభించింది. జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగాన సభలో న్యూస్ ప్రజెంటర్ యరమలి శంకరికి జీవీఆర్ ఆరాధన టీవీ న్యూస్ ప్రజెంటర్ ఉత్తమ ప్రతిభా అవార్డును అందజేశారు. ఈ అవార్డును యరమలి శంకర్ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో చిల్లా రాజశేఖర్ రెడ్డి, రామరాసు శ్రీనివాసరావు, సి. రామకృష్ణ, లలితారాజ్, నవీన్ వల్లం, గోపరాజు రవికుమార్, నిర్వాహకులు గుదిబండి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ చరిత్రలో పోరు కెరటం డివి కృష్ణ-కొత్తపల్లి రవి



మహబూబాబాద్, జూన్ 29, (నేటినిజం ప్రతినిధి): విప్లవ పోరు కెరటం డి వి కృష్ణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమ చరిత్రలో పోరు కెరటం డివి కృష్ణ అని సిపిఎంఎల్ ప్రజాపంద తొర్రూరు డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. పెద్దవంగర మండల కేంద్రంలోని డి వి కృష్ణ ప్రజాపంద రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ మరణించిన ఆయన చిత్రపటానికి నివాళి నేడు అర్పించారు.ప్రజలు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలను విప్లవకారులు అర్థం చేసుకొని అందుకు అనుగుణంగా ఎత్తుగడలు రూపొందించి వర్గ పోరాటాలను తీవ్రతరం చేయాలని, అలాంటి పోరాటలను అభివృద్ధి చేసిన గొప్ప నాయకుడు ఆయన అన్నారు.ఈ ఆదివారం క్యాన్సర్ బారినపడి ఈ ఆదివారం చనిపోయిన డివి కృష్ణ సంతాప సభలు జూలై జూన్ 27 నుంచి జులై నీ5 వరకు జరపమని పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు లో భాగంగా నేడు పెద్ద వంగర లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పీడిత ప్రజలు ముఖ్యంగా కార్మికులు, వ్యవసాయ కూలీలు, చిన్న సన్నకారు రైతులు ఉద్యోగులు విద్యార్థులు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల పరిశీలనాత్మక రచనలు ఎన్నో చేసి వర్గ పోరాటాలకు మార్గదర్శిగా డివి కృష్ణ నిలిచాడని అన్నారు. చారిత్రాత్మక నిమ్మపల్లి భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో,బీడి కార్మికుల వేతనాల పెంపు విషయంలో బొగ్గుగని కార్మికులు జూట్ మిల్ కార్మికులు హైదరాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా కార్మికుల ఆర్గనైజ్ చేసి వారిని దోపిడీ నుంచి విముక్తి చేయ విప్లవ పదంలో నడిపించాలడని అన్నారు. సబ్ డివిజన్ కార్యదర్శి ముజంపల్లి వీరన్న మాట్లాడుతూ డివి కృష్ణ నిరంతర అధ్యయనశీలి అని అత్యంత నీతి నిజాయితీ నిబద్ధత కలిగిన గొప్ప విప్లవకారుడని భారత విప్లవోద్యమ కోల్పోయిందని ప్రజలకు తీరని లోటు అని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజా పందా సబ్ డివిజన్ నాయకులు ధారావతు దేవ సంఘం మండల కార్యదర్శి గుగులోతు పూల్ సింగ్ వీరస్వామి రమేష్ ఏకలక్ష్మి వెంకటమ్మ రజియా యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 30-6-2022

## మాయమైపోతున్నాడు మనిషి!

రక్త సంబంధాలే
వ్యాపార బంధాలుగా
మారుతున్న నేటి కాలమిది.
ఎవరికీ అందనంత
ఎత్తుకు ఎదగాలనే తపన మనిషికి
ఎట్టి పరిస్థితులెదురైనా.
అడుగడుగులో లావాదేవీలే ధ్యేయంగా
అలవర్చుకున్నాడు
పక్కా వ్యాపార దృక్పథం.
మర మనిషిగా మారి
మర్చిపోయాడు నేటి మానవుడు
'మనిషితనం' ప్రదర్శించడం.
నీతి సూత్రాలు
నేడు నీటి మూటల చందం.
ప్రాకృత ధర్మం
పాతకాలం నాటి మాట..
పాతాళంలో పాతరగా భద్రం.
పుట్టుకొస్తున్నాయి
ఆకలిని మించిన అవసరాలు
నేటి ఆధునిక మానవుడికి.
అర్రులు చాస్తున్నాడు
అర్హతకు మించిన సౌకర్యాలకు.
ఆశ పడుతున్నాడు
మితిమీరిన సౌభాగ్యాలకు
పరమార్థం లేని అర్థాలకు.
తన్నుమాలిన ధర్మం లేదంటూ
అడ్డదారుల్ని
రాచబాటలుగా మార్చాడు.
రక్తాన్నే రసాయనంగా మార్చి
వ్యాపారవేత్తగా అవతారమెత్తాడు.
చివరకు మనిషిగా
ఏ మాత్రం మిగలకుండా
మాయమైపోతున్నాడు మనిషి!



-ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007

## ఘంటారావం

చిన్న పొరపాటే
అనుకోకు
చిందరవందర చేస్తుందని
మరువకు.

కానివాళ్ళ మాటలకు
కన్నీళ్ళు కారిస్తే ఎలా?
మన మేలు కోరేవాళ్ళు
కన్నీళ్ళకు కారకులవరు కదా

ఆనాడు
బంధాల బాధ్యత
ఈనాడు
అందాల ఆధీకృత.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## గోపి రచన 'మనిషిని కలిసినట్టుండాలి' ఆవిష్కరణ

సమాజహితం కోరే సాహిత్యాన్ని రచించిన మహోన్నతమైన వ్యక్తిత్వం డా॥ఎన్.గోపిదని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥కే.వీ. రమణాచారి అన్నారు. ఆదివారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో కిన్నెర ఆర్ట్ థియేటర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త డా॥ఎన్.గోపి 73వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన రచించిన "మనిషిని కలిసినట్టుండాలి' డా॥ ఎన్.గోపి సాహిత్యంపై, విమర్శ సమీక్షావ్యాసాల ప్రత్యేక సంచిక డా॥ ఎన్.రఘు సంపాదకత్వ నిర్వహణలో వెలువడిన "నిరంతర" గ్రంథాల ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి



డా॥ ఎన్.గోపిని సత్కరిస్తున్న డా॥కె.వి.రమణాచారి, డా॥ఓలేటి పార్వతీశం.

ఆదర్శప్రాయుడని అన్నారు. పుట్టినరోజు సందర్భంగా పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామమన్నారు. ఇలాంటి వేడుకలు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. డా॥ఎన్.గోపి మాట్లాడుతూ తన పుట్టినరోజు పురస్కరించుకుని గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమానికి ముందుకొచ్చిన కిన్నెర సంస్థను అభినందించారు. ఈ సందర్భంగా తనను సత్కరించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వంగల హర్షవర్ధన్, ఓలేటి పార్వతీశం, ఆచార్య సూర్యధనుంజయ్, విహారి,



డా॥ ఎన్.గోపి రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు.

పుస్తకాన్ని ఆవిష్కరించి ఎన్.గోపిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాహిత్య రంగానికి డా॥॥ఎన్.గోపి చేస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. ఈతరం యువసాహితీవేత్తలను గోపి సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డా॥ఎస్. జతిన్‌కుమార్, ముత్యం రెడ్డి,బన్న అయిలయ్య, సుధామ, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, భవానీరెడ్డి, జూకంటి జగన్నాథం, మద్దాళి రఘురామ్ తదితరులు డా॥ఎన్.గోపిని సత్కరించారు.

## కావలసింది

అన్నీ సవ్యంగానే అగుపిస్తున్నాయని అనుకుంటాను
ఉదయపు వెలుగులూ ఊహల సొబగులూ
ఇంటి ముందు కళ్ళు తెరుచుకు మడతలు విప్పుకునే
వార్తా పత్రికలోని రుస రుసలూ రౌద్రాలూ
శుభాశుభాల అశ్రుతర్పణ, ఆనంద హేల
అక్కడక్కడా కాలుజారిన అహంకారాలూ
చీమలై పారే అక్షరాల ప్రవాహం అన్నీ సవ్యంగానే అగుపిస్తున్నాయి.

అయినా నీడకూ నీడకూ మధ్య ఏదో పొసగని చారిక
మాటకూ మాటకూ మధ్య లేవనుకు0టున్న చీలికలు
ఇన్నాళ్ళూ మౌనమే మనిషికీ మనిషికీ మధ్య
రెండు సముద్రాల నడుమ ఒక మహా అగాధమనుకున్నాను
కానీ పొరలు లేకపోయినా చూపు మసక బారుతు0ది
ఎదురుగానే ఉన్నా కావాలనుకున్నది అద్దంలో నీడవుతుంది

నిజానికీ నీడకూ మధ్య కొన్ని వెలుగు యుగాల దూరమైతే
నీడకూ అద్దనికీ మధ్య కొలతకందని నిర్జీవత

ఆకు నిండా అలుముకున్న హరిత ప్రపంచం
అణువణువునా పులకరింతల అంతా ఒకటన్న సమైక్యతా ఆమోదం
అయినా అణువుకూ అణువుకూ మధ్య అంతర్యుద్ధం
లోలోపలి అమరికలలో అరమర
అంతా యూనిఫామ్ తొడుక్కున్న స్కూల్ పిల్లల్లా ఒకేలా అనిపిస్తాయి
అయినా అడుగడుగునా కొలతల కందని అంతరాలు

అల లాగా విసిరిన ఒక ఎండ పొడ
ధవళ దరహాసపు వెలుగనే అనిపిస్తుంది.
తరచి తరచి నీటి చుక్కల భూతద్దాల్లో చూసాక కదా
సగం సగం మిళితమైన సప్త వర్ణ సముచ్చయాల సమరం తెలిసేది

చూసేందుకు కళ్ళూ వెలుగే కాదు
కనిపించని ఉనికిని చదువుకునే
ఒక సజీవ నదీ ప్రవాహమూ ఉండాలి
ఏమీ లేదనుకున్న ఆకాశాన్ని హత్తుకున్నట్టు
లేనితనం వెనక ఉనికిని ఎదకు అలదు కోవాలి
అయితే
కనిపించని ప్రపంచాన్ని
చూసే చూపు కోసం
గాలింపు కావాలి
ఊపిరి నుండి ఊహల వరకూ



-స్వాతీ శ్రీపాద
8297248988

## జగమెరగని బంధువు

ఎప్పుడూ ఏదో చెప్తూవున్న
ఆ నిశితరేఖ వాలు
కళ్ళు దానివైపే వుండే
ఒక అలవాటు ఏర్పరచి
హృదాంతరాళ పెచ్చులను
ఒక్కొక్కటిగా ఏరుతూ
ఎదురుపడతావు చాలా ఓపికగా!
చరిత్ర ఎరిగిన ఓ బంధువా...
నేనెప్పుడూ నిన్ను పరికిస్తూనే వున్నాగా
మరి ఇదెలా ఎందుకుంది..
ఇలా ఏర్పడిందెలా..
జరిగిందెలా... అన్నవేగా!?
మనమే అల్లుతూ వచ్చామేమో
ఒక దాని అచ్చులో ఇంకోదాన్ని
పొందుపరుస్తూ కూరుస్తూ మారుస్తూ...
'కొత్తవి కొన్నైనా చెప్పవా?'
అన్నప్పుడల్లా నవ్వుతావు
ఆ నవ్వులో ఏడుపు పరిమళిస్తూ వుంటుంది
నుదిటిపై రక్తం పారాడుతూ
కళ్ళల్లో నొప్పి కురుస్తూ
ఒళ్ళంతా కనిపించని
ముళ్ళు గుచ్చుకుని వుండి
అహోరాత్రులు శ్రమిస్తావు ఆప్తమా!
మేము చూడనివేవో నువ్వు చూస్తావు
నీ మౌనం కూడా సన్నగా వణుకుపుట్టిస్తూ
ఏదో చెప్తున్నట్టు... ఎప్పుడూ
మరీ ఇంత జాగరూకత
హెచ్చరిక కూడా ఓర్చలేము కదా!
'అసలిదే అంతమేమో' అన్నట్టు ప్రారంభం వుంటే
మరి 'ముగింపు ప్రకాశపుంజాన్ని' తట్టుకోలేదు
ఈ సామాన్య ఋణాత్మక జనజీవని!
ఎన్ని శవాలనైనా చూడగలదు
ఎన్ని తర్పణాలనైనా సహించగలదు
యుద్ధభూమిలో కేవలం మొండెంతో నడవగలదు!
కావల్సింది- ఆవల చూడగలిగే కళ్ళని
అవి ఒక సన్నని రంధ్రం నుంచి
వెలువడుతున్న వాడి కిరణాలంటావ్
పడంగానే కాల్చే మార్చే నగ్నంగా చేసే
పదునైన ఔషధాలంటావ్
ఏమేమో మాటాడతావ్
ఎండుటాకులు ఏరుతూ...
చూడు నీ జుట్టు ఎలా రేగిపోయి వుందో!
నీ చూపులు అసామాన్యంగా...
నీ కదలికలు భయంగొల్పుతూ
కత్తి అంచుల్లా...
'అసలేం చెప్తున్నావ్ నువ్వు
సూటిగా చెప్పు' అంటే-
నవ్వుతావో ఏడుస్తావో
నటిస్తావో తెలియదు!!



-రఘు వగ్గు
ఫోన్: 9603245215

## స్త్రీ శక్తి


స్త్రీ పంచభూత స్వరూపం
స్త్రీ నిత్య చైతన్య జ్వలితం
స్త్రీ అఖండ జ్యోతి ప్రజ్వలనం
స్త్రీ నాదం ఒక ప్రభంజనం.

సృష్టిని భరించే భూగోళం
దహింప చేసే అగ్నినక్షత్రం
మమతల మలయ మారుతం
ప్రేమామృతాన్ని పంచే జలాశయం
అనంత తరంగాలై లేచు అంబరం
స్త్రీ పంచ భూత స్వరూపం.

అంతరక్షానికి ఎగసిన అపూర్వ విహంగం
శాస్త్ర పరిజ్ఞానంలో అద్భుత రసాయనం
సాహిత్య వనంలో కావ్య కుసుమం
సంగీత సాగరంలో గంధర్వ తరంగం
నవరసాలు ఒలికించు నాట్య విలాసం
స్త్రీ నిత్య చైతన్య జ్వలితం

వెలుగులు నింపే మంగళ దీపం
మార్గము చూపే జ్వాలా తోరణం
అజ్ఞానం పారద్రోలే విజ్ఞాన కిరణం
కాంతులు ప్రసరించే జ్యోతి స్వరూపం
స్త్రీ అఖండ జ్యోతి ప్రజ్వలనం.

అనంత సృష్టికి ఆది మూలం
అధర్మాన్ని అణచివేయు శక్తి పీఠం
అన్యాయాన్ని ప్రశ్నించే సామాజిక దర్పణం
అవనిని శాసించే మహత్తర ఉద్యమం
స్త్రీ నాదం ఒక ప్రభంజనం.



-కందాళం రజనీ కృష్ణ
9487708043

## నీతో మాట్లాడాలని..

స్నేహమా ! ఇప్పటికిప్పుడే నీతో
మాట్లాడాలన్న ఆరాటం పుట్టింది
నిన్ను కళ్ళనిండా చూడాలనిపిస్తుంది
మన స్నేహ ప్రయాణంలో
సంవత్సరాల మౌన గానంలో
మనం పక్కపక్కనే ఉన్నాం
ఏళ్ళ తరబడి ఎడంగా ఉన్నా
ఎదురెదురుగా ఉన్నట్టున్నాం..
నీ కిష్టమైన నాట్య తరగతులనూ
నిన్నిష్టపడే స్నేహాలనూ
వొదిలేసి వెళ్ళిపోయావెందుకమ్మా ! ?
నీవు చాలా కాలం ఒక
కంటి నొప్పినీ ఒక పంటి నొప్పినీ
మనో వేదనలతో ఎదుర్కున్నావు
సమస్యలనైనా కష్టాలనైనా
హాస్య చతురతతో చెప్పుకున్నావు..
నీవు పై మెట్ల మీద ఉన్నా
నా పట్ల రంగుల హంగుల
తేడాలూ బేధాలూ చూపలేదు
నీవు నేనూ పద్మా ముగ్గురం
ముత్యాల దండలా అల్లుకున్నాం
ఏదీ దాచని నీవు
హఠాత్తుగా ఏమీ చెప్పకుండా
మాకేమీ తెలియనివ్వకుండా
తెగదెంపులు చేసుకొనిపోయావు
కానీ నాకిప్పుడు వెంటనే
నీతో మాట్లాడాలని ఉంది..!!
ఇంకా మాతో నీవున్నట్టే ఉంది..!!
మనం ముగ్గురం ఒకే రిక్షాలో కూర్చొని
కాలేజీ నుండి మన ఇళ్ళదాకా
ముచ్చట్లాడుకుండా ప్రయాణం
చేస్తున్నట్లుగానే అనిపిస్తుంది..

(సినీ హాస్య నటుడు, దర్శక
నిర్మాత శ్రీ బి. పద్మనాభంగారి
పెద్ద కూతురు కూచిపూడి
నాట్యకళాకారిణి, శిక్షకురాలు
మా మిత్రురాలు
పర్వతరాజు రాజేశ్వరి స్మృతిలో..)



- అనిశెట్టి రజిత
9849482462

## "తమసోమా జ్యోతిర్గమయా"

రాతప్రతుల నిక్షిప్తపు కోట
తాళపత్రాలు తరించు బాట
విభిన్న భాషాభ్యాసాల తోట
అదే, ఉస్మానియా విశ్వవిద్యాలయ
విజయబావుటా -

దేశానికి ఏడవ, దక్షిణాదికి మూడవ
ఉర్దూ మాధ్యమ తొలి త్రోవ
శతవసంతాల ప్రతిభా వెల్లువ
ఉస్మానియా కే సార్ధకమా సేవ -

ఏడో నిజాంన శ్రీకారమొనర్చి
నాగరికతకే నడకలు కూర్చి
లక్షలమందికి లక్ష్యాలొనర్చి
విశ్వవీచికపై నిలిచింది
ఉస్మానియా చెమటోర్చి -
విదేశాలలో నిర్మితి చూసీ
నాలుగడుగుల రాళ్ళను వేసీ
ధర్మాన్ని నాలుగు పాదాలా విరిసీ
ఖ్యాతినొందెను
ఉస్మానియా వినువీధుల కెగసీ
భాగ్యనగరాన కొలువై ఘనముగా,
చదువుల విలువలు పరిఢవిల్లి
డెబ్బది అంశాల తరగతి గదియై
కొలువబడుతుండె విద్యావల్లి
మహోజ్వలితమగు
సాక్షర చరిత్ర ప్రస్థానాలుగా విరాజిల్లి
తమసోమా జ్యోతిర్గమయా చిహ్నపు,
ఉస్మానియా కిదే
మా శుభాకాంక్షలు ప్రణమిల్లి



-కుదమ తిరుమలరావు
9505665748




## బోనం పండుగ

ఆషాఢ మాసం
ఆడపిల్ల పుట్టింటికి వచ్చినట్లు
బోనం పండుగ వస్తుంది
ఏరువాక సాగుతున్న వేల
ఊరి దేవతలకు నైవేద్యం పండుగ
ఊరి పనిమంతుల పనితనం
ప్రస్ఫుటించే పండుగలు
సంస్కృతి సంప్రదాయాల ప్రతీకలు
ప్రకృతిని సేవించడం పండుగల
అభిమతం
అలౌకికనందానికి పండుగలే
పరమార్థం
దివిలో నక్షత్రాల నడుమ
పాలపుంత వెలుగు
బోనాలపై వెలుగుతున్న దీపం
కొండంత వెలుగు
బోనాలపై ఎర్రబొట్టు
చంద్రబింబం
మేఘాలు బోనాలకు గొడుగులు
ఉరుములు మెరుపులు
భవిష్యవాణి పలుకులు
భారం కాదు భూతల్లికి
ఎత్తిన బోనం ఏ తల్లికి!
పిల్లా పాపలు చల్లంగుండాలని
ఏటేటా బోనం పండుగ
(బోనాల పండుగ
ప్రారంభం సందర్భంగా)



-పి.బక్కారెడ్డి
9705315250

## గన్నుతో పాటు పెన్నుపట్టి.. జనం వెన్నుతట్టిన చంద్రశేఖర్!



కవికి కావలసింది గారడీ కాదు.. ఇతరుల రచనలకు పేరడీ కాదని భావించే కవి దర్భముళ్ళ చంద్రశేఖర్‌గారు.. కవిగా తాను స్ఫూర్తిని పొంది ఇతరులకు స్ఫూర్తి కల్గించాలని కోరుకుంటారు. జనుల్లో జడత్వం వదిలించి.. జాగృతం వైపు పరుగెత్తించడానికి "నేను" పేరుతో ఓ కవితా సంపుటిని ప్రకటించారు. ఇందులోని 86 కవితల్లో.. కవి అనుభవాలను.. పొందిన అనుభూతులను.. అక్షరాల్లో నిక్షిప్తం చేసే క్రమంలో.. విలక్షణమైన అభివ్యక్తికి చోటుకల్పించారు. ప్రణయాన్ని.. సమరాన్ని సమంగా ఇష్టపడే కవి చంద్రశేఖర్‌గారు తమ కవిత్వం ద్వారా ఎన్నో మధుర జ్ఞాప కాలను ఏకరువు పెట్టారు. నిద్దట్లో కరుకు బూట్లు.. కళ్లలో వేయి తుపాకుల వెలుగు లు.. నిద్రపోని కలలు.. బాధించే జ్ఞాప కాలు, పొలమారే మనసు పొరలు ఆయన కవితలకు వస్తువులైనాయి.

**తృటిలో..**
**శూన్యంలోంచి.. "సూక్ష్మంగా" సూది మొన పరిమాణంతో అంచులే లేని పాకుడు అగాధంలోంచి అరుస్తూ "స్థావర జంగ మం"లో స్థానం కోసం**
**నా పాత నీడను నెమరేస్తూ**
**పాదరసంలా పడిపోతున్నాను"** అంటూ "నేను" కవితను ఎత్తుకున్నారు. 'ఆనందం జీవిత పరమావధి'ని అర్థం చేసుకుని.. అంతటా వ్యాపిస్తూ.. అంతమైపోయాను. అనంతమైపోయాను నేను! అంటూ ఆలోచనాత్మక ముగింపునిచ్చారు.

యుద్ధాలు.. ఉద్వేగాలతో సాహసంగా రక్షణ క్షేత్రంలో సేవలు అందించే వృత్తిలో ఉన్న కవి చంద్రశేఖర్.. తమ కవిత్వంలో అడుగడుగునా భావోద్వేగాలతో రాసిన కవితలు ఈ గ్రంథంలో మనకు కానవ స్తాయి. 'స్మృతి రత్నం' కవితలో ఆవిష్కరిం చిన భావాలు ఆర్ద్రంగా కొలువుదీరాయి. తాను దేశ రక్షణ కోసం.. సరిహద్దు రేఖకు పయనమవుతున్నప్పుడు..జీవిత భాగ స్వామికి చెప్పే మాటలను ఈకవితలో చూడగలం.

**నీ కంటికి కాటుక దిద్దుకోవడం మరిచిపోకు**
**నీ నుదుట సూర్యుడ్ని బొట్టు పెట్టుకోవ దం మానివేయకు**
**నేను లేనని.. విషాదాశ్రువు లొలికిం చేవు!**
**తుషార బిందువుల్ని హుషారుగా ఆనందించు!**
**పెరట్లో జామ చెట్టు**
**ముంగిట్లో రామచిలుక.. జాగ్రత్త!** అంటూ రాసిన పంక్తులు అందరినీ కదిలిస్తాయి.
**నే త్వరలోనే వచ్చేస్తాలే!**
**నీ కోసం జాబిల్లిని తెస్తాలే!!** అంటూ కొనసాగించారు. నేను లేనని.. విషాదాశ్రువులొలికించేవు! ఇదిగో మృత్యువును ఆ నరకాన విడిచి..స్వర్గం నుండి మన కోసం అమృతం తెస్తాను.. పారిజాతం కోసి.. నీ పాదాల కాడ ఉంచుతానంటూ సహచరికి నచ్చ చెబుతూ రాసిన ఊరట మాటలు మనల్ని ఉద్వేగానికి లోను చేస్తాయి. మృత్యువుకు.. జీవితానికి మధ్య ఉన్న సన్నటి రేఖ అయి ఉండవచ్చు. అది సరిహద్దురేఖ.. సైనికుడిగా కవిగా భార్యకు భరోసా వాక్యాలు ఊరట కల్గించేలా ఉన్నాయి.

Satisfaction is Death అని G.B. Shaw అన్నట్టు.. "పిపాస" కవితలో నా పాపాస తీరదు.. నాతపన ఆగదు.. నా అసంతృప్తీ చల్లారదు. అంటూ రాసిన పంక్తులు కవితలో చక్కగా ఒదిగిపోయాయి.

నేనొక సౌందర్య పిపాసిని
అసంతృప్త నగర వాసిని అంటూ ఈ కవితను ప్రారంభించారు. నా ఎడారి గుండెనా వెన్నెల కాస్తుంది. నా స్మశాన భూమినా పున్నమి పూస్తుంది. నేను సౌందర్య పిపాసిని కనుక! కానీ ఎప్పుడూ సంతృప్తికి నాపై కినుక అంటూ వాపోయారు. నేను సమిధనైతేనేమి?
**నేను ప్రమిదనైతేనేమి??**
**ప్రపంచానికి నా పిపాసతో**
**నూతనత్వం ప్రసవింపచేస్తాను.**
**త్వరలోనే సంతృప్తిని ప్రసాదింప చేస్తానంటూ** చక్కగా ముగించారు.

"ప్రేమ-పెళ్లి" కవితను ఆలోచనాత్మ కంగా తీర్చిదిద్దారు.
"ప్రేమ" అనే రెండక్షరాల ఊహ, ఊపిరి, ఉషస్సు శాసిస్తే.. కట్టుబాట్ల నెదిరించి కట్టు బట్టల్తో బయటపడ్డా! ఒక్క కల ఆస రాగా.. ఏ కలతలూ లేకుండా రెండు మనసుల్తో
ఒకరి చూపు దారిలో ఇంకొకరు చుక్కలా మెరుస్తూ
**ఒక్క జీవితం**
**సంతృప్తిగా బతికేశాం..**
**అప్పుడు!**
**"పెళ్లి"**
అనే రెండక్షరాల వాస్తవం, వగరు, వ్యగ్రత శపిస్తే.. పట్టుబట్టల్తో కట్టి పడేసినా
ఒకే చూరు కింద
**రెండు శరీరాలతో సంగమిస్తూ కూడా**
**కళ్లకు గంతలు కట్టేసుకుని**
**ఎవరి దారి వారిదని విడిపోతున్నాం..**
**ఇప్పుడు!**
అంటూ ప్రేమ, పెళ్లి పదాలను అందమైన పదబంధాలతో ఆవిష్కరించారు.

'ప్రేమ' గురించి చెప్పేటప్పుడు కవి చంద్రశేఖర్‌గారు "ఊహ, ఊపిరి, ఉషస్సు శాసిస్తే" అన్నారు. 'పెళ్లి' గురించి చెప్పేటప్పుడు వాస్తవం వగరు, వ్యగ్రత- శపిస్తే అన్నారు.
"ప్రేమ"లో
కట్టుబాట్ల నెదిరించి కట్టుబట్టలతో.. అన్నారు.
'పెళ్లి'లో పట్టుబట్టల్తో కట్టిపడేసినా.. అన్నారు. ఇలా ప్రేమ-పెళ్లిలకు సంబంధించి.. అప్పుడు-ఇప్పుడు ఎలా ఉన్నామో ఆవిష్కరించిన అంశాల్లో నేటి ప్రేమ పెళ్ళిళ్లలో సహజంగా మనం చూస్తున్న వాస్తవాలను కవితాత్మకంగా.. లయబద్ధంగా కవితలో నిక్షిప్తం చేశారు.

'ఒక జ్ఞాపకం' కవితలోనూ కవి చంద్రశేఖర్‌గారు ప్రయోగించిన పద బంధాల కూర్పు- కవిగా ఆయన నేర్పరితనానికి అద్దం పట్టే విధంగా ఉంది.

ఒక్క 'శ్రావణ మేఘపు' నీ పలకరింత కోసం.. నే కృషించి ఎండిపోయి.. మౌనంగా కూరుకుపోయాను. ఒక్క 'గ్రీష్మ కిరణపు' నీ మేల్కొలుపు కోసం.. ఆర్ద్రతా ముద్రలను అణువణువునా దాల్చి.. దుఃఖభారంతో తడిసి ముద్దగా తల్లడిల్లాను అంటూ కొనసాగించడం బాగుంది. ఇంకా ఈ కవితలో కవి "వసంత వాయు వీచిక", "వెన్నెల విసిరి ఆరేసిన వెండి వస్త్రంలాంటి నీ నవ్వు కోసం" 'భావ నగ్నంగా", 'సైగల్', 'సైలెంట్‌గా' వంటి పదబంధాలను ప్రయోగించి కవితకు నిండుదనాన్ని కూర్చారు.

**నీనవ్వుని**
**కలలో జలపాతం చిట్లించే చిరుజల్లులా**
**వేసవి సాయంత్రం వేళ మల్లెల మలలా**
**చిన్నప్పుడు చుట్టుకున్న అమ్మనేత చీర మెత్తదనంలా**
**బడిగోడ దాపున తడిమి చూస్తున్నా తొలి**
**ప్రేమ బుగ్గ సొట్టలా..చప్పుడు కాకుండా**
**స్పర్శించి చూసుకుంటాను అంటూ మంచి**
**ముగింపునిస్తూ** 'స్పర్శ' కవితను చక్కని భావుకతతో ఇందులో పొందుపరిచారు.

"ద్వంద్వాలు' కవితలో Optimist-Pessimistల భావాలను చక్కగా అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.
Optimist-ఎవరోయ్ నువ్విక్కడ?!
ఎందుకలా చీకట్లో, పుచ్చుకుంటూ తిమిరమందు
ఎక్కిళ్ళు పెడితూ
కూర్చున్నావు? ఎవరు లేరా నీకు వెనకా ముందు?
అని ప్రశ్నిస్తే-
Pessimist: ఇలా సమాధానం ఇచ్చాడు-
అంధకారమే నా అమ్మ
అగాథ పాతాళం నాకు పట్టుగొమ్మ
అయినా నువ్వెవరు నన్నడగడానికి
అసంతృప్తి నాకిష్టం పోరా వాజమ్మ!
అని సమాధానం యివ్వడం బాగుంది.

'మధుర స్మృతి' కవితలో.. పగుల్లిచ్చిన గొంతు గాయంలోకి.. బాధ గేయంలాగ జారుతుందని.. గింజుకుంటున్న గుర్తులు మెత్తబడి 'ఫెటిల్లు'న పగిలి.. ఒక స్వప్నంగా సాకారమవుతాయని తేల్చి చెప్పారు. శ్వాసల సంకెళ్లు బంధించిన నిశ్శబ్ద నిర్విరామ సంగీత స్వరంలో, సర్వంలో అంటూ కొనసాగించి.. అవునను.. జ్ఞాపకాలు చాలా బాధిస్తాయని ముగించారు. "నా తువ్వాయి' కవిత బాల గేయాన్ని తలపించే విధంగా రూపుదిద్దుకుంది. ఆయా కవితలకు పొందుపరిచిన చిత్రాలు గ్రంథానికి శోభనుకూర్చాయి.

కవి చంద్రశేఖర్‌గారికి ఊహా సౌందర్యంతో పాటు పదప్రయోగ శక్తితో పాటు యుక్తి తెలుసు. ఆయన కవిత్వం నిండా విశ్వాసం.. సాహసం.. పిపాస వంటి అంశాలు ముప్పేట అల్లుకుపోయాయి. అమ్మానాన్నలను ఇష్టపడినట్లే.. ప్రణయం.. సమరంలను అంతే ఇష్టంగా చూడటం ఆయన ఉత్తమ సంస్కారానికి నిదర్శనం. గన్ను పట్టే చేతులతో పెన్నుపట్టి జనం వెన్నుతట్టిన ఆయనకు వందనం చేద్దాం.. అభినందనలు తెలియజేద్దాం.


**ప్రతులకు:** ఉదయ్ పబ్లిషింగ్ హౌజ్,
4648/21, అన్‌సారీ రోడ్,
దర్యాగంజ్, న్యూఢిల్లీ-110 002
సెల్: 9246669543



- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

పుస్తక సమీక్ష

## ముగ్గురు కవయిత్రుల సంకలనం 'తరంగి' కవితా మాలిక



కవయిత్రులు టి.వి.శిరీష,డా॥ పోలసాయి జ్యోతి, విజయలక్ష్మి, పొప్పొప్పు కవితలను, సాంస్కృతిక సాహితీ రంగ పర్యవేక్షక స్రష్ట గుదిబండి వెంకటరెడ్డి కవితా మాలికగా వెలువరించారు. మొత్తం 59 కవితలు చోటు చేసుకొన్న ఈ సంపుటిలో వైవిధ్యభరితమైన కవితా భావుకత వెల్లివిరుస్తోంది.

శ్రీమతి టి.వి. శిరీష ఆడపిల్ల జీవితం, సనాతన ధర్మ సంప్రదాయ యుగరీతిలో, షడ్రుచుల పచ్చని అరిటాకుగా విలసిల్లాలని 'అరిటాకు' కవితలో వ్యక్తీకరిస్తారు. 'పోపులమ్మ పొగరు'లో కూడా , ఎదురేమీ వుండదని సనాతన ధర్మాన్ని ఆచరిద్దాం అంటారు.

డాక్టర్ పోల (కొండూరు) సాయిజ్యోతి, ధృవతార కవితలో స్త్రీ పోలీస్ అయితే కర్తవ్య దీక్ష, సరిలేరు నాకు ఎవరు అంటూ ఆదర్శవంతం కావాలంటారు. 'ముత్తైదువల సౌభాగ్యం' కవితలో మతాలు వేరైనా అభిమతం ఒక్కటే అంటూ అట్లతద్దె మత సామరస్యానికి ప్రతీక అంటారు.

శ్రీమతి విజయలక్ష్మి పొప్పొప్పు,ప్రేమను 'అందితే అమృతం.. చెదిరితే హాలాహలం' అంటారు. శ్రీశ్రీ, బాలు, ఎన్.టి.ఆర్, అన్నమయ్య, కృష్ణశాస్త్రి, బాపు, వంటి తెలుగు మహనీయులను కవితా రూపకంగా ప్రశంసిస్తారు.

ముగ్గురు కవయిత్రులు కూడా మహిళా వైభవం, జవాన్‌ల వీరత్వం, మాతృభాష, మాతృభూమి సంబంధిత వస్తువులు కవితలుగా చిత్రీకరించారు. సంపుటి ఎడిటర్ వి.వి. రాఘవరెడ్డి, పర్యవేక్షకులు జి. వెంకటరెడ్డి అభినందనీయులు.

**ప్రతులకు:** శ్రీమతి జి. భవానిరెడ్డి
బి70/ఎఫ్1, పి.ఎస్.నగర్
విజయనగర్ కాలనీ
హైదరాబాద్-500 057.
సెల్: 98498 82783



-జయసూర్య
సెల్: 9014948336
9440664610

## ఆచార్య కొలకలూరి ఇనాక్, రాజ్యసభ సభ్యులు డా॥ లక్ష్మణ్‌లకు సత్కారం

మహర్షి వాల్మీకి సాంస్కృతిక, సేవా సంస్థ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ కె. లక్ష్మణ్‌లను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ 83 సంవత్సరాలు దాటుతున్న తనకు సహస్ర చంద్ర దర్శన భాగ్యాన్ని కల్పించడం సంతోషంగా ఉందన్నారు. తన సేవలను గుర్తించి సత్కరించడం సంతృప్తి కలిగిస్తుందన్నారు. మహర్షి వాల్మీకిసాంస్కృతిక సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడు



ఆచార్య కొలకలూరి ఇనాక్‌ను సత్కరిస్తున్న డా.లక్ష్మణ్, రాజగోపాల్.

డాక్టర్ వి.డి. రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, బిక్కికృష్ణ, తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు, బీజేపీ ఓబిసి మోర్చా జాతీయ నాయకుడు, డాక్టర్ పి.వి.పార్థసారథి, డాక్టర్ నాళేశ్వరం శంకరం, డా॥ వి.ఎస్.రావు పాల్గొన్నారు.

## కులం కన్న గుణం గొప్ప

పుట్టినప్పుడుమనుషులంతా ఒక్కటే
గిట్టినప్పుడుఅంతిమసంస్కారాలు
అందరికీఒకటే
దేవునిదృష్టిలో"మనిషే "దేవుడు
మనిషిదేహమే "దేవాలయం"
నీకర్మలేనీ"పూజఫలం"
మరణించినతర్వాతఅందరూ చేరేదిఒకేచోట
అధికారంఆదిపత్యంకొరకుఆరాటం
కీర్తిప్రతిష్టలకోసంకుమ్ములాట
బతికినన్నాల్లుబతుకుపోరాటం
కులంపేరునవివక్షలు అవమానాలు
మతంపేరునమారణహోమాలు
గుర్తింపుకు కులం
అధికారానికి కులం

రాజకీయపదవులకుకులం
కులంమనిషికిఆదారుకార్డ్
కులంకన్న గుణంమిన్న
అహకారంకన్న ఆత్మీయతమిన్న
ఆందోళనకన్న ఆనందంమిన్న
సంక్షోభంకన్నసంక్షేమంమిన్న
ఈర్ష్యకన్న ఓదార్పుమిన్న
సంకుచితంకన్న సౌహార్ధతగొప్ప
చావుపుట్టుకల్లోలేని అసమానతలు
ఆస్తులు సంపదలో వ్యత్యాసాలు
సామాజిక వికాసంలో అన్యాయం
స్త్రీ పురుష అసమానతలు
అధికార పంపీణీలో వివక్షలు
సమానత్వం రాజ్యాంగంలో బంధి
అయ్యింది
స్వార్థసంకుచితరాజకీయాలే
శాసనాలైనాయి
రొగికిఆపదలోఎక్కించేరక్తానికి
కులములేదు

ఆక్సీజన్ కు కులంలేదు
రోగికిచికిత్సచేసేవైద్యుడు
కులాన్నివెతుకడు
బోధించేగురువులుకులాన్ని
చూడరు
సమాజంలో ఉన్నవి రెండే కులాలు
ఉన్నోళ్లు లేనోల్లు అన్నభేదాలు
సామాజిక ఆర్థిక స్థితి మెరుగుపడితే
కులరహిత సమాజం ఆవిర్భవిస్తుంది
కులము కన్న గుణము మిన్న
అనే గుణాత్మక మార్పుల
వెలుగులో కులమనే చీకటి
తొలిగేనునవసమాజం అవతరించేను



-నేదునూరి కనకయ్య
9440245771

## రేఖల రెక్కల పక్షులు

మొక్కల పంజరాల్లో
బందీలైన పువ్వులు రెక్కలున్నా
ఎగరాలన్నా ఎగరలేని
అశక్త జీవులు వింత పక్షులు-

చిట్టి చెల్లా చెదరైన ఏకవర్ణ
హరివిల్లులు పూలు-

పసిపాపల్లాంటి ఆడపిల్లల్లాంటి
సుకుమార సుందర సుమాలు
ఉద్యానవన కాన్వాసు మీద
ఓ అజ్ఞాత చిత్రకారుడు

అందంగా గీసిన
బహువర్ణ చిత్రాలు పూలు-

వెళ్తే పూజకి లేదా
కొమ్మ నుండి మరో కొమ్మ కొప్పులోకి-

పూ జాతిలో ఆడజాతే తప్ప
మగజాతి లేదు అందుకేనేమో
ఇంటర్ కేస్ట్ సంపర్కానికి నాంది
పలికిన అనాది అంగనామణులు పూలు

వాటి సమాగమంతా విజాతి
సీతాకోక చిలుక కీటకజాతి కుర్రాళ్ళతోనే-
ఒక రోజునే కాలావధిగా గణించి
జీవించే పూవుల బతుకంతా
కొమ్మ మీద వుండేది కాసేపే

అయినా ఆ కొద్దిసేపూ
సీతాకోక బాహువుల్లోనే పరవశం-

పూజలోకి వెళ్ళినా
కొమ్మ కొప్పులోకి వెళ్ళినా
మాలలుగా మెడల మేడలెక్కినా
అక్కడే వాటి జీవన పరిసమాప్తి.



-మాధవీసనారా
8639491246

పుస్తక సమీక్ష

## విలువలతో కూడిన 'రామసక్కని గాలిపటం'


ఈ మధ్య కాలంలో బాల సాహిత్య రచనలు విరివిగా వెలువడుతున్నాయి. వాటిని చదవడం ద్వారా విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలుగుతుంది. భాషా పరిజ్ఞానం పెరుగుతుంది. సృజనాత్మక ఆలోచనలు వస్తాయి. పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు పడుతాయి. అందుకే బాల సాహిత్యంను పిల్లలకు చేరువయ్యేలా చూడవలసిన బాధ్యత ఉపాధ్యాయులపైన, బాల సాహితీవేత్తలపైన ఉంది. ఈ క్రమములో అనేక మంది బాలసాహితీ వేత్తలు పలు రచనలు చేస్తున్నారు మరియు బాలలను ప్రోత్సహిస్తూ వారిచే కూడా రాయిస్తున్నారు. అలాంటి ప్రముఖులలో భైతి దుర్గయ్య ఒకరు.

సిద్దిపేట జిల్లాకు చెందిన బాల సాహితీవేత్త, కవి, ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య పిల్లల ఆలోచనలకు అనుగుణంగా చక్కని కథలతో "రామ సక్కని గాలిపటం" అనే పుస్తకాన్ని వెలువరించారు. ఇందులో మొత్తం 20 కథలు ఉన్నాయి. ఇవన్నీ కూడా వివిధ దిన పత్రికలలో ప్రచురితం కావడం ఒక విశేషం. పలు సమకాలీన సమస్యలు ఇతివృత్తాలుగా తీసికొని పిల్లలకు అర్థమయ్యే విధంగా సులభ శైలిలో ఈ కథలను రాశారు రచయిత. ఇందులో ప్రతి కథ ఎదో ఒక ప్రత్యేకతను కలిగి ఉండి నీతిని బోధించేలా ఉంది. విద్యార్థులకు మంచి నడవడిని నేర్పేలా ఉన్నాయి ఇవి.

'మొదటి అడుగు' కథలో రఘుపతి మాస్టారు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి, వారి మనోగతంను అర్థం చేసుకొని ప్రోత్సహిస్తాడు. ఇలాంటి గురువులు ప్రతి పాఠశాలలో ఉన్నట్లయితే విద్యార్థులు భవిష్యత్తులో వారి లక్ష్యాలను చేరుకునే అవకాశం ఉంటుంది. 'తెగిన గాలిపటం' కథ బడి మానేసి ఆకతాయిగా తిరిగే గోపిలో మార్పు తీసుకువచ్చింది. గోపిలో మార్పు రావడానికి రైతు నాగయ్యతో తెగిన గాలిపటంకు విలువ ఉండదని, అలాగే దారి తప్పిన విద్యార్థికి కూడా విలువ ఉండదని చెప్పించి గోపిలాంటి విద్యార్థులకు







జ్ఞానోదయం కలిగించారు.

'ఆన్ లైన్ క్లాస్' కథ సహజ సిద్ధంగా ఉంది. కరోనా సమయంలో జరిగిన ఆన్ లైన్ క్లాస్ వలన కలిగిన ఇబ్బందులను కళ్ళకు కట్టినట్లు వివరించారు. 'గురువు చూపిన దారి' కథలో రాజు లాంటి చురుకైన విద్యార్థి గొర్రెల కాపలకు వెళ్లడం చూసిన ముత్యం సార్ రాజు వాళ్ళ తాతకు చదువు విలువను చెప్పి అతడిని బడికి వచ్చేలా చేస్తాడు. ఆ తర్వాత రాజు బాగా చదువుకొని ఉపాధ్యాయుడై పలువురికి స్ఫూర్తిగా నిలుస్తాడు. రేపటి పనిని ఈ రోజు పూర్తి చేయాలి అని హిందీ మాస్టర్ చెప్పిన మాటలను

అజయ్ ఆచరణలో పెట్టడం ద్వారా కలిగిన లాభాన్ని తెలుపుతుంది 'సమయం విలువ' కథ. దీని ద్వార పుస్తకాలు సమాజానికి చైతన్యానికి కలిగించే సాధనాలు అని చెప్పారు.

'లేత మొక్కలు' కథ పిల్లలను తల్లిదండ్రులు ఎలా పెంచకూడదో తెలియజేస్తుంది. అతి గారాభం వలన కలిగే నష్టాలను ఈ కథలో చక్కగా చిత్రించారు.

చిన్న తనంలో పిల్లలకు మంచి బుద్ధులు నేర్పిస్తే వారి భవిష్యత్తు బాగుంటుంది. లేకపోతే ఈ కథలో చెప్పిన గోపిలాగ పిల్లల భావి జీవితం జైలు పాలు కావల్సి వస్తుంది. 'మధుర కానుక' కథ చిన్నతనం లోనే సేవాగుణం అలవర్చుకున్న రాములాంటి విద్యార్థుల స్వభావ ఒను తెలుపుతుంది. ఈ కథ చిన్నతనంలోనే పిల్లలకు సేవా తత్పరత కలగడానికి ఉపయోగపడుతుంది. ఇలా ఇందులోని కథలన్నీ సందేశాత్మ కంగా ఉన్నాయి. మార్పు మం చిదే, పులితో ఆటలా, ముసలి నాన్న, రామ సక్కని బాలుడు, గురు శిష్యుల పాండిత్యం, సార్మినారు, పాత సైకిలు మొదలగు కథలు వైవిధ్యమైన కథనంతో కొనసాగాయి.

అక్షర సేద్యం ఫౌండేషన్ ద్వారా పలు వినూత్న కార్యక్రమాలను చేపడుతూ బాల రచయితలను, సాహితీవేత్తలను ప్రోత్సహిస్తూ, బాల సాహిత్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్న

భైతి దుర్గయ్య, దుర్గమ్ భైతి కలం పేరుతో పలు రచనలు చేస్తున్నారు. వారి కలం నుండి మరెన్నో బాల సాహిత్య రచనలు రావాలని ఆశిద్దాం.

**ప్రతులకు:** భైతి తార,
గ్రా. రాముని పట్ల, మం. చిన్న కోడూర్,
జి. సిద్దిపేట.. 502 267.
సెల్. 99590 07914.
పుస్తకం వెల. 80 రూపాయలు.



-కందుకూరి భాస్కర్
9703487088

## వివేకమా వర్ధిల్లు

కళకళ లాడుతున్న జీవితం
కన్నీళ్ల పాలు కు కారకులెవరు
తలతల లాడుతున్న ఆకాశం
నల్లగా అమావాస్య కావడానికి
ఎవరు దారి నిర్మించారు.

కెరటాలు కెరటాలుగా
ఆనందం గా ఎగిసిపడుతున్న
సాగరం కోపంగా
ఆకాశం అందుకోవడానికి
ఎవరు కారణం.

తోట లో ఒకే రకం పూలు
పూయాలటా
చేదు వాసనలకు ఎవరు కారణం

చల్లటి గాలిలో విషాన్ని నింపిందెవరు
తల్లి నేల దుఖానికి కారకులెవరు
మనసుల పై తెలియని పైశాచిక దాడి
జీవితాన్ని ధ్వంసం చేసే పాచికలు
ఆలోచన పై దాడి ఎవరు కారణం

మనసు కౌగిలించుకుంటున్నది
కోరుకుంటున్నది విధ్వంసపు దారిని
అన్నీ దారి తప్పుతున్నాయి
ఎవరు కారణం.

చౌరస్తా దుఃఖానికి నిండిన
రాత్రి చీకటికి శ్రమ ఓటమికి ఎవరు కారణం
అరణ్య రోధనల మధ్య సగటు మనిషి
వినే తీరిక ఎవరికి లేదు
ఎవరు కారణం .

అన్నీ జీవితాల ను విధ్వంసం చేసే
ప్రశ్న లే
అన్నీ ఆలోచనల ముందు వేధించే

ప్రశ్నలే
ఆలోచన
రగిలే నిప్పురవ్వ
రగలనియ్యి వివేక బీజం
ఆగిపోనియ్యకు చెట్టు గా ఎదగ నియ్యి
మానవతా పుష్పాలు పూయనియ్యి
ఆలోచన సౌరభాలు వేదజల్లు అంతటా
సమైక్య శాంతి గీతాలు
వినిపించు అంతటా
వివేకమా వర్ధిల్లు



- సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

## కొన్ని కుటుంబాల కన్నీటి పన్నీటి గాథ...!

కొన్ని కుటుంబాలు
ఓడిపోయిన
ఒంటరి కుటుంబాలే...
కొన్ని కుటుంబాలు
పచ్చని ప్రేమ పందిర్లే...

కొన్ని కుటుంబాల్లో
ఉరుములు మెరుపులే...
కొన్ని కుటుంబాల్లో
ఊహించని వరాలవర్షాలే...

కొన్ని కుటుంబాలు
ఆరక రగిలే అగ్నిపర్వతాలే...
కొన్ని కుటుంబాలు నిత్యవసంతాలే...

కొన్ని కుటుంబాలు
రోడ్డున పడి
విలవిల రోదిస్తున్నాయి...
కొన్ని కుటుంబాలు
నింగిలో నక్షత్రాల్లా
మిళమిళ మెరుస్తున్నాయి...

కొన్ని కుటుంబాల్లో
కుమిలిపోవడాలే...
కలతలే...కష్టాలే...కన్నీళ్లే...
ఒకరిపై ఒకరు కసితో
నిందల నిప్పులు విసురుకోవడాలే...
పగా ప్రతీకారాలతో
రగిలి పోవడాలే...
విభేదాలతో విద్వేషాలతో
విషం చిమ్ముకోవడాలే...
కొన్ని కుటుంబాల్లో
అంతులేని సంతోషాలే...
అంబరాన్నంటే సంబరాలే..

కొన్ని కుటుంబాల్లో
హాలాహలం నింపుకోవడాలే...

కొన్ని కుటుంబాల్లో
అమృతజల ప్రవాహాలే...

కొన్ని కుటుంబాల్లో
అన్నీ ముళ్ళబాటలే...
కొన్ని కుటుంబాలు విరబూసిన విరితోటలే...

కొన్ని కుటుంబాలు
వింతవింత మనస్తత్వాలతో
భయంకరమైన వ్యతిరేక భావనలతో
నిత్య సంఘర్షణలతో ఆరని కుంపట్లే...
కొన్ని కుటుంబాలు
ఫలభరిత పచ్చనిచెట్లే...



-పోలయ్య కూకట్లపల్లి
9110784502



## సింహం చనిపోయింది

(కథ)

అడవి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఏంటీ? సింహం చనిపోయిందా? ఎవరు చంపారు? ఎలా చంపారు? పక్కనే నక్క నిలుచుని ఏడుస్తుంది ఏమిటి? అసలు నక్కకు అంత ధైర్యం ఎలా వచ్చింది? సింహం అనుకుని ఉంటే ఆ నక్కను చంపి పారేసి ఉండచ్చు కానీ ఒంటరైన ఆ సింహం నక్కను ఎంతో ప్రేమగా నమ్మింది. తన శ్రేయస్సును కోరుతుందని అందరితో తెలుపుకుంది కూడా. కానీ ఈరోజు ఏం జరిగింది? సింహం చనిపోయింది. అడవిలో మృగరాజు సంచారం లేకుండటంతో అనేక జంతువులకు ఆలోచన వచ్చింది. ఎవరైనా తనకు ఆనారోగ్యం ఉన్న నక్కను అడిగితే ఆరోగ్యం క్షీణించిందని తెలిపింది. ఎవరు అడిగినా ఆరోగ్యంలో ఏమాత్రం మార్పులేదనే తెలిపింది. కనీసం సాటి జంతువులను రానీయకుండా చేసింది. ఎప్పటికప్పుడు ఆ సింహం లేస్తుందని అడవి అవాధార వదిలేయదని భావించారు కానీ ఇంతలోనే ఈ వార్త పిడుగులా వ్యాపించింది. సింహం చనిపోయింది. ఎలా? అనే ప్రశ్న నలుమూలలా వ్యాపించింది. ఎవరికి వారే ఎన్నెన్నో ఊహాగానాలు చేసుకుంటున్నారే తప్ప బయటకు తెలిపే ధైర్యం చేయలేకపోతున్నారు.

విషయం విన్న అన్ని జంతువులు అక్కడకు చేరాయి. సింహాలు సేకరించేందుకు కొన్ని కోతులు చేరాయి. కానీ ఎక్కడా ఏమీ బయటపడనీయకుండా సింహాన్ని తనతోటే నక్కల సముదాయంలో కలను చేయించింది. కంటితుడుపు అన్నట్లుగా చెట్లకొమ్మలతో ఒక స్వాగతం కూడా కట్టించింది. చేసేది లేక ఎవరికి వారు వారి గృహాలను చేరుకున్నారు కానీ ఏదో జరిగిందనే అనుమానం మాత్రం అందరిలో ఉంది. ఎవరూ బయటపడలేకపోతున్నారు అంతే.

"కుందేలు చెల్లీ" అనే ఏనుగు పిలుపుతో అక్కడే నిద్రపోతున్న కుందేలు ఉలిక్కిపడి లేచింది

కళ్ళు నలుముకుంటూ "ఏమయింది ఏనుగన్నా" అంది కుందేలు

"ఏమీ లేదు. ఊరికనే..మృగరాజు లేని అడవి బోసిపోయింది. నిద్రపట్టడం లేదు. నీతో కాసేపు మాట్లాడదామని" అంది అక్కడే కూర్చుంటూ ఏనుగు.

"అలాగా! రా అన్నా! తెల్లవారితే నేనే నిన్ను కలవాలని అనుకున్నా. తోటి జంతువులతో కొన్ని విషయాలను చర్చించాలని అనుకుంటే నాకూ అంతే తెల్లార్లు నిద్రలేదు. రాత్రంతా ఏదో కలత అనిపించింది. ఎందుకు ఇలా జరిగింది? అని ఇప్పటికీ నమ్మలేకపోతున్నా అనుకో. ఎప్పుడూ నేను చూసే కన్నబిడ్డలా చూసుకునేది. నా తెలివితేటలకు మురిసిపోయేది. నన్ను అప్పుడప్పుడూ ముద్దుపెట్టుకునేది కూడా" అంటూ కన్నీరు మున్నీరయ్యింది కుందేలు.

"అయ్యో! చెల్లమ్మా! నిన్ను అనవసరంగా ఏడిపించాను కదమ్మా! ఊరుకో.. ఊరుకో.. నాకు నీకే కాదు అందరికీ ఆవేదనగానే ఉంది. అలాగని ఎవరికీ ఏదో మేలు చేసిందని కాదు. ఎవరినో ఏదో ఆదుకుందని కాదు. ఏదో ఒక పెద్ద దిక్కులా ఉండేది కదా! ఇలా దిక్కులేని చావు చావటం ఏమిటి? అని అంది ఏనుగు తన తొండంతో కుందేలును ఓదార్చుతూ.

కన్నీరు తుడుచుకుంటూ కుందేలు నీకో విషయం చెప్పాలి ఏనుగన్నా! మృగరాజు చనిపోయిందని నేనే ఇప్పుడు ఈ అడవికి రాజు ఎవరు? అనేదే ఇప్పుడు తేలాలి అనుకుంటా నేను నిన్న రాత్రి సింహం గుహ గుండా నడిచి వస్తున్నా? అక్కడ ఈ నక్క తన వారితో కలిసి కూర్చుని, అటుగా వెళుతున్న నన్ను పిలిచి "ఇదిగో ఇలా రా" అంది. నేను ఎందుకో అనుకుని దగ్గరకు వెళ్ళాను.

"ఎందుకు ఏడుస్తున్నావు?" అంది.

"మృగరాజు లేదు కదా" అని అన్నాను

"ఉంటే మాత్రం నీకు లాలపోసిందా? జోలపాడిందా? గుటుక్కున మింగడం తప్ప. నీ మాంసం దానికి మరీ ఇష్టం కూడా. నాతో చాలాసార్లు అనేది" అంది నవ్వుతూ

"ఏమో నాకు తెలియదు. నేనన్నా, మా జాతన్నా మృగరాజుకు ఇష్టం. అప్పుడప్పుడు నాకు ముద్దుకూడా పెట్టేది" అన్నాను.

"ఇంతకీ ఇప్పుడు నీకు ముద్దుకావాలా? లేక మృగరాజు కావాలా? ఎందుకంటే ముద్దులంటే మేము పెడతాం" అంటూ ముందుకు వచ్చాయి. దాంతో భయపడిన నేను చటుక్కున దూరం జరిగాను. "పారిపోతున్న నన్ను చూస్తూ "పారిపో పారిపో.. నిన్ను మేమేమీ వెంబడించము. కానీ మేము చెప్పే విషయాన్ని ఒకటి విని మరీ పారిపో" అంటే ఆగాను

"నువ్వు ఈ అడవిలోని జంతువులన్నింటికీ ఈ విషయం చెప్పు. ఇక నుంచి నేనే ఈ అడవికి మృగరాజుని. ఎందుకంటే నేను చాలా ఏళ్ళుగా సింహం దగ్గరే ఉన్నాను. సింహం కుటుంబానికి పరిచర్యలు చేసాను. సింహం కూడా తన అంతర్గత విషయాలన్నీ నాకే చెప్పేది. నా సలహా తీసుకున్నాకే ఏ పని అయినా చేసేది. ఇంతకంటే నేను మృగరాజు కావడానికి అర్హతలు ఏమి కావాలి? అందుకే నాకు నేనే ఈ అడవికి మృగరాజుగా ప్రకటించుకుంటున్నాను. మీకు ఇష్టమైనా లేకున్నా ఒప్పుకు తీరాల్సిందే. కాదని ఎవరైనా అన్నారో మీ అంతు చూడటానికి కూడా మా జాతి వెనుకాడదు." అంటూ వికృతంగా ఊళపెట్టింది. నేను మరి వెళ్ళిపోయాను. మరి ఏనుగన్నా! ఇపుడు మన గతి ఏంటి? అంది కుందేలు అడవికి రాజును చేసి బతకాలా? దాని జిత్తుల నిత్యం భరించాలా? నాకేమీ పాలుపోవడం లేదన్నా" అంటూ కన్నీరు తుడుచుకుంది కుందేలు.

ఆ మాట విన్న ఏనుగు కోపంతో ఊగిపోయింది. అక్కరాలో నక్క దొంగ చెప్పి రాజు పదవి కావాలా? ఇన్నాళ్ళూ ఈడిగం చేసిందా? సింహం తిని పారేసిన ఎంగిలి మెతుకులు తిని, వదిలేసిన మాంసాన్ని తెగ తిని బలిసింది. దానికి తోడు ఆ విషయం ఈ విషయం చెప్పి సింహాన్ని మచ్చిక చేసుకుంది. సింహానికి బదులు అదే వేటాడి ఆ మాంసాన్ని సింహానికి అందించి మంచి పేరు సంపాదించుకుంది. అంతమాత్రాన రాజు అయిపోతుందా? ఎలా అవుతుందో ? ఎలా ప్రకటించుకుంటుందో మనమూ చూద్దాం. అడవికి మిగతావారికి ఆ రాజసం ఎక్కడిది? శరీరాకృతిలోనూ, శత్రువులను తుదముట్టించడంలోనూ నాకంటే గొప్పవారు ఎవరున్నారు? కాకుంటే నేను మాంసాహారిని కాను. అదీ మీకు మంచిదే కదా? మిమ్మల్ని చంపి తినేవారు కూడా ఉండరు. అడవిలో స్వేచ్ఛగా తిరగొచ్చు. రా. ఇపుడే ఈ విషయాన్ని అడవంతా వినిపిద్దాం" అంటూ కోపంతో వడ వడా ముందుకు నడిచింది ఏనుగు.

విషయం విన్న అనేక జంతువులు బిలబిలా బయటకు వచ్చాయి. ఎవరి ధోరణిలో వారు మాట్లాడుకుంటున్నాయి. మరొకచోట పోట్లాడుకుంటున్నాయి. కొందరు నక్కనే బలపరిస్తే మరికొందరు నక్క ఉంటే మేము అడవినే వదిలేస్తాం అంటూ అరుస్తున్నాయి. అందులో ఒకటో సమావేశ పరుద్ధాయాన్ని ఏవీ వినేలా లేవు . ఇపుడే చెయ్యాలనే ఆలోచనలో అన్నీ పడ్డాయి.

ఈ విషయం విన్న పులులు అక్కడికి చేరాయి. ఎపుడూ లేనిది ఈ అడవిలో ఈ ఆవేదన ఏంటి? సింహం చనిపోయింది సరే! ఆ తర్వాత మేమే కదా? ఇందుకు ఇంత ఆవేదన ఎందుకు? ఆలోచన ఎందుకు? నక్క ఎలా రాజు అవుతుంది? పదండి అంటూ కదిలాయి. అన్నింటినీ సమాధాన పరచి నక్కల గుంపుకు కబురు పంపింది.

ఏనుగన్న! సింహం చనిపోయి కనీసం నెల కూడా కాలేదు. నువ్వు ఎవరైనా అడుగు. సింహం తర్వాత పులిగా మా జాతే రాజరికానికి అర్హులం. మా తర్వాత నువ్వు. అంతే కానీ ఆ చిన్న చిన్న జంతువులను రాజ్యాధికారం కోసం కొట్టుకోవడం వింతగా ఉంది కదూ? అసలు ఇది ఒక్కరికైనా మత్తు పెట్టాలా? కనీసం భయపెట్టలేవా? స్మశానం దగ్గర ఉన్నాయి. ఈ వృత్తి నక్క జాతి. వాటికి రాజు పదవి కావాలా? రాణి! వాటి పని చెబుతా" అంటూ పళ్ళు నూరాయి కోపంతో పులి గుంపు.

ఈ గోల చెవిన పడుతున్న నక్కసామ్రాజ్యం అంతా కదిలింది. అడవిలోని ఒకచోట చేరమని ఆదేశాలు పంపింది. ఇక తప్పదన్నట్లు అన్నీ చేరాయి. వచ్చినవన్నీ ఎదురుగా కనిపిస్తున్న నక్కల గుంపును చూసి ఆశ్చర్యపోయాయి. ఎందుకంటే ఆ నక్కలన్నీ సింహాలలాంటి జూలును తగిలించుకున్నాయి. ఆ తర్వాత పులులు భావిస్తున్నాయి. ఆ తర్వాత ఫక్కున నవ్వాయి. ఇదంతటి జూలును తగిలించుకుంటే సింహాలు అయిపోతావా? చారలు వేసుకుంటే పులి అయిపోతావా? అని పడీ పడీ నవ్వుకున్నాయి.

ఆ నవ్వుల్ని, అవహేళనల్ని భరించలేని నక్కలు ఉన్నట్లుండి 'ఆపండి.. మీ నవ్వులు. ఏం? మేము మీ కంటికి జోకర్లలా కనిపిస్తున్నామా? ఎందుకు నవ్వుతున్నారు? మాకేం తక్కువ? ఎపుడూ సింహం లేదా పులి, ఏనుగు ఏలేదేనా అధికారాలు? మా జాతికేం తక్కువైంది? అంటూ అన్నీ గోలచేసాయి.

"అధికారం కావాలంటే అడుగు అంతే కానీ నువ్విలా జూలు తగిలించుకుని వస్తే మాకు నవ్వు రాక ఏమవుతుంది? అయినా అధికారం అనేది రూపాన్ని బట్టి రాదు. బుర్రను బట్టి వస్తుంది" అంది వెటకారంగా పులి.

"అడిగితే మీరిచ్చేస్తారా? అయినా మాకు బుర్రలు లేవని మీరలా చెప్పగలరా?" అని రెట్టించింది నక్క.

"మీరెప్పుడైతే జూలు తగిలించుకుని వచ్చారో అపుడే అర్థమయ్యింది మీకు బుర్రలు లేవని, ఒకవేళ ఉన్నా అందులో 'విషయం లేదని'" అని ఏనుగు సమాధానం ఇవ్వగానే మళ్ళీ అన్ని జంతువులు విరగబడి నవ్వాయి.

"మేము మా జాతి సింహానికి ఏళ్ళ తరబడి సేవ చేసాము. మా జాతి అంటే ఎంతో గౌరవం చూపేది సింహం. ఆకలి సమయంలో మీరెవరైనా సింహారాజు కోసం వచ్చారా? కనీసం ఎలా ఉంది అని అయినా అడిగారా? నిలదీసాయి ముక్తకంఠంతో నక్కలు.

"సేవ పేరుతో నువ్వు పడుతున్న పాట్లు, చేస్తున్న ఫీట్లు మేమంతా గమనిస్తూనే ఉన్నాం. మేము ఎలా ఉంది అని అడిగితే ఆ రోజు నువ్వేమన్నావు? అసలు అనారోగ్యం లేదు. ఎవరు చెప్పారు? చిన్న నలత అంతే అని నువ్వనలేదా?" అడిగింది గట్టిగా కోతి.

"అవును అప్పుడు ఎవరు కనక అలా చెప్పాను" అంది ఏమీ ఎరగనట్టు ముఖం పెట్టి నక్క.

"మరి నువ్వు అలా చెప్పిన రెండు రోజులకే చనిపోయింది కదా? అలా ఉన్నట్టుండి అదెలా చనిపోయింది? అసలు అనారోగ్యమనే విషయాన్ని అందరికీ తెలపాలి కదా?" అంది తోడేలు కోపంగా.

"మొదట మేమూ అలాగే అనుకున్నాం. ఉన్నట్టుండి ముంచుకొచ్చింది. రాత్రికి రాత్రి సీరియస్ అయ్యింది. దానికి మేమేం చెయ్యాలి?" అంది కూతల్ నక్క.

"మాకేం తెలియదనుకోకు. నువ్వు నీ జాతి మొత్తం సింహాన్ని బలిపేసం చేసి చంపేసారు. చంపేస్తే పదవి నీకొస్తుందన్న ఆశతో ఇలా చేసావేమో. కాని కుట్రల బుద్ధులన్నీ నీకు పదవి ఇస్తాయని ఎలా అనుకున్నావు? అంది..ఎలుగుబంటి ఆవేశంగా.

చివరికి ఏనుగు ముందుకొచ్చి "ఇపుడు ఇన్ని మాటలనవసరం. ఏ అధికారానికైనా అందరి అభిప్రాయం ముఖ్యం. జూలు తగిలిస్తే అధికారం వస్తుందనుకోవడం నీ అవివేకం. అందుకే ఎవరికి ఏ బాధ లేకుండా ఓటింగ్ నిర్వహిద్దాం! అందులో ఎవరిని ఎక్కువ మంది ఎంచుకుంటారో వారికే రాజ్యాధికారం అప్పచెబుదాం" ఏమంటారు? అనగానే ఇక తప్పదని గ్రహించిన అన్నీ అంగీకరించాయి. ఎవరికెంత బలమో తెలిసే పదవులు కావు కదా ఇవి. ఇక పై తాత్కాలికంగా పులికి అధికారం ఇద్దాం.. తర్వాత ఎవరు గెలుస్తారో అదే వేదికవుతాం.. అంతే! అంటూ వెనుదిరిగింది ఏనుగు.



-శైలజామిత్ర
9290900879

## తేదా !

అర్ధరాత్రి పట్టపగలు
కాంట్రాక్ట్ శ్రామికులు
శ్రమ చేసేరు దారులు
దొంగ దారులకు
కావలికాసే పోలీసులు
నైట్ షిఫ్ట్ డ్యూటీ
చేసే కార్మికులు
శ్రమ జీవులకు పగటికి
రాత్రికి తేదా లేనే లేదు !

అర్ధరాతిరి పట్టపగలు
క్లబ్బులు పబ్బులు గబ్బులు
అమ్ముడుపోయే గతులు
నడి వీధి వ్యభిచారాలు
ఎన్నెన్నో వింత పొందులు
మందు పొందు చిందులు
అందనిది లేనే లేదు
డబ్బుంటే రా రా అని
పిలవని పలకని వారుండరులే
అర్ధరాత్రి అర్ధరాణీయులకు
పట్టపగలు ! పట్టపగలు !!
శ్రమించే ఓపిక లేనిదొర్గాలు

కాలే కడుపు మంటలు
ఫుట్ పాత్ పై పొర్లాడే
సమాజాలో ఒంటరులు
సమాదరించే వారు వుండరు
డబ్బు లేకున్న అన్నీ
అందని ఆకాశాలే !!
డబ్బున్నది దాహం తీర్చే యేరునీరు
లేకున్న ఆరని కడలి కన్నీరు !!



-ఎల్. రాజా గణేష్,
9247483700

## దిశానిర్దేశం

పశువులే నయం
ఋతు సమయంలోనో
కార్తెల కాలంలోనో
సరాగాల పాడుతయి
పశుత్వంగా కాదు
పరస్పరాంగీకారంతో,
సంతాన కాంక్షతో...

రాక్షసులే నయం
ఆకలిస్తేనే చంపుకతిన్నారు
ఆడతనాన్నెప్పుడు
అదర్పగా అనుభవించలేదు
అమ్మతనాన్నెప్పుడు
అవమానా అగౌరించలేదు

మరి 'మర' మనుషులకేమైంది
మానవత్వపు చొక్కాను చించి
ఇనుపతొడల మనసు ధరించి
కోమలి కనిపిస్తే చాలు
మృగాలకన్నా క్రూరంగా

కామపంజా విసురుతున్నారు
పసిమొగ్గలు చిదుముతున్నారు

కామాంధులపై కరుణెందుకు,
కాలయాపనతో క్షమాభిక్షలెందుకు,
మానవత్వాన్నే పీడించేవాడికి
మానవ హక్కులెందుకు?
ఒంటిపై చెయ్యేయ్యాలంటేనే
ఒంట్లో వొణుకు పుట్టాలి
కాని పని చెయ్యాలంటేనే
కపాలం కంపించాలి!!



-గంగాపురం శ్రీనివాస్
9686305949

పుస్తక సమీక్ష

## పసివాడని కథలు ఈ పసిమొగ్గలు

20వ శతాబ్దపు ప్రథమార్థపు విద్యా వేత్త ఏ.ఎస్.నీల్ స్కాట్‌లాండ్ వాసి. ఆయన ఇలా అంటారు. "పిల్లల భావావేశాలను స్కూళ్ళలోని పాఠ్యాం శాలు పట్టించుకోవడం లేదు. స్కూలు బయటి అంశాలు-అంటే- టెలివిజన్, పాప్ సంగీతం, ఇంటి, బయటి, ఆటలు, జూదం, బొమ్మల పత్రికలు లాం టివి వారికి ఉపశమనం కలిగిసున్నాయి".

పై ఆటికి తోడుగా, నేడు కంప్యూటర్లు సెల్‌ఫోన్లు, క్రికెటు వంటివి మరింతగా తమ ప్రభావాన్ని చూపెడుతున్నాయి. దూరమవు తున్న సమిష్టి కుటుంబ జీవనం, కరోనా ప్రభావం వల్ల ఆన్‌లైన్ క్లాసులు. పాశ్చాత్య విద్యా బోధన పద్ధతులు పిల్లలను మరింత దూరం పెడుతున్నాయి. పిల్లల ఆలోచనా ప్రపంచాన్ని, వాళ్ళ భావావేశాలను అర్థం చేసుకుని స్పందించటం దాదాపు మృగ్యమవుతోంది. తమంతట తాము కొనుక్కుని చదవగల ఆర్థిక స్వాతంత్ర్య లేమికూడా పిల్లలను బాల సాహి త్యానికి దూరంగా ఉంచుతోంది. గతంలో ప్రసిద్ధ రచయితలందరూ. బాలల కోసం రాసే వారు. నేడు ప్రచురణకర్తలు కూడా బాల సాహిత్యం యెడ సవతిచూపు చూపిస్తు న్నారు.

ఇన్ని అరిష్టాల మధ్య కొట్టుమిట్టా డుతోన్న బాల సాహిత్య స్థితి నేడు కొంత 'మెరుగు' అనుకోవచ్చును. డా॥పత్తిపాక మోహన్ డా॥వి.ఆర్. శర్మ, చొక్కాపు వెంకటరమణ, కందేపు రాణీప్రసాద్ గరిపల్లి అశోక్, మణికొండ వేదకుమార్, డా॥భూపాల్‌లాంటి వారలు పిల్లల సాహిత్యాన్ని ప్రోత్సహిస్తు న్నారు. రాస్తున్నారు. ఈ మధ్య చోటు చేసుకున్న మరో గణనీయమైన అంశం- పిల్లలు తామే తమకు కావల్సిన సాహిత్యాన్ని సృష్టించుకుంటున్నారు.

రేపటి పౌరులను తీర్చిదిద్దే విధంగా ప్రభుత్వం, ప్రచురణకర్తలు రచయితలు తమ దృష్టిని సారించటం ఒక ఆరోగ్యకర మైన పరిణామం.

బాల సాహిత్యాన్ని సృష్టిస్తోన్న తెలుగు రచయితల్లో శ్రీమతి యలమర్తి అనురాధ గారి కృషి ప్రశంసనీయం, దాదాపు వెయ్యికి పైగా కథలు, కవితలు, వ్యాసాలు నాటికలు తెలుగు లోకానికి అందించారు. గుర్రం జాషువా, కొనకళ్ళ సోమేపల్లి, రావూరి లాంటి ప్రముఖుల పేరిట స్థాపించబడిన అవార్డులు అందుకున్నారు. తానా, డా॥సినారె, పలు జిల్లా పురస్కారాలు అందుకున్నారు. హోం సైన్సు బి. ఎస్సీ చేసినా, ఆమె 'డ్రీంసైన్సు' రచనా వ్యాసంగం. సామాజిక స్పృహ ఉన్న రచనలు చేయటం స్త్రీ చైతన్యానికి కృషి, బాల వికాసం, ప్రకృతి ఆరాధన ఇష్టమైన విషయాలు.

ప్రస్తుత బాలల కథా సంపుటి "పసిమొగ్గలు"లో 30 బాల కథలు, కథ ల్లాంటి వ్యాసాలున్నాయి. వీటన్నింటినిండా బాలలకు బుద్ధిగరిపే నీతి, మంచి మాటలున్నాయి. సమసమాజాన్ని ఇష్టపడే ఈ రచయిత్రి జానపద కథలు రాజులు, రాజ్యాల జోలికి పోలేదు. బాలలు, బాలల చుట్టూ ఉండే కుటుంబాలు బాంధవ్యాలు, స్కూలు వాతావరణం, తోటి విద్యార్థులు, అధ్యాప కులను తమ కథా వస్తువుగా తీసుకున్నారు. ప్రతికథకు ఓ అందమైన బొమ్మ ఇచ్చి పిల్లలను ఆకట్టుకునే ప్రయత్నం చేసారు.

బాలలు అన్న పదానికి శబ్ద రత్నాకరం లో 16 ఏండ్లలోపు అని ఉన్నా, డా॥ మోహన్ పత్తిపాక వివరణ ప్రకారం18 ఏళ్ళలోపు వారిని 'బాలలు' అంటారుట. అనురాధగారి ఈకథలన్నీ 12,15 ఏళ్ళు దాటిన వారు అర్థం చేసుకునేలా ఉండటం విశేషం. క్లాసులో సహాధ్యాయిల మధ్య స్నేహం వర్థిల్లాలనీ, 'వాళ్ళూ, వీళ్ళూ ఏదో చెబితే మారిపోయేది స్నేహం కాదని అలాం టి వాళ్ళు స్నేహితులు కారని 'స్నేహం' కథ చెబుతుంది. పన్నెండేళ్ళ విదయ (విద్య)కు చదువుకోవాలన్న ఆరాటం. కూలీపని చేసుకుంటూ పొట్ట పోసుకునే తల్లిదండ్రులకు విద్యను చదువుకోవటానికి పంపించే స్థోమత లేదు. అయినా ఆ అమ్మా యి డిగ్రీ, బి.యిడి. పూర్తి చెయ్యగలిగింది.






పట్టుదల కార్యదీక్ష ఉంటే అసాధ్యాలు కూడా సుసాధ్యాలు అవుతాయని 'గురుదక్షిణ' కథ చెబుతుంది. పెద్దలు పిల్లల మంచి కొరకే చెబుతారనీ పెద్దల మాట వినాలనే నీతి 'విలువ' కథ బోధిస్తుంది. తమకంటే తక్కువ ఆర్థిక స్థాయిలో ఉన్న వారిని ఆదుకోవాలని, వారి యెడ చూపాల్సింది మానవత్వం కాని - ఈసడింపు కాదని 'మానవత్వం' కథ చెబుతుంది.

అనురాధగారి కథల్లో మనుషులే కాదు. జంతువులు కూడా (అందం-కథ) కథలు చెబుతాయి. ఉడతలఋ రామచిలుకలు 'చెప్పుడు మాటలు వినొద్దు' (పే.56) అంటాయి. రిక్షా తొక్కే రాజయ్య (సంతృప్తి) ఉంటాడు. పట్టుదల ప్రయత్నంతో దేన్నైనా సాధించవచ్చును. అంతర్జాతీయ ఖ్యాతినీ గడించవచ్చునని (అసూయతెచ్చిన మార్పు) చెబుతుంది.

బాలల మనోవికాసానికి వారి ఆలోచనాశక్తికి ఊతం ఇచ్చే మంచి కథలివి. పసిమొగ్గలే కాదు. నేడో రేపో వికసించబోతోన్న పూమొగ్గలకూ ప్రేరేపణ నిచ్చే కథలివి.

**ప్రతులకు:** యలమర్తి అనురాధ
బి.బ్లాక్-205శ్రీ వెంకటసాయి గ్రీన్ సిటీ
చంద్రాగార్డెన్స్ దగ్గర
గాయత్రీనగర్, హైదరాబాద్-500 018
సెల్: 9247260206



- కూర చిదంబరం
సెల్: 8639338675

## మట్టి మనిషి మా నాన్న

అతను మబ్బుల్లోనే నిద్ర లేచి
పగలంతా పాదముద్ర లతో అలసి పోయి
నిశీది రాత్రి లో సేద తీరుతున్న
పుడమి తల్లిని తట్టి లేపుతాడు
"పేదరికం " అనే కొండచిలువ చుట్టేసిన
మా నాన్నని పూట కోసం సదా సర్కస్ ఫీట్లను వేస్తాడు

పనిని అమ్మ లా ఆప్యాయంగా
ఊయలేసి ఊపుతాడు మా నాన్న
కష్టాల కావళ్ళను భుజాలపై మోస్తూ
ఎర్ర టెండలో ఎముకల గూడును కదిలించి
కొలిమిలో కొరకాసు లా కాలుతూ
మా కంచం లో బువ్వపూలు
పూయిస్తాడు మా నాన్న.

తుండు గుడ్డ ను తలకు చుట్టుకొని
మట్టి పరిమళాన్ని ఎదకు రాసుకొని
అవని పై సుద్ద పోసి అర్రలుగా మార్చే
మా నాన్న మంచి పురోహితుడు
ఇటుక ఇటుక ను పేర్చి ఇండ్లను నిర్మించే
మా నాన్న మంచి ఇంజనీర్

మాటల తీరును బట్టి మనుషులను
అంచనా వేసే మంచి సైకాలజిస్ట్ మా నాన్న.

లైన్ దారాన్ని పట్టుకొని అక్రమంగా ఉన్న
గోడను సక్రమంగా చేసే మా నాన్న
నా నిరాశల నావకు
ఆశల తెరచాపలు పరుస్తూ నా జీవిత
చక్రాన్ని మలుపు తిప్పాడు మా నాన్న
ఆయన స్వేద వస్త్రంతో ముఖము
తుడుచుకొని నేను సరస్వతీ పుష్పం గా పూసాను
కడుపులో కల్మషాల కంపు లేని
కడిగిన ముత్యం మా నాన్న
ఆయన పెదవుల పర్వతాల పై నుండి
నిత్యం నవ్వుల జలపాతాలు దూకుతూనే
ఉంటాయి
గటక తిని , గంజి తాగిన మా నాన్న కు
సూది మందు సుతారం తెలియదు
ఆయన నడకే ఆయనకు దివ్య ఔషధం
ఆయన సుదూరపు ఆలోచన లే
నా తనువుకు వెలుగు రేఖలు .



-తాటిపాముల రమేష్
7981566031

## శ్వేతకపోతాలు

ఎవరో రగిల్చిన రాజకీయ స్వార్థపు నిప్పుకణిక
మతోన్మాద గడ్డివామును రాజేసింది
ముఖాన్ని కప్పుకునే ముఖమల్ గుడ్డపేలిక
ప్రాణాలు తీసే కరవాలంగా మారింది
ఆదిమవాసీ కాలపు సంప్రదాయాల మూర్ఖత్వం
రోదసీయానపు రోజులలోను రోత పుట్టిస్తున్నది
నాగరికపు సమాజం నేతిబీర చందమై
ఆటవిక మూలాలను ప్రతిబింబిస్తున్నది
ప్రశ్నించే గొంతుకకు నీరాజనం పలికే సమాజం
నిర్బంధించే గొంతును ఎందుకు నొక్కలేకపోతున్నది
మతాలచిచ్చుకు సిద్ధపడ్డ యువతరం
మతమేలేని లోకానికి ఎందుకు నాంది పలకలేక పోతున్నది
కుల, మతాలకు చోటునివ్వని దరఖాస్తులు కావాలి

భారతీయులమన్న స్పృహ యువతకు కలగాలి
వాక్ స్వాతంత్ర్యం కల్పించిన ప్రజాస్వామ్యం
స్వేచ్ఛా వస్త్రధారణకు అనుమతినివ్వదా
రాజ్యాంగానికి చెదలు పట్టిందనే మేధావులు
మార్చి ఉద్ధరించాలనే మిడిమిడి జ్ఞానులు
రాజకీయ బురదను సమాజంపై చిమ్ముతున్నారు
సమాజానికి పట్టిన వికృత జాడ్యాలను వదిలించి
సమసమాజ స్థాపనకై యువరక్తం కదంతొక్కాలి
ప్రతి కలం అందుకొరకు అక్షరయాగం చేయాలి
ప్రతి పాదం అదే లక్ష్యంగా ముందుకు కదలాలి
రుధిరమంటని శ్వేతకపోతాలుగా
జనం జాగృతమవాలి
మానవత్వపు పునాదుల
మీద ప్రగతిరథం పరుగెత్తాలి...



-శింగరాజు శ్రీనివాసరావు
9052048706


24

# ఉద్యమం రాజకీయం



– బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

"ఈ నవలలో ఎన్నో పాత్రలు. కొన్ని సజీవ పాత్రలు. మరికొన్ని మాజీ ప్రధాని పీ.వీ. రాసిన 'లోపలి మనిషి' నవలలోలాగ సజీవ పాత్రలను కలగా పులగం చేసిన చిత్రణ. కొన్ని ఊహాత్మక పాత్రలు. కొన్ని ఆదర్శ పాత్రలు. వీటిక్కూడా మూలరూపాలు... లేకపోలేదు" అని రచయిత బి.యస్. రాములు అన్నారు. ఆలోచింపజేసి, చైతన్య పరచే ఈ 'చూపు' నవలను ప్రతిరోజు నేటినిజం పాఠకులకోసం...
– సంపాదకులు.



మనోహర్, మరికొందరు ప్రధానమంత్రిని కలిశారు. ప్రత్యేక రాష్ట్రం గురించి ఫజల్ అలీ కమీషన్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంగా ఉండాలని చెప్పిన విషయం గురించి వివరించారు. అంతా విని ప్రధానమంత్రి అనునయిం చాడు. వారి కర్తవ్యం గుర్తు చేశారు.

"మీ కోరిక సరైనదే కావచ్చు. ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఉత్తరాంచల్ రాష్ట్రాలు కావాలని చాలా పెద్ద ఉద్యమాలు నడుస్తున్నయి. పార్టీలు పెట్టుకొని ఎన్నికల్లో కూడా గెలుస్తున్నరు. ఇంకా చాలా ప్రాంతాలనుండి రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్లు వస్తున్నయి. 565 సంస్థానాలను కలిపేసి రాష్ట్రాలను ఏర్పాటు చేయడంవల్ల అభివృద్ధి చెందిన ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతాల మధ్య సంఘర్షణ పెరగడం వాస్తవం. అయితే దాన్ని ఇప్పుడు మళ్లీ రాష్ట్రాల పునర్విభజన కమిటీ అంటూ ఏర్పాటు చేస్తే తేనెటీగల తుట్టెను కదిలించినట్లవుతుంది. మీ కోరికలు సమంజసమైనవే కావచ్చు. అయితే మా అంతట మేము ఒక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయలేము. మీరు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించండి. ప్రజలకు, సమాజానికి ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను అర్థం చేయించండి. ప్రజలు చైతన్యవంతంగా ఉద్యమాలు చేయకుండా ప్రభుత్వాలు తమంతట తాము ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం ఎక్కడైనా వుంటుందా? తల ఒగ్గి నిర్ణయాలు తీసుకుంటయి. అందువల్ల మీరు, మీ రాష్ట్రం కోసం ఉద్యమించండి. ఇలా చెప్పినట్టు ఎక్కడా చెప్పకండి. అలా చెప్తే నేనే మళ్ళీ మిమ్మల్ని వ్యతిరేకిస్తూ, ఖండించాల్సి వస్తది".

×××

మనోహర్‌కు ఈ ఉద్యమాలు, రాజకీయాలు, వాటి వెనుక జరిగే నిర్మాణాలు, చర్చలు, క్రమక్రమంగా అర్థం అవుతున్నాయి. ఢిల్లీనుండి హైదరాబాద్‌కు మారితే మంచిదా... ఢిల్లీలోనే ఉంటే మంచిదా... అని మనోహర్‌లో కొత్త ఆలోచనలు మొదలయ్యాయి.

ప్రొఫెసర్ లక్ష్మీపతికి ఫోన్ చేసి ప్రధానమంత్రి చెప్పిన విషయాలు చెప్పుకొచ్చాడు మనోహర్.

ప్రొఫెసర్ లక్ష్మీపతి, అరుణ్, విజయ్, దీప్తి, సృజనలకు అవే విషయాలు ప్రధానమంత్రి చెప్పాడనే విషయం చెప్పకుండా జాగ్రత్తపడ్డాడు.

"అమెరికాలో అందరికి 12వ తరగతిదాక ఉచిత విద్య అందిస్తున్నారు. మనదేశంలో కనీసం 17 సంవత్సరాల ఉన్నత విద్య ఉచితంగా అందించడం అవసరం" అన్నాడు అరుణ్.

"మన తెలంగాణాలోని సర్‌ప్లస్‌ను వనరులను, ఇతర ప్రాంతాలకు తరలించుకుపోవడం, ఉపాధి అవకాశాలు కొల్లగొట్టడం వల్ల పేదరికం, అసమానతలు పెరిగిపోతున్నాయి" అన్నాడు విజయ్.

"ఎగిరిపోతున్న యవ్వనం. కరిగిపోయిన కన్నీళ్ళు. పెరిగిపోతున్న బాల్యం. ఎండిపోతున్న పొలాలు. అడుగంటిపోతున్న భూగర్భ జలాలు. తెలంగాణ ప్రాంతంలో కరెంటు మోటార్లు, వ్యవసాయ పంపుసెట్లు ఎక్కువ వుండటం కొందరు గొప్ప అనుకుంటున్నరు. అది గొప్పకు నిదర్శనం కాదు. సాగునీటి ప్రాజెక్టులు లేక, లక్షల రూపాయల అదనపు పెట్టుబడి పెట్టి బావులు తవ్వి, బోర్లు వేసి, కరెంటు లైన్లు తీసుకొని, మోటార్లు పెట్టుకొని వ్యవసాయం చేయాల్సిన దుస్థితి. ఇలా తెలంగాణాలో వ్యవసాయ పెట్టుబడి ఇతర ప్రాంతాలకన్నా ఎక్కువయిపోయింది. దానివల్ల కూడా సరిగ్గా పండని పంటలు, కరువులు, తుఫాన్‌ల వల్ల ఎంతో నష్టపోతున్నరు" అన్నాడు ప్రొఫెసర్ సత్యనారాయణ.

> "భూమి లేని వాళ్ళే 70 శాతం మంది. వాళ్ళకు చదువు కావాలె. ఉద్యోగాలు కావాలె. ఉన్నత విద్య ఉచితంగా అందించాలె. వాళ్ళకు, ఉద్యోగాలే జీవనాధారం. అందువల్ల ప్రభుత్వం అనేక సంస్థలను, పరిశ్రమలను స్థాపించాలె. స్థాపించి, ఉపాధి కల్పించాల"

అలా చేస్తే దాన్ని వ్యతిరేకించేవాళ్ళు ఉద్యమిస్తరు. రద్దు చేయిస్తరు. రిజర్వేషన్లు పెంచితే, వాటిని వ్యతిరేకించేవాళ్ళు ఏం చేసిన్రో తెల్వదా!. బీసీలకు అన్నిరంగాల్లో రిజర్వేషన్లు ఇస్తమని, స్వాతంత్ర్యం అయితే రానీ అని, గాంధీజీ కాంగ్రెసువాళ్ళు అన్నరు. ఆ తర్వాత ఇచ్చిన్రా? కాకా కాలేల్కర్ కమీషన్ వేసిన్రు. జనతాపార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినంక మండల కమీషన్ వేసింది. అనేక సూచనలు చేసింది. అయినా అమలు చేసిన్రా? అమలుకోసం ప్రయత్నిస్తే వి.పి. సింగ్ గారి ప్రభుత్వమే కూలి పోయింది. దేనికైనా ప్రజాస్వామ్యంలో న్యాయం కోసం కూడా, సామాజిక న్యాయం కోరుతూ ఉద్యమాలు చేసినప్పుడే కొన్నైనా ప్రభుత్వాలు కలిసి పని చేయడం లేదు".

"ఈ కుల వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ కంపార్ట్‌మెంట్ ఆలోచనా విధానాన్ని రుద్దుతున్నది. ఎవరు గీసుకున్న సరిహద్దు గీతల్లో వారు కట్టుబడి పోతున్నరు.

"మనవాళ్ళకు అందరు కలిసి పనిచేసే కార్పొరేట్ సంస్కృతి రాలేదు. సన్నకారు రైతులో ఉండే స్వతంత్ర ప్రతిపత్తి, ఆలోచనలు, భూస్వామ్య సంస్కృతి నుంచి బయటపడలేదు".

"మార్వాడీలు, గుజరాతీలు కొన్ని వందల ఏండ్లుగా ఇతర దేశాల్లో వ్యాపారాలు చేస్తున్నారు. వాళ్ళ రక్తంలో వ్యాపారం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్వభావం కలిసిపోయింది".

"ప్రాజెక్టులు అవసరమే. అయితే అవి అందరికీ ఉపాధి కల్పించవు. భూమి ఉన్నవాళ్ళకే ప్రాజెక్టులు ఉపయోగపడతయి. పంట పెరుగుతది. నిజమే. కానీ, భూమి లేని వాళ్ళే 70 శాతంమంది. వాళ్ళకు చదువు కావాలె. ఉద్యోగాలు కావాలె. ఉన్నత విద్య ఉచితంగా అందించాలె. వాళ్ళకు, ఉద్యోగాలే జీవనాధారం. అందువల్ల ప్రభుత్వం అనేక సంస్థలను, పరిశ్రమ లను స్థాపించాలె. స్థాపించి, ఉపాధి కల్పించాలె. వ్యవసాయం గురించి మాత్రమే మాట్లాడితే భూమి లేని పేదలకు ఏం లాభం? భూమి లేని పేదలకు ఉద్యోగాలు అవసరం. వారిని ఆధునిక అభివృద్ధిలో భాగస్వాములను చేయడం అవసరం. అందుకు అత్యున్నత అభివృద్ధి అందరికి సమాన పంపిణీ, సమాన అవకాశాలు అందినప్పుడే పేదల జీవన ప్రమాణాలు ఎదుగుతయి".

"తెలంగాణ ఉద్యమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు నాయకత్వం వహించాలె. మల్లా కొందరే ఉద్యమాన్ని చేతిలోకి తీసుకుంటున్నరు. బహుజనుల నాయకత్వాన్ని అభివృద్ధి పరచాలె" అన్నాడు అరుణ్.

"అదెలా సాధ్యం? ఇక్కడి సామాజిక పాలకవర్గాలే ఆంధ్రావాళ్ళతో వేగలేకపోతున్నరు. ఎదిరించలేకపోతున్నరు. ఎదగలేక పోతున్నరు. వాళ్ళకింద పనిచేస్తూ, అణిగిపోయి, పేదరికంలో మగ్గుతున్న బహుజనులు ఆంధ్రా, కమ్మ, రెడ్డి ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఎట్లా పోరాటం చేయడం సాధ్యం? మన ప్రాంత అగ్రకులాలవారే వాళ్ళను ఎదిరించలేక ఓడిపోతున్నరు. ఈ కుల వ్యవస్థ, బహుజన కులాల నాయకత్వాన్ని అంగీకరిస్తుందా?" అన్నాడు ప్రొఫెసర్ బియ్యాల జనార్ధనరావు.

"మీరన్నది నిజమే... అగ్రకులాల వాళ్లను నాయకులుగా నెత్తికెత్తుకు న్నట్లుగా బహుజన నాయకత్వాన్ని ఎవరూ అంత తొందరగా ఆమోదించరు. అట్లా ఆమోదించేదైతే ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగానయినా గెలిచుండే వాళ్ళుగదా. ఎంతమంచోళ్ళయినా బహుజనులను గెలిపించకపోవడానికి కారణం ఏమిటి? వాళ్ళే మెజారిటీ అయినా కొద్ది జనాభా వున్న అగ్ర కులాలోల్లే ఎందుకు గెలుస్తున్నరంటవు. ఒక ఎమ్మెల్యేగా గెలువలేని స్థితిలో మొత్తం ఉద్యమానికి బహుజనులు నాయకత్వం వహించడం ఎలా సాధ్యం? ఎవరు అంగీకరిస్తరు?. ఆర్థిక వనరులు ఎవరు సమకూరుస్తరు? రెడ్లు, వెలమలే అన్నీ ఉండి ఆంధ్రావాళ్ళతో గెలవలేకపోతున్నరు. అరుణ్! బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఎట్లా గెలుస్తరు..." అంటూ విమర్శించాడు ప్రొఫెసర్ లక్ష్మీపతి. మళ్లీ తానే అందుకొని...

"అరుణ్! సృజనా! ఈ చర్చలన్నీ ఒక జాతి విముక్తిలో ఎందరు ఎన్ని రకాల ఆశలతో కలిసివస్తరో తెలుపుతయి. జాతీయోద్యమం, ప్రజల్లో ఎన్ని రకాల ఆలోచనలను, ఆశలను రేకెత్తిస్తుందో తెలుపుతయి. ప్రజలు ఎన్ని రకాలో... అన్ని రకాల ఆశలను జాతీయోద్యమం రేకెత్తిస్తుంది. వారి వారి కోరికలు, డిమాండ్లు సిద్ధాంతాల రూపం ధరిస్తయి. అవన్నీ చూడ్డానికి పరస్పర వైరుధ్యాల్లాగ కనిపిస్తయి. కానీ పరస్పర విరుద్ధం కాదు. అవన్నీ జాతీయోద్య మం ద్వారా విస్తరిస్తున్న చైతన్యానికి, మేలుకొలుపుకు నిదర్శనాలే. ఆయా అవసరాలే డిమాండ్లుగా, సిద్ధాంతాలుగా ముందుకు వస్తయి. అవన్నీ కలిస్తేనే జాతీయోద్యమం విస్తరిస్తుంది. ఇవన్నీ ఒక కుదురు నుండి విస్తరించిన కొమ్మలు, రెమ్మలు... తాము ఎదగాలనే ఆకాంక్షను తెలుపుతయి.

"కులవృత్తులు పోవాలని ఒకరు, కులవృత్తులను రక్షించుకోవాలని ఒకరు వాదించడం పరస్పర విరుద్ధం కాదా సార్?" అంటూ ప్రశ్నించాడు అరుణ్.

"అవి పరస్పర విరుద్ధం ఏం కాదు. ఈ రెండు ఒకే కుదురు నుండి పుట్టిన కొమ్మలు. ఎలాగైనా ఎదగాలనే ఆకాంక్ష రెంటిలో ఉన్న మూలం. పరిశ్రమలు జాతీయం చేయాలని ఒకరు, ప్రైవేటీకరించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యం, నిర్వహణ సామర్థ్యం పెరుగుతుందని, ఉత్పత్తి ఖర్చు తగ్గుతుందని మరొకరు వాదిస్తుంటరు. ఎలాగైనా ఉత్పత్తి పెరగాలని, ఉద్యోగ అవకాశాలు, జీవన భద్రత పెరగాలనేది వాటి అంతస్సారం.

అన్ని వర్గాలవాళ్లు ఉద్యమం నుంచి ఆశిస్తున్నరు. తాము ఎదగడానికి అవకాశం కలుగుతుందని అనుకున్నపుడే ముందుకువస్తరు. స్వతంత్రేచ్ఛ పెరుగుతుంది. ఎదిగే అవకాశాలు సన్నగిల్లినప్పుడు స్వతంత్రేచ్ఛ కూడా సన్నగిల్లుతుంది. హృదయం నిరాశతో ఎండిపోయి, బండబారుతుంది. అపుడు తమ కర్మ అని, కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలను ఆశ్రయించి తృప్తి చెందుతరు" అంటూ అనేక సిద్ధాంతాల, డిమాండ్ల అంతస్సారాన్ని సంశ్లేషిస్తూ వాటన్నిటికి మూలవేరు ఒక్కటే అని వివరించాడు ప్రొఫెసర్ లక్ష్మీపతి.

"అయితే ఏయే వర్గాలను, డిమాండ్లను కలుపుకొని పోతే ఆయా వర్గాలే ఉద్యమంలో కలిసివస్తరు. అంతేకదా సార్!" ఏదో కనుక్కున్నట్టుగా, ఉత్సాహంగా అడిగాడు అరుణ్.

ప్రొఫెసర్ లక్ష్మీపతి నవ్వుతూ "అంతేకాదు. ఏ డిమాండ్లను ముందుకు తెస్తే ఆ వర్గాలనుండే నాయకత్వం ఎదుగుతుంది. మా ఉద్యోగాలు మాకు కావాలి అనే డిమాండు ముందుకు వస్తే విద్యార్థులనుండి, యువకులనుండి, విద్యావంతులనుండి నాయకత్వం ఎదుగుతుంది... అట్లా భూమి లేని విద్యావంతులు కాలేజీలు, యూనివర్శి టీలు, స్కూళ్ళు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు పెరగాలని ఉద్యమిస్తరు...

భూమిలేని పేదవర్గాలు ఉద్యమంలో ముందుకువస్తే, దున్నేవారికి భూమి కావాలని, లేదా భూమిని జాతీయం చేయాలని

> "తెలంగాణాలోని సర్‌ప్లస్‌ను వనరులను ఇతర ప్రాంతాలకు తరలించుకుపోవడం, ఉపాధి అవకాశాలు కొల్లగొట్టడం వల్ల పేదరికం, అసమానతలు పెరిగిపోతున్నాయి"

నాయకత్వంలోకి వస్తరు. భూములకు సాగునీరు ప్రాజెక్టులు కావాలె. ఉచిత కరెంటు కావాలె అనే డిమాండ్లు ముందుకు వస్తే, ఆ భూములున్న వర్గాల నుండే నాయకత్వం ఎదుగుతది. ఇట్ల డిమాండ్లను బట్టి నాయకత్వం ఎదుగుతుంటది... నాయకత్వం వర్గ స్వభావం సంతరించుకుంటది".

ప్రొఫెసర్ లక్ష్మీపతి మాటల్తో అరుణ్, సృజన, విజయ్‌లు అట్టెట్లా అని చర్చకు దిగారు. ఎవరు నాయకత్వంలోకి వచ్చినా, ప్రజలందరి గురించి పట్టించుకోవాలి కదా... ప్రజలందరి నుండి నాయకత్వం ఎదిగించాలి కదా! అని ఆవేశపడిపోయారు.

"మీ ఆవేదన, ఆవేశం సరైందే. కానీ ఎవరి స్వార్థం వాళ్ళది. ఏ విత్తనం పెడితే ఆ మొక్కలే పెరుగుతయి. ఇంతకన్నా ఏం చెప్పలేను" అంటూ చర్చను ముగించాడు ప్రొఫెసర్ లక్ష్మీపతి.

అరుణ్, విజయ్ ఆలోచనలో పడ్డారు. ఇంటివద్ద చెల్లెలు తులసి, తల్లి కష్టపడుతున్నారు. తనకు ఉద్యోగం లేదు. ఉద్యమాలంటూ, నాయకత్వం అంటూ తిరిగితే తిండి పెట్టేవాళ్లు లేరు. తాను ఎలాగో తిన్నా, ఇంటికాడ పేదరికం ఆకలి బాధలు తీరేదెలా... అనుకుంటూ ఆలోచనలో పడిపోయాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదాక ఉద్యోగాలు రావు. ఉద్యోగాలు వచ్చేదాక బతుకు బాగుపడే అవకాశం లేదు. రిటైరైన ఉద్యోగాలన్నీ నింపకుండా కంప్యూటరై జేషన్ వల్ల ఆ ఉద్యోగాలు అవసరం తీరిపోయిందంటూ వేల ఉద్యోగాలు రద్దు చేస్తున్నారు. జనాభా పెరుగుతుంటే ప్రభుత్వ ఉద్యోగాలు రెట్టింపు అయ్యే బదులుగా ఉన్నవే తగ్గిపోతున్నాయి. దీనికి పరిష్కారం ఏమిటో... ఉద్యమం చేస్తే తప్ప ఉద్యోగాలు రావు. తిండికి లేకుండా ఉద్యమాలు చేయడం ఎలా... ? అరుణ్ విజయ్‌లు అనేకసార్లు చర్చించుకుంటున్నారు.

మారోజు వీరన్న నాయకత్వంలో 36 తెలంగాణ సంఘాల ఐక్య వేదిక ఏర్పడింది. పాశం యాదగిరి తదితరులు ఏవేవో సదస్సులంటున్నారు. ఎక్కడైనా, ఏదైనా డబ్బుతోపని. కనీసం బస్సు చార్జీలు కూడా కష్టమవుతున్న దశలో ఏ ఉద్యమాల్లో ఎలా పాల్గొనడం... ఎలా నడపడం... అనేది పెద్ద సమస్యగా మారిపోయిందని అరుణ్, విజయ్‌లు ఆలోచనలో పడిపోయారు.

---

# పిసినారితనం

అనగనగా హనుమకొండ అనే ఊరిలో రాజయ్య అనే వ్యక్తి ఉండేవాడు. అతడు మిఠాయి వ్యాపారం చేస్తూ ఉండేవాడు. అతడికి పిసినారి తనం చాలా ఎక్కువ. అతడు ఎంత పిసినారి అంటే ఇతరులు?1,000/– సహాయం చేయమని అడిగితే ?1/– ఇచ్చి ?1,00,000 ఇచ్చినట్లు గర్వపడేవాడు. రాజయ్యకు భార్య మరియు ఒక కొడుకు ఉండేవారు.వారిపేర్లు రాధమ్మ,శ్రవణ్. వారిద్దరూ చాలా మంచివారు. రాధమ్మ రాజయ్యకు పిసినారి తనం మార్చుకొమ్మని ఎన్ని సార్లు చెప్పినా తను వినిపించుకునేవాడు కాదు. రాజయ్య ఇంటి సరుకుల ఖర్చులకు మరియు శ్రవణ్ స్కూల్ ఫీజులకు కూడా డబ్బులు ఇచ్చేవాడు కాదు. అందువల్ల స్కూల్ టీచర్లు శ్రవణ్ ను స్కూల్ నుండి గెంటేసారు. రోజూ ఇలాగే జరుగుతుండడం తో ఆహారం కూడా లేకపోవడంతో రాధమ్మ బాధపడి ఏం చేయాలో తెలియక ఇంటింటికి తిరిగి"భవతి భిక్షాం దేహి",అంటూ ఆహారాన్ని అడగడం మొదలుపెట్టింది. రాధమ్మ పక్కింట్లో రజనీ అనే ఆమె ఉండేది. ఆమె చాలా మంచిది. రాధమ్మను చూసి తను ఎంతగానో బాధపడేది. ఒకరోజు రాధమ్మకు ఎవ్వరూ ఆహారాన్ని ఇవ్వలేదు. శ్రవణ్ కు బాగా ఆకలి వేసింది. తను ఇంటికి వచ్చి ఆహారం కొనడానికి రాజయ్యను డబ్బులు అడిగింది. రాజయ్య తనను కొట్టి ఇంట్లో నుండి గెంటేసాడు. ఇదంతా చూసిన రజనీ రాధమ్మకు ఆహారాన్ని ఇచ్చింది.ఒక ఉపాయం చెప్పింది. ఆ రోజు రాత్రి రాజయ్య లైట్ ఆన్ చేస్తే రాధమ్మ"ఏవండోయ్! కరెంట్ బిల్లు పెరుగుతుంది,"అని చెప్పింది.రాజయ్య లైట్ ఆఫ్ చేసి బయట పడుకుంటుండగా శ్రవణ్"నాన్న! నిద్ర ను పొదుపు చేయాలి",అని చెప్పాడు. రాజయ్య నిద్రపోకుండా కూర్చున్నాడు. అలా రోజూ ప్రతీ విషయంలో పొదుపు చేయాలి అని చెబుతూ రాజయ్య బుర్ర తినేశారు. కొద్ది రోజుల్లో రాజయ్య మారిపోయి తన పిసినారి తనాన్ని వదిలిపెట్టేసాడు. అలా కుటుంబం అంతా సంతోషంగా ఉంది.

×నీతి×:వచ్చిన డబ్బును ఒక వంతు
ఖర్చు పెట్టాలి, ఒక వంతు
ఇతరులకు సహాయం చేయాలి
ఒక వంతు పొదుపు చేయాలి.
అంతేకానీ ఆశతో పిసినారిగా
మారకూడదు.

-వలిపే రామ్ చేతన్
7వ,తరగతి ప్రజ్ఞాన్ ది స్కూల్,ఉప్పల్
హైదరాబాద్9502156813

# కుటుంబం

అనురాగాల కూడలి
ఆప్యాయత ల ఒడి
ఆనందాల గుడి
సంరక్షణ శాల
రక్తసంబంధ ల కూర్పు
బతుకు నేర్పు
బాధ్యత నేర్పు
సంస్కృతి సంప్రదాయాల
నేర్పు
ఆపదలో కూర్పు
సమస్యలు ఏర్పడితే
పరిష్కారంకు మార్గం
కష్టసుఖాల సమ్మేళనం
ఉమ్మడి కుటుంబాల పతనం
విష సంస్కృతి విజృంభన
వ్యష్టి కుటుంబాలు
ఒంటరి తనం
అందరం అనే స్థానం లో
అంతరం ఏర్పడి
నేను నాది అనే స్వార్థం
పెరిగి విషబీజాలు నాటుకుంటున్నాయి
లేదు చిగురిస్తున్నాయి
వ్యక్తి త్యాజితే కుటుంబం
కుటుంబ త్యాజితే గ్రామం
గ్రామం త్యాజితే పట్టణం
పట్టణం త్యాజితే రాష్ట్రం
రాష్ట్రం త్యాజితే దేశం
సంస్కృతి పునాది
కుటుంబం
సర్వేజనో సుఖినోభావంతు
శాంతి శాంతి:



-ఉమశేషారావు వైద్య
9440408080

# అహంకారం వద్దు ఆప్యాయతే ముద్దు

మనిషివిజ్ఞానంతో
మశూచినిమట్టుపెట్టాడు
వాక్సిన్తోకరోనాను
కట్టడి చేశాడు (నియంత్రించాడు)
మానవాళినిపీడించే
జటిలసమస్యలనుఅధిగమించి
విశ్వవిజేతగానిలిచాడు
మనిషినివేదించేఅహంకారమనే
మహమ్మారిని అడ్డుకోవడంలో
విఫలమయ్యాడు
ఎదుటివారి ఎదుగుదలను
అడ్డుకోవడం
ఇతరుల ప్రయత్నాలను
కించపరచడం
ఇతరుల లోపాలు వెతకడం
తాము నమ్మిందే నిజమనే
భ్రమలో జీవిస్తూ
కూపస్త మండూకములో
మునిగి తేలుతూ
మోసాలే ధ్యేయంగ
కుట్రలుకుయుక్తులేలక్ష్యంగా
తామునమ్మిందేనిజమని
"భ్రమే"కార్యాచరణగా

తాముచేసిందే గొప్పఅని విర్రవీగే
అనాలోచిత లోకంలో
విహరిస్తూ అక్రమమార్గాలే రాచబాటగ
గొప్పకులంఅనేఅహంభావం
గొప్పవంశములోపుట్టమనే అహంభావం
ధనికులమనేఅహంప్రదర్శిస్తూ
మానవీయతనుమంటకలుపుతు
అహంభావంలో "హీరోయిజం"
ఈర్ష్యాద్వేషాలలో "విలనిజం"
విడనాడాలి
ఆత్మవిశ్వాసం
ఆత్మాభిమానం ఆత్మగౌరవం
ఆప్యాయత అనురాగాలు
సహనం సంయమనం
సంఘీభావం
సామాజిక సమరసత సౌభ్రాతృత్వం
సమతా మమత సమన్వయంతో
అహంకారమనే మహమ్మారిని
మట్టుపెట్టాలి
మమత మానవీయతకు పట్టంకట్టాలి
అహంకారం వద్దు
ఆప్యాయతే ముద్దు



-నేదునూరి కనకయ్య
9440245771

# అధమరకం

తన వాళ్ళలో ఇమడక
అందరిలో ఇంకక
పలు శంకల సంద్రంలో
మునుగుతూ
అనేకానేక వంకలుపెడ్తూ
తానొక ప్రత్యేక
గ్రహవాసిననే
తలంపు, సంకుచిత
మనసుతో ప్రత్యేక
గౌరవాభిమానాల్ని ఆశిస్తూ
ఉన్నకాసేపు ఉస్సూరనిపిస్తూ
మనశ్శాంతి హరిస్తూ
కాలహరణం చేస్తూ
సలహా పూర్వక మాటలతో
పరుల అభిమానాన్ని
గ్రోలుతూ, అదే పరమావధిగా
బతికే మనిషి , ఎపుడు
తెలుసుకుంటాడో ?
తానొక అధమ రకమని
తను తప్పక మారి
వాస్తవదర్శనం చేసుకోవాలని
( నోట్ : కొన్ని మనస్తత్వాలు
గ్రహించాక బాధతో
ఇలా నా భావవ్యక్తీకరణ )



-సంధ్య సుత్రావె,
9177615967

# శిశుసంహారం

పశువాంఛ పెరిగిన మృగాళ్ళ దాడుల్లో
పసివాళ్ళుసైతం సమిధలవుతున్నారు
రక్షణలేని జనారణ్యంలో
మానవత్వం మంటగలుస్తోంది !!
బరితెగించిన శుక్రకణం
అమాయకపు అండంలో
బలవంతంగా చొరబడితే . . .
అమ్మతనం ఆవిష్కారానికి
ఆదిలోనే అడకత్తెర !!

వలపు వలను నమ్మి
నగ్నంగా అర్పించుకున్న చెల్లి
చెల్లుబాటుకాని మాతృత్వానికి
వేదనగా
చెల్లించుకునే మూల్యం . . .
ఒక్క నిమిషం ఒళ్ళు మరచిన కేళిలో
ఐక్యమయే జీవకణాల సారాన్ని
వదిలించుకునే ఆరాటం . .
ఒక భ్రూణహత్య !!

అందం తరిగిపోతుందేమోనని ఆందోళన . .
యవ్వనం అరిగిపోతుందనే అపనమ్మకం ..
మాతృత్వానికి మరణశాసనమవుతోంది.
అత్త, మామల దర్పమో . .
భర్త అహంకారమో . . .
స్కానింగై గర్భాన్ని శోధించినపుడు
ఆగిపోయే ఆడపిల్ల జననం
సృష్టికార్యాన్ని మూగగా ప్రశ్నిస్తుంటే
అమ్మతనం అరణ్యరోదనలో
జన్మించేహక్కును హరించవద్దంటూ
పిండాలన్నీ లేతచేతులు జోడిస్తున్నాయి !!

అదుపుతప్పిన స్త్రీ పురుష నిష్పత్తి
కుటుంబవ్యవస్థకు సవాలవుతోంది !!
మగువలేక మానవాళి మనుగడ విషాదం !
శిశువులు లేకుంటే సమాజం
ఉనికికే ప్రమాదం !!



– శ్రీధర్ కొమ్మోజు
చరవాణి: 9989464467

# రాజధర్మం

పాలించే వాడు ప్రభువన్న మాట నిజమే?!
ప్రజాసంక్షేమంలో
నిష్పక్షపాత ధోరణే రాజధర్మం?!

అధినాయకుడి పరిధిలో అన్యాయానికి గురయ్యే
ప్రతి మనిషికి రాజు ఒక భరోస?!
ధర్మ రక్షణ..దుష్ట శిక్షణ...
పాలకుడి రాజ్యాంగం.!

వేలుచూపితే వేదవాక్కు?
మాటచెప్పితే మంచి తీర్పు..
రాజధర్మానికి ఆభరణాలు?!

ప్రజాస్వామ్యమైనా?
రాజరికమైనా అంతిమంగా...
రాజ్యం సుభిక్షమైతేనే రాజధర్మం?
సంక్షోభమైతే రాజద్రోహం?!!

రాజు రాజ్యానికి తండ్రి?
ప్రజలు బిడ్డలు?
పాలన ఒక లాలన...
ఒక శాసనం?!!



-అనంతవరం శ్రీనివాస్
9676626066

# నా భూమి

రూపమున పడతినే పోలినది నా భూమి
దీపమై దారినే చూపినది నా భూమి
ధూపదీపములు గల కోవెలే నా భూమి
పాపములు పోగొట్టు పుణ్యవతి నా భూమి.

తాపసులు నడయాడ తరియించె నా భూమి
కోపమును శాంతమును సమమనెను నా భూమి
చూపరుల కచ్చెరువు గొల్పునది నా భూమి
దాపరికమెరుగనని ధన్యమయె నా భూమి.

ఆపన్న హస్తమును అందించు నా భూమి
ఆపదలు వచ్చినను వణకనిది నా భూమి
నిపుణతకు ఏలోటు లేనిదే నా భూమి
రేపటిని ఊహించు స్థిత ప్రజ్ఞ నా భూమి
(5 5 5 5 మాత్రలు)



-గుడిపూడి రాధికారాణి,
9494942583

# నిత్య చైతన్యాన్ని...

నాకు పోరాటం
కొత్తేం కాదు,
పురిటితోనే
పట్టుకొచ్చుకున్న...

అణగదొక్కి
అధఃపాతాళానికి తొక్కినా
అదునుజూసుకొని
ఆయువు పోసుకుంటేనే ఉన్న....

ఫలాల్ని తిని
పనికిరావని పారేసినా
పదను తగిలితే చాలు
పొట్టలు చీల్చుకొని చిగురిస్తున్న...

నా గూడు కాకున్నా
నా గోడు కాకున్నా
నీ గొడవ నాదనుకొని
సరదంట సంగ్రామం చేస్తున్న....

ఒక్క నాల్కె గాదు
ఒక్క కుత్కె రాదు
అవకాశం వస్తే అన్నీ మరుస్తావ్
అడుగడుక్కీ జారుతున్నావ్ ....

ఊసరవెల్లి లెక్క
ఊగిసలాటాడుతున్నావ్!
నన్ను నేను తమాయించుకొని
నీ కోసం నిలువరిస్తూనే ఉన్న.....



-వి. పద్మ
9951445867

# ఆడపిల్ల -మొగ్గలు

ఆడపిల్ల నట్టింట నడయాడితేనే
ఆనందాల నవ్వుల పువ్వులు పూసేది
ఆడపిల్ల ఇంటికి అందం

ఆడపిల్ల గల గల మాట్లాడితేనే
గోదావరి పరవళ్ళు పులకింతలు తొక్కేది
ఆడపిల్ల జగతికి వెలుగు

ఆడపిల్ల ఘల్లు ఘల్లు మని నృత్యం చేస్తేనే
కళామ తల్లి మువ్వల సవ్వడులు మురిపించేది
ఆడపిల్ల కళలకు ప్రతిరూపం

ఆడపిల్ల ఆనందంతో కిల కిల నవ్వితేనే
వసంత కోయిల రాగాల మధురిమ తెలిసేది
ఆడపిల్ల గృహానికి లక్ష్మి

ఆడపిల్ల చదువులో ముందుకు సాగితేనే
చదువుల తల్లి మదిన కోటి వీణలు మోగేది
ఆడపిల్ల లోకానికి సరస్వతి

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

# గజల్

ఏ శోకం మార్చిందో మౌనంగా నన్నిట్లా
ఏ శ్లోకం మలచిందో శిల్పంగా నన్నిట్లా

మోహాలకు భోగాలకు లొంగలేదు మనసెపుడూ
ఏ మార్గం నిలిపిందో ధైర్యంగా నన్నిట్లా

పెంచుకున్న బంధాలే తెంచుకునే ఆట కదా
ఏ స్నేహం వదిలిందో శూన్యంగా నన్నిట్లా

తెరలు తొలుగు వెలుగేదో తరలి నన్ను రమ్మన్నది
ఏ లక్ష్యం నడిపిందో ఆత్రంగా నన్నిట్లా

వెతల కథల పుస్తకాన్ని సత్యసుధల మస్తకాన్ని
ఏ కావ్యం రాసిందో కథనంగా నన్నిట్లా

-శ్రీ శివ లక్ష్మి
8790700383



జూన్ 15న తణుకులో శ్రీశ్రీ 40వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న వి.ఎస్.వి.ప్రసాద్, బి. నాగరాజు, కె.జె.యస్. రామారెడ్డి, ఎన్.రాధాకృష్ణ

## ప్రశాంత ప్రభాతం

వసుధ తోటలో విరిసిన
మానవతా కుసుమం..
చరిత గతులకు నడక నేర్పిన
సభ్యతా మందిరం....

ఆటు పోట్లెన్నెటినో తట్టుకుని
కఠిన పరీక్షలెన్నో ఎదుర్కొని
విశ్వ జీవన గగనం లో
కాంతి క్షేత్రమై వెలిగే
సంస్కృతి కేతనం....

మనసులో మాటలో అడుగులో
పరిఢవిల్లే ఋషిత్వ ప్రకాశం...

హరిత భరితమై లలిత లలితమై
అనంత శాంతి నికేతనంగా
రెపరెపలాడే భారతీయ కేతనం....

సంక్షోభాలెన్నో చుట్టుముట్టినా
తడబడని చైతన్య స్వరం..
చెరిగిపోతున్న యుద్ధ నాదాల
హింసా వాదానికి పాఠం నేర్పే
ప్రశాంత ప్రభాతం నా భారతం....



-వెల్లుల జయపాల్ రెడ్డి
9441168976

## కలాలను ఝుళిపించాలి..!

సమాజ హితమే లక్ష్యంగా
సమభావనే ధ్యేయంగా
సాహిత్య దృక్పథమే ఆశయంగా
సమాజ శ్రేయస్సే పరమావధిగా

నిజాలు నిప్పులై విరజిల్లాలి..!
సాహిత్యం పరిశీలనగా
సాహిత్యం అన్వేషణగా
సాహిత్యం సంవేదనగా
సామాజిక పరివర్తనకై
సాహిత్యాన్ని కొనసాగించాలి..!

అక్షీకరణలో సృజనాత్మకత
కవిత్వంలో మానవత

భావంలో నిగూఢత
శైలిలో వైవిధ్యతతో
లక్షణాలను ముందుకు సాగాలి..!

గత స్మృతులను గుర్తుచేస్తూ
భవిష్యత్తును ఊహిస్తూ
పాఠకులను ఆలోచింపజేస్తూ
హృదయంపై అనుభూతి ముద్రలు వేసేలా
మనసును కట్టి పడేయాలి..!

ప్రజలను చైతన్య పరిచి
సామాజిక బాధ్యతను పంచి
సౌందర్యాభిరుచిని పెంచి
తాత్విక దృక్పథాన్ని కలిగించేలా
కవులు కలాలను ఝుళిపించాలి..!



-పిల్లి.హజరత్తయ్య,
9848606573

## నాన్నొక జాతీయపతాకం...!!!

పుట్టిన ప్రతి మనిషి జీవిత శ్వేతపత్రంపైన
తొలి బీజాక్షరాన్ని దిద్దించే ఓంకారనాదం ఆయన
సంసార సేద్యం చేస్తూనే కుటుంబపుతోటలో
చిరునవ్వుపూలగుత్తుల్ని పూయించే వనమాలి.
పితృప్రేమను హుందాగా తన శాఖలకు
ప్రసరింపచేసే తరువు తండ్రివేరు అతడు.
బిడ్డల కోర్కెల గువ్వల్ని స్వాంతపు తాయిలాలతో
సంతృప్తి స్థాయిలో ఫలింపచేసే ఘనుడతడు.
కనుకొలుకులు వర్షించని కన్నీటిమేఘాలు
ఏర్పడనివ్వని కంటి చలమకు నెలవాతడు.
సంసారచక్రపు గరిమనాభి సమతుల్యం చేస్తున్నా
తానుమోస్తున్నవైపుకు మొగ్గించుకునే త్యాగధనుడు.
సంసారపు పరమాణువులో ధనాత్మక పాత్రధారియై
సుస్థిర సాంప్రదాయబంధాలకు కక్ష్యామార్గమతడు.
హక్కులుగా సంక్రమించిన బాధ్యతల నిర్వహణలో
పక్షికన్ను లక్ష్యంగా సంధించే
'విజయ'బాణమతడు.
కుటుంబపు నిర్వహణావిలు
విద్య నేర్చిన ఏకలవ్యుడు
సమసమాజ నిర్మాణ కుటుంబ వ్యవస్థకు
వెన్నుముకయైన ప్రతి ఇంటి నాన్న
రేపటితరపు జాతీయపతాకమే!!!



-కొత్తపల్లి ఉదయబాబు
9441860161,
9533756075

## కన్నఊరి ప్రేమ

మట్టికుండలో మక్కగడ్క అండి
ఇంత సల్ల పోసుకొని తింటే
ఎంత మధురంగ..ఉంటదో..
మా పల్లె ప్రేమ అంత కమ్మగుంటది.
మట్టితటారిలో జొన్నపిండిపోసి..
చేయిమీద రొట్టెకు రూపమిచ్చి..మా అవ్వ
పెంకమిదేసి కాల్చిన జొన్నరొట్టె తిన్నట్లుంటది.
మా ఊరి ప్రేమంటే బంధాలను కలిపేది.
ఆప్యాయంగా పలకరిస్తూ
ఆకలి కడుపులను నింపేది.

చినుకులన్నీ నేలనుతడిపితే..
భూతల్లి కమ్మని వాసనని పంచినట్లుంటది
మా పల్లె ప్రేమ.
పూలమీద వాలిన తుమ్మెదలు
కమ్మని మకరంధాన్ని
ఆస్వాదించినట్లుంటది.
ఒళ్ళంతా ప్రేమ గంధాన్ని పూసుకుని
మాయమవుతున్న మనుషుల నుదుటిపైన
బంధాల గంధాన్ని పూసి
ఒక్కటి చేస్తుంది నా ఊరు.
అలసిన హృదయాలను అక్కున చేర్చుకొని..
నా ఊరు నదిలా మారి..
చల్లని అలల తాకిళ్ళను
విసురుతూ మనసులను చల్లబరుస్తుంది.

దుడ్డేబోక్కులు మేకపిల్లలు నేను మా నాయన
అందరం ఓకేకాడ కూసోని సేదతీరుతం.
గేదేలకు కోసుకచ్చిన పచ్చని గడ్డి..నేను
మాట మంతీ కలిపి యోగక్షేమాలను అడుగుతుంటే..
పచ్చని గడ్డంతా గేదె కడుపురింపి..
త్యాగానికి మించిన గుణంకంటే గొప్పదేముందని
నవ్వుతూ ఆకలిని తీరుస్తుంది.
నెమరేస్తూ ముగజీవులన్ని తలచుకునేది..
కడుపునింపిన ఆకుపచ్చని తరువులనే.!
నిద్రాడోలికల్లో మునిగిపోయి కునుకుతీస్తుంటే..
కల్లోకచ్చి పలకరిస్తుంటది కన్నఊరు


అరుగుమీద మా అవ్వనాకు
ముచ్చట్లు చెపుతుంటే
గెలుపు గుర్రమెక్కి విజయతీరాల్ని చేరినట్లుంటది.
ఊరి ముచ్చట్లన్నీ ఎరుకజేస్తూ..
జ్ఞాపకాలను పల్లె పాటలుగాచేసి వినిపిస్తుంది.
తారలన్నీ మెరుస్తూ అవ్వ మాటల్ని వింటూ..
చందమామ వెన్నెలతో పోటీపడి..
నక్షత్రకాంతులను వెదజల్లుతాయి.
నాయన దేహం చెమటలు కక్కుతూ..
నల్లని వజ్రంలా మెరిసిపోతుంటే..
మా పల్లె...గుండెలో కన్నీటి తెరలను తెంపుకొని
కాలాన్ని చేతులుగా మార్చుకొని..
తనువు కన్నీరును తుడుస్తుంది.!
మా ఊరు ఎపుడు పచ్చని పందిరై
రెక్కలిరిగి వస్తున్న వలస
పక్షులను అక్కునచేర్చుకొని
పేగుబంధమై ప్రేమను పంచుతుంది.



అశోక్ గోనె
9441317361

## ఈ పాపం ఎవరిది?!

నిన్నటిదాకా కొండంతలుగా
కేరింతలు కొట్టిన ఉత్సాహం
నేడు చైతన్యరహితమై
చతికిలబడిపోయింది...
నిన్నటిదాకా అలలా
విజృంభించిన ఆవేశం
నేడు మత్తుకు
చిత్తయిపోయింది...
నిన్నటిదాకా
ఎన్నెన్నో రంగుల హంగులతో
పొంగిన యువత
నేడు ఆస్పత్రి పడకమీద
జీవచ్ఛవమైపోయింది...
మానవమృగాలు అంటించిన
క్షణికానంద డ్రగ్స్ చిచ్చుకు
ఈ సువిశాల జీవితం
తగలబడిపోతోంది...
ఆశల పచ్చదనాలూ
ఆశయాల ఉద్యానాలూ
అనుబంధాల కుహూకుహూరావాలూ
అన్నీ ఆహుతైపోతున్నాయి...
ఈ పాపం ఎవరిది?!
బిడ్డల ఉల్లాసాన్ని
కట్టడి చేయలేని
పెద్దల మమకారానిదా...
పబ్బుల సంస్కృతిని
పెంచి పోషించే నేతల
నవనాగరికతావ్యామోహానిదా...



- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర
సెల్: 9177732414

## కదిలించాలిపుడే మన కలాలను

హాలాల తోటి పొలాల దున్ని
మన కడుపులు నింపే కర్షకుడు
కన్నీరు కారుస్తున్నాడు
కదిలించాలిపుడే మన కలాలను
కదిలించాలిపుడే మన జనాలను
కదిలించాలిపుడే మన ప్రభుతను

విషసంస్కృతికి బానిసలై
విష పోకడలకు వారసులై
యువత వికృతచేష్టలు చేస్తుంటే
కన్నవారి కన్నీరాగడం లేదు
కన్నెపిల్లల రక్ష కుదరడం లేదు
కదిలించాలిపుడే మన కలాలను
వదిలించాలిపుడే యువత మత్తును

కులాల పేర కుమ్ములాటలు పెరుగుచున్నవి
మతం పేర మారణహోమం జరుగుచున్నది
కదిలించాలిపుడే మన కలాలను
కదిలించాలిపుడే ఈ జనాలను
తెరిపించాలిపుడే జనుల కనులను

ఉరికించాలిపుడే మత రక్కసులను
పెరికేయాలిపుడే విష బీజాలను
తుడిచేయాలిపుడే కర్షకకన్నీరును
మార్చేయాలిపుడే సమాజ రూపురేఖను



-వకుళాభరణం
రాంనరేశ్ కుమార్
9492682285

# తాతగారు బాగున్నారా?

(కథ)

"ఆ కాలంలో, మా రోజుల్లో" అని తాతగారి నోటినించి వచ్చిందో లేదో పిల్లలందరూ సినిమాల్లో దేవుళ్ళలా మాయమైపో యారు. దేవుళ్ళల్లా అని ఎందరూ అనడం? పిల్లలూ దేవుడూ ఒకటేకదా మరి!

సినిమాల్లో దేవుళ్ళల్లా అనడం ఎందుకూ అంటే నిజజీవితంలో దేవుళ్ళు ప్రత్యక్షమవడంగానీ, మాయమవడంగానీ చూస్తే కదా, సినిమాల్లో తప్ప!

ఆ కాలనీలో పిల్లలు రోజు సాయంత్రాలు రాఘవ రావుగారింటి ముందున్న ఖాళీస్థలంలో ఆడుకుంటూ ఉంటారు. ఆ పిల్లల్ని, వాళ్ళ ఆటల్ని చూస్తూ ఇంటి అరుగుమీద వాలుకుర్చీలో కూర్చుని కాలక్షేపం చేస్తుంటారు రాఘవరావుగారు.

పిల్లలెప్పుడైనా తన దగ్గరగా వస్తే ఆ కాలంలో మా రోజుల్లో అని మొదలెడతారు ఆయన. ఆ రెండు మాటలూ తప్ప మూడోమాట ఆయన నోటినించి రాకముందే పిల్లపటాలం అంతా మాయమైపోతుంది. అందుకే తర్వాతిమాట ఆ నోటినించి ఇంతవరకూ రాలేదు, ఎవ్వరూ వినలేదు.

రాఘవరావుగారికి తొంభయ్యేళ్ళు నిండాయి. కొడుకూ, కోడలూ, ఆయనా ఉంటారింట్లో, కొడుకెప్పుడో రిటైరయిపోయిడు. మనవరాళ్ళిద్దరూ వాళ్ళ పిల్లలూ, వాళ్ళ సంసారాలతో తలమునకలవుతూ తలోచోటా వేరే ఊళ్ళల్లో స్థిరపడ్డారు. ఆయనకున్న కాలక్షేపం అంతా ఇంటిముందు ఆడే ఆ కాలనీ పిల్లలే. వాళ్ళతో కబుర్లు చెప్పాలని కూడా ఉంటుందాయనకి. కానీ చెంగు చెంగుమని దూకే ఆ వయసు కుంగిపోయిన వయసుని పట్టించుకోవద్దూ!

ఎగరడం దూకడం చేసే ఆ వయసుకి వాలిపోయిన వయసు విచిత్రంగా కనబడుతుంది అంతే. సాధారణంగా తాతయ్యలూ, అమ్మమ్మలూ, బామ్మలూ ఆ రోజుల్లో అంటూ తమ గతాన్ని గుర్తు చేసుకుంటూ సుత్తి కొడతారనో, సోది చెప్తారనో కదా ఈ తరం పిల్లల భయం మరి.

అందుకే రాఘవరావుగారు ఆ కాలంలో అనగానే అందరూ మాయమవుతారు. తను వాళ్ళకి చెప్పదల్చుకున్నది చెప్పలేకపోతున్నందుకు మనసులో ఒకటే దిగులుగా ఉంటోంది ఆ పెద్దాయనకి. ఒక్క రోజైనా నిలబడి "మీ కాలంలో ఏవిటి తాతయ్యగారూ? చెప్పండి" అంటూ ఒక్కసారంటే ఒక్కసారైనా వాళ్ళు అడగాలని ఆయన కోరిక.

వయసుడిగిన పెద్దవాళ్ళకి చిన్న చిన్న కోరికలే ఉంటాయి. అవి చిన్న వయసు వాళ్ళకి చిరాకే. పెద్దపెద్ద కోరికలు చిన్నవయసులోనూ ఉడుకు రక్తమప్పుడూ ఉంటాయి. అది సహజం. భవిష్యత్తు వాళ్ళది కదా! ఆశలూ, ఆశయాలూ, కోరికలూ పెద్దఎత్తున వారి జీవితాన్ని ముందుకు నడిపించాలి మరి.

ఆ రోజూ ఎప్పటిలాగే సాయంత్రం రాఘవరావు గారింటి ముందు ఆడుకుందుకు చేరారు పిల్లలు.

తాతగారింట్లోనూ, బయట వరండాలోనూ ఏదో హడావిడిగా ఉన్నట్టు అనిపించింది వాళ్ళకి. అలాగని అరుపులూ, గొడవ ఏం లేవు. ఇంటికి ఎవరెవరో వచ్చారు. అందరూ కూడా నిశ్శబ్దంగా అటూ ఇటూ లోపలికీ, బయటికీ కంగారుగా ఏవో పనులమీద తిరుగుతున్నట్టుగా తిరుగుతున్నారు. తాతగారు కనిపించలేదు. ఆయన అరుగు మీద కూర్చుని లేకపోవడంతో అరుగు చిన్నబోయినట్టుగా తోచింది ఆ చిన్నారి మనసులకి.

ఆ ఇంట్లో పనిచేసే అచ్చుమ్మ అప్పుడే అటువైపు రావడంతో పిల్లలందరిలో కాస్త పెద్దవాడు అడిగాడు తాతగారి గురించి ఎగాదిగా చూసింది అచ్చుమ్మ. "తాతగారికి ఉన్నట్టుంది ఏమైందో తెలియదు. ఒంట్లో బాగులేదు. డాకటరుబాబు వచ్చి చూసి ఇంక అంతే ఎవరూ ఏం చెయ్యలేరని, ఇంక ఆ మనిషి లేవలేడని, తిరగలేడని చెప్పేసి వెళ్ళిపోయాడు. ఇంక అయిపోయినట్టే అనుకుంటున్నారు ఇంట్లోవాళ్ళు. అందుకే అలా కంగారుపడుతున్నారు" గబగబా చెప్పేసి వెళ్ళిపోయింది అచ్చుమ్మ ఏదో పనిమీద.

పిల్లలందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఏం చెయ్యాలో వాళ్ళకి పాలుపోవట్లేదు. హఠాత్తుగా ఒక పిల్లాడన్నాడు " మనం ఆడుకుంటుంటే అరుగు మీద తాతగారు కూర్చుంటే బావుండేది కదా!" ఔనన్నారు తక్కిన పిల్లలంతా.

"పాపం తాతగారు' జాలి పడ్డాడు మరో పిల్లాడు.

చటుక్కున అరుగుమీదకి ఎక్కాడు అందర్లోకి పెద్దవాడు. అంతే చకచకా మిగిలిన వాళ్ళందరూ కూడా ఎక్కేశారు. వాళ్ళకి తెలుసు అది తాతగారి గది అని. అందరూ కలిసి బృందగానంలా పిలిచారు ఆయన్ని. రెప్పలు తెరుచుకున్న ఆయన కన్నులు కిటికీ వైపు తిరిగాయి పరిచయమైన ఆ పిలుపుకి. తాతగారిని ఆ స్థితిలో చూసి అయ్యో అనిపించింది వాళ్ళకి.

ఎలాగోలా తాతగారిచేత మాట్లాడించాలనిపించింది వాళ్ళందరికీ.

టక్కున ఓ పిల్లాడన్నాడు చేతులూపుతూ సైగలూ కూడా చేస్తూ "తాతగారూ" ఆ కాలంలో మా రోజుల్లో.."

తాతగారి పెదవులు చిన్నగా విచ్చుకున్నాయి చిరునవ్వుతో.'హాయ్! తాతగారు నవ్వారు, తాతగారు నవ్వారు' అంటూ సంబరంగా పిల్లలు చప్పట్లు కొడుతుంటే లోపల్నించి ఆయన కొడుకు బయటికి వచ్చి తండ్రి దగ్గరికి వాళ్ళందరినీ ఇంట్లోకి తీసికెళ్తాను వస్తారా అని అడిగాడు. ఇష్టపూర్వకంగా అందరూ లోపలికి నడిచారు చెప్పనా అడిగారు రాఘవయ్యగారు కాస్త కష్టమ్మీద కూడబలుక్కుం టూ పిల్లలందరూ తలలూపారు.

" ఆ కాలంలో మా రోజుల్లో ఇప్పుడు మీకున్న సాంకేతిక పరిజ్ఞానం, వసతులు లేవు మాకు. మీ బుర్రలంత చురుకైనవి, పదునైనవి, కాదులే మావి. ఈ తరం వాళ్ళు నర్సరీ చదివే పిల్లలు సైతం అబ్బో చాలా తెలివైనవాళ్ళు సుమీ!" తాను చెప్పదల్చు కున్నది చెప్పేసి ఆయసపడుతూ ఆగారు రాఘవయ్యగారు.

"ఈ సంగతేనా తాతగారూ! మీరెప్పుడూ మాకు చెప్పాలనుకునేవారు?"

"ఔను. ఈ కాలం పిల్లలు చురుకైనవాళ్ళనీ ఏ విషయాలైనా ఇట్టే గ్రహించగలరనీ మీరందరూ వృద్ధిలోకి వస్తారనీ మీతో చెప్పాలని నా కోరిక. నా ఉద్దేశం అదే" పిల్లలందరివంకా ఆప్యాయంగా చూశాడు.

ఆ నిమిషంలో ఎక్కడలేని ఓపికా వచ్చేసినట్టయి ఎలా లేచి కూర్చున్నారో ఆయనకే తెలియదు. కొడుకూ కోడలూ కంగారుపడిపోతూ లేవకండి పడుకోండి అంటుంటే "ఇప్పుడు నాకేమైందర్రా? శుభ్రంగా పిడిరాయల్లే ఉన్నను. చిన్న వాళ్ళు మీకే అప్పుడప్పుడు ఏవో నలతలు వస్తూనే ఉంటాయి కదా! వందకి దగ్గిర పడుతున్నవాడిని నాకు రావా చిన్నా చితకా నలతలు. పదండి పిల్లలూ బయట ఆటలు మొదలెట్టండి" అంటూ అరుగు మీద వాలుకుర్చీ వెయ్యమని కొడుక్కి పురమాయించారు రాఘవరావు. పోగొట్టుకున్నదేదో లభించినంత ఆనందంగా ఉంది పిల్లలకి.

ఔను మనిషికి లేనప్పుడే దేని విలువైనా తెలుస్తుంది. ఎదురుగా ఉన్నప్పుడు అందుబాటులో ఉన్నప్పుడు ఆ విలువ తెలియదు.



-తమిరిశ జానకి
9441187182

# చౌర్య రహస్యం

(కథ)

నాకు పెళ్ళయిన పది సంవత్సరాలకు లేక లేక కూతురు పుట్టింది. బారసాల వేడుక ఎంతో ఘనంగా జరపాలని నిశ్చయించాను. మా అమ్మ నాన్న కూడా ఎంతో సంతోషించారు. నాకు ముగ్గురు అన్నలు. వారు తమ ఉద్యోగాలరీత్యా రాష్ట్రంలోని దూర ప్రాంతాలలో స్థిరపడ్డారు. నా మీద ప్రేమతో నా అన్నయ్యలు, వదినలు, నా కూతురు బారసాలకు వచ్చారు. వాళ్ళ పిల్లలు వారి చదువుల మూలంగా రాలేకపోయారు.

నా భార్యకు ఆమె తల్లిగారు దాదాపు 100 తులాల బంగారు నగలు మా పెళ్ళిలో కానుకగా ఇచ్చారు. మా ఏరియాలో దొంగల భయం. అందుకనే మా ఊరులోని బ్యాంకు లాకరులో భద్ర పరిచాము. ఏదైనా ఫంక్షన్ ఉంటే ఆ సొమ్ములు తీసుకొని వచ్చి ధరించి కార్యక్రమము అయిపోగానే మరలా బ్యాంకులో దాచేవా రము. ఆ అలవాటు ప్రకారం బాలసాల కార్యక్రమానికి ఒకరోజు ముందు బ్యాంకు లాకర్ నుంచి సొమ్ములు తెచ్చాము.

ఆ రోజు ఆదివారము. బారసాల కార్యక్రమము అయి అతిథులు అందరూ వెళ్ళేటప్పటికి రాత్రి 10 గంటలు దాటింది. రేపు సోమవారం లాకర్‌లో భద్రపరుద్దాము అని అనుకొని నా భార్య తన వంటి మీద నగలు అన్నీ తీసి ఒక ప్లాస్టిక్ కవరులో పెట్టి హాలులోని డ్రస్సింగ్ టేబుల్ డ్రాయర్‌లో ఉంచింది.

ఆ రోజు రాత్రే మా అన్నయ్యలు ముగ్గురు ప్రయా ణమై తమ ఊరికి పోతున్నారు. అందుకని మా అమ్మ నాన్నలతో కలిసి అందరూ హాలులో నిద్రపోయారు. నేను, నా భార్య పిల్లతో సహా మొదటి అంతస్తులోని మా గదిలో పడుకొన్నాము.

మరునాడు ఉదయం పది గంటలకు నా భార్య బంగారం విషయం గుర్తుకు వచ్చి డ్రస్సింగ్ టేబుల్ డ్రాయర్‌లోని ప్లాస్టిక్ కవరు తీసి చూస్తే దాదాపు50 తులాల బంగారు వస్తువులు తక్కువగా ఉన్నాయి. ఆ విషయమై అమ్మ నాన్నలను అడిగాను. పోయిన సొమ్ములు మన ఇంట్లో వ్యక్తులే తీసి ఉండాలీ అని అన్నాను.

"అదేమిటిరా! నీ సొంత అన్నయ్యలనే అనుమానిస్తు న్నావు! తెల్లవారుఝుమున నాకు చెప్పే ముగ్గురు అన్నయ్యలు మీ వదినలతో కలిసి ఒక్కొక్కరు అరగంట వ్యవధిలో తమ బ్యాగ్‌లు తీసుకొని వెళ్ళిపోయారు అని మా నాయన చెప్పాడు.

**పోయిన సొమ్ములు బయటనుంచి వచ్చిన బంధువులు దొంగిలించటానికి అవకాశమే లేదు. ఆ విషయం బయట వారికి తెలిస్తే మా కుటుంబ పరువుపో తుంది ఏమి చెయ్యాలో అర్థం కాలేదు.**

పోయిన సొమ్ములు బయటనుంచి వచ్చిన బంధువులు దొంగిలించటానికి అవకాశమే లేదు. ఆ విషయం బయట వారికి తెలిస్తే మా కుటుంబ పరువుపో తుంది ఏమి చెయ్యాలో అర్థం కాలేదు.

మా మండలంలో ప్రశ్నలు చెప్పే విశ్వనాథ శాస్త్రి పంతులుగారు ఒకరు ఉన్నారు. రాజరాజేశ్వరీ ఉపాసకులు. అమ్మవారు వారిని పూని బాధితుల ప్రశ్నలకు తీర్పులు చెప్పి కష్టాలు తీరుస్తుంది అని అక్కడి ప్రజల నమ్మకం. ఎందుకైనా మంచిదని మా గురువుగారి దగ్గరకు నేను పోయి నాకు వచ్చిన కష్టాన్ని చెప్పుకొన్నాను. గురువుగారు కొద్దిసేపు ఏవో లెక్కలు గణితము వేసి ఇలా అన్నారు.

నాయనా నీవు 'విందము' (రామాయణంలోని అరుణ్యకాండలో ఈ పదం ప్రస్తావనకు వస్తుంది. సీతాన్వేషణలో ఉన్న రామలక్ష్మణులు జటాయువును కలుసుకుంటారు. ఓ రామా నీవు సీతాదేవిని విందము అనే ముహూర్తంలో పోగొట్టుకున్నావు కనుక సీతాదేవిని నీవు తప్పకపొందుతావు అని జటాయువు చెబుతాడు). అదే ముహూర్తములో నీ సొమ్ముపోగొట్టుకొన్నావు కనక మరలాతప్పక పొందుతావు ఆ సమయంలో పోయిన సొమ్ములు యజమాని ఇంటికి నడచివస్తాయి అని చెప్పి ఒక రాగి రేకుపై బీజాక్షరాలు వేసి ఇచ్చి మా ఇంటి గుమ్మానికి కట్టమన్నారు. నేను అదే విధంగా చేశాను.

ఈ లోపల మా అమ్మ నా ముగ్గురు అన్నయ్యలకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పింది. మీకు తెలుసు కదా మన గజ్జలకొండ గురువుగారు గొప్ప మంత్రవేత్త. ఆ గురువుగారు మంత్రం వేస్తే సొమ్ములు దొంగిలించిన వారికి అరిష్టాలు కలుగుతాయి. ఆ దెబ్బకు వారే సొమ్ములు మనకు పంపుతారు. మీరు ఏమీ ఆందోళన చెంది అనవసరంగా బాధపడవద్దు అని చెప్పింది.

ఒక వారం రోజుల తరువాత నేను ఇంటిలో లేని సమయంలో ఒక అపరిచిత వ్యక్తి మా ఇంటికి వచ్చి

"అయ్యా మీకు పార్సిల్ వచ్చింది" అని చెప్పి వరండాలో బల్లపై పెట్టి మా నాయన పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు నేను ఇంటికి వచ్చిన తరువాత బల్లపై పార్సిల్‌ను చూసి మా నాయనను అడిగాను జరిగిన విషయం మానాయన చెప్పాడు.

పార్సిల్ తెరిచి చూశాను అందులో మా పోయిన బంగారు నగలు అన్నీ భద్రంగా ఉన్నాయి. కవరుపై ఎటువంటి అడ్రస్ పంపిన వారి వివరాలు పేరు లేదు. ఇంట్లో అందరం ఎంతో సంతోషించాము. కానీ ఎవరు పంపారో అర్థం కాలేదు.

మరుసటి రోజు కర్నూల్ నుంచి మా అన్నయ్య నాకు ఫోన్ చేసి "ఒరే! రాము నీకు ఏదో పార్సిల్ వచ్చిందట. మన ఇంటి ప్రక్కన ఉన్న శ్రీనివాస్ గారు నాకు నిన్న సిటీలో కలసి చెప్పారు. నీకు అందిందా" అని అడిగాడు.

"అవును తీసుకున్నాను" అని సమాధానం చెప్పాను.


ఆరోజు సాయంత్రం బజారులో కలిసిన శ్రీనివాస్‌తో మా కర్నూల్ అన్నయ్యను నీవు కలిశావా అని మా ప్రక్కంటి శ్రీనివాస్‌ను అడిగాను.

"మీ అన్నయ్యను చూసి దాదాపు సంవత్సరం అయింది. మొన్న మీ ఇంట్లో జరిగిన బారసాల కార్యక్రమంలో కూడా అతన్ని కలవలేకపోయాను" అని చెప్పాడు.

మరి మా అన్నయ్యకు పార్సిల్ విషయం శ్రీనివాస్ చెప్పకపోతే ఎలా తెలిసింది అనేదే బ్రహ్మరహస్యం.

మా అన్నయ్య మంచివాడే. కాని పరిస్థితుల ప్రభావం, కాలమహిమ వల్ల కొన్ని సందర్భాలలో దుర్బుద్ధులు ఎవ్వరికైనా పుట్టవచ్చు. ఇది మానవ సహజం. అందుకే మన జాగ్రత్తలో మనం ఉండాలి. విషయం ఏదైన మా ఇంటి పరువుపోకుండా మా సొమ్ములు మాకు దక్కినందుకు సంతోషించాను.

అంతా గజ్జల కొండ గురువుగారి మహిమ.



- జన్నాభట్ల నరసింహప్రసాద్
సెల్: 8297263741

## ప్రశ్నలమై మొలకెత్తాలి..!

చెంతనే నీడలా వుంటూ
గుబులు పుట్టించే
స్వార్థ ప్రయోజనాలకు
బలైపోకుండా నిలవాలి
నిర్దేశించుకున్న మార్గంలో
తడబడకుండా సాగితేనే
ఆశయం నెరవేరుతుంది..!

చేతులు ముడుచుకుంటే
చైతన్యం వికసించదు
నిరసనల గొంతు వినపడితే
అణగతొక్కే యత్నాల సిద్ధహస్తాలు
నమ్ముకుంటే నేరవేర్చుతామనే
వాగ్దానాల హామీలు వర్షిస్తాయి
నాకెందుకని ఊరుకుంటే
కాళ్ళ కింద నేలిక మిగలదు

ఉరుముల్లా మాట్లాడుతూనే
మెరుపుల్లా పోట్లాడుతూనే
నిలదీసే ప్రశ్నలమై మొలకెత్తాలి..!

మోకు దెబ్బలు మోగాలి
కమ్మరి కొలిమి మండాలి
కమ్మరి సాలె లేవాలి
నేతన్నల పాటలు పోటెత్తాలి
సమస్త వృత్తుల ఐక్యత రాగాలు
సమర నాదాలై పల్లవించాలి
ఆత్మగౌరవ బతుకులు
చెదిరిన కలల సాకారం కోసం
కదలాలి.... తరలాలి...!

నిర్బంధాల సంకెళ్ళ ఇంకెంతకాలం
యుద్ధాలు లేని, అసమానత్వం లేని
వివక్షతలు లేని, స్వేచ్ఛకై నినదిద్దాం
మనుషులందరూ అవిశ్రాంతంగా
పోరు కెరటాలమై కదులుదాం...!



-గోపగాని రవీందర్
9440979882

## తెలుగు లెస్స

అమ్మ ఆవు
ఇల్లు ఈగ
చదివా ఆనాడు
పద్యాలు పాటలు
గ్రంథాలు కావ్యాలు
ఎన్నో చదివా ఈనాడు

చిన్నప్పటి చందమామ కథలు
బొమ్మరిల్లు కథలు
బుజ్జాయి కథలు
పంచతంత్రం కథలు
తెనాలి రామలింగడి హాస్య కథలు
పరమానందయ్య శిష్యుల కథలు
మరువలేని మరుపురాని
అందమైన తెలుగు భాష

కృష్ణుడి కోసం యమునా తీరాన వేచిన రాధ
అశోక వనంలో విలపించిన సీత
నల దమయంతిల ప్రణయగాథ
ఏంకి నాయుడు బావ
పుత్తడి బొమ్మ పూర్ణమ్మ
తల్లి దండ్రులను మోసిన
శ్రవణకుమారుని కథ
అడిగినదే దానం ఇచ్చే కర్ణుని కథ
వినసొంపుగా ఉండే చంద్రుల కథ
రంభ నాట్యాన్ని తిలకించే ఇంద్రుని కథ
ఎన్నో ఎన్నెన్నో మధురాలు
అదే నా తెలుగు భాష
దేశ భాషలందు లెస్స
నా తెలుగు భాష



-అరుణ డేనియల్
9000606889

## గాంధీజీ -మొగ్గలు

సాధారణ జీవితం గడుపుతూనే
భారతీయుల మదిలో మహాత్ముడయ్యాడు
నిరాడంబర ,నిగర్వి గాంధీజీ.

దేశ స్వతంత్రం కోసం తన సుఖాన్ని త్యజిస్తూనే
అందరిని ఒకే త్రాటిపై నిలిపిన ధీశాలి
సహన ,నిస్వార్ధ పరుడు గాంధీజీ.

స్వదేశీ సంప్రదాలను అనుసరిస్తూనే
విదేశీ వస్తువులను బహిష్కరించిన కార్యవాది
శాంతి ,పట్టుదల పరుడు గాంధీజీ

శాంతి మార్గమునే తన ఆయుధంగా చేసుకుని
కోట్ల భారతీయుల కలల సాకారం చేసాడు
స్వేచ్ఛ, స్వతంత్రం కై పోరాడిన యోధుడు గాంధీజీ

సత్య పరిపాలన కోసం నిరంతరం శ్రమిస్తూనే
ఎన్నో ఉద్యమాలను నడిపించిన సారధి
నవీన సత్య హరిశ్చంద్రుడు గాంధీజీ

అహింసా మార్గమే ఊపిరిగా మలచుకుని
ఎందరో నాయకులకు స్ఫూర్తినిచ్చినవాడు
భారత జాతి గర్వించ దగ్గ పిత గాంధీజీ



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## కంటి వెలుగు...!!


ఊరిస్తుంది వానాకాలం
ఒక్క చినుకు పడక..!
ఘోషిస్తుంది రైతు హృదయం
బక్క ప్రాణం ఆగక..!!

ఉత్తగాలులతోనే
దోస్తీ చేసే కాలం..!

భూమిలో నాటిన విత్తు
విపత్తుకు మూలం..!!

కవితా ప్రక్రియలో
అందమైనది నానీ..
నానీలనాన్న..
వెయ్యేండ్లు వెలుగని..!

నాయన
పంచిన వారసత్వం
పదుగురి కోసం
బతుకమనే తత్వం..!



-మరికంటి
సెల్: 9640407103

## కానరాని పచ్చదనం

మాయమైన పచ్చదనం కోసం
పుడమితల్లి గుక్క పట్టి
వెక్కి వెక్కి ఏడుస్తోంది
అదృశ్యమైన హరిత వనాల కోసం
జీవజాతులన్నీ
మూకుమ్మడిగా రోధిస్తున్నాయి,
నీతిలేని నరుడా,
ఎంతకని పరిగెడుతావ్....?
స్వలాభం కోసం
ఇంకెన్ని జీవాలను బలి కోరుతావ్....??
ప్రాణవాయువు ఉనికి లేక
ఊపిరాడని ఉపరితలం...
గొంతు తడవక నలువైపులా
కానరాని చుక్క జలం....!
తొలి శ్వాస, మలి శ్వాస నడుమ
గడిపేదంతా జీవితం....
ఆ శ్వాసను కూడా కలుషితం చేస్తే
ఇంకెలా మనగలం...?
అభివృద్ధి అంబరాన్ని అందుకుంటున్న
వర్తమాన మేధావి అనుకుంటున్నావ్ సరే,
పాతాళానికి పతనమవబోయే
భవిష్యత్ తింగరోడివి కూడా
నువ్వేనని మర్చిపోతున్నావ్....!

ఎంత అభివృద్ధి సాధించినా
మృత్యువును జయించే శక్తి
ఓ మనిషీ నీకు లేదు....

పచ్చని చెట్లలో నుండి,
కొండ కోనలను దాటుతూ,
ప్రశాంతతను పంచుతూ,
జీవులకు ఊపిరినిచ్చి,
బతికించే ప్రాణవాయువెక్కడ...?
పుడమి తల్లి ఒడిలో
పచ్చగా విలసిల్లే అడవి జాడ ఎక్కడ...?

ఇకనైనా,
ఇపుడైనా మారితే సరే
లేకుంటే నీ మెడకు ఉరే....



- ఎన్.లహరి
9885535506


# నిలదీసే భావాలతో "వెన్నెల్లో అక్షరాలు"

పుస్తక సమీక్ష

"నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకుంటున్న అందమైన ఆడపిల్లలు" అన్న తిలక్ గుర్తుకు వచ్చారు ఈ కవితా సంపుటి పేరు చూడగానే.. నిజమే.. కవిత్వం ఎప్పటికీ వెన్నెలే.. స్వచ్ఛమైన పదాల అల్లిక, ఆర్ద్రతతో నిండిన భావాల మాలిక కలవడం ఎంతో కష్టం. ఆ రెంటి కలయిక నిజంగా తెల్లని కాగితంపై విరిసిన వెన్నెల దొంతరే అనడానికి సందేహం అక్కర్లేదు. విరహాగ్నిలో మండిపోతున్న కవికి, వేదనలో మునిగిపోయిన కవి కలంలోని అక్షరాలు అడవి కాచిన వెన్నెలలా కనిపిస్తాయి..అంటే ఎలా చూసినా కవిత్వం వెన్నెలే అన్నది నిత్య సత్యం.

కవయిత్రి సముద్రాల శ్రీదేవి రచనలు తెలుగు పాఠకులకు విదితమే. ఈ సంపుటి "వెన్నెల్లో అక్షరాలు" లో 56 కవిత్వాలున్నాయి. కొన్ని వర్ణనాత్మకం. కొన్ని సందేశాత్మకం. మరికొన్ని ఆలోచనాత్మకంగా సాగిన ఈ కవితల్లో ఎంతో పరిణితి కనిపిస్తుంది. నిలదీసి ప్రశ్నించడమే కాదు. నిలబెట్టి సమాధానం చెప్పగల ధైర్యం, స్థైర్యం ఈ అక్షరాలలో మనకు ద్యోతకమవుతాయి. సమస్యలు అనేవి మానవ సహజం. సమస్యలు సృష్టించడం అనేది సమాజ సహజం. ఎదిరించి నిలచే అనేక తుపాకీ గుండ్ల కంటే ధైర్యంగా ఎదిరించి నిలిచే కలం ఎంతో గొప్పది అనేది ప్రాచీన కవుల మాటే అయినా నిత్యం నూతనంగా కవులకు ఊపిరి అందించేది మాత్రం ఆ వాక్యమే..

అక్షర శిల్పం అనే కవితలో "పచ్చిక బయళ్ళమీద/ గడ్డి పరకల పలకపై/ రాసిన మంచు ముత్యాల / అక్షరాలను/ అద్దుకుంటుంది ఉదయం" అంటారు. ఉదయం గడ్డి పరకలపై అంటిన మంచు ముత్యాలను అక్షరాలతో పోల్చడం, ఉదయం వాటిని అందుకుంటోంది అనడం మరింత వర్ణనాత్మకంగా కళ్ళకు కట్టినట్లుగా ఉంది. చక్కని దృశ్యాన్ని మనకి చూపారు.




నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని "కొత్త పేజీ మొదలు" అనే కవిత్వం రచించారు. "గతం చేతివేళ్ళను సుతిమెత్తగా /వదిలిపెడుతూ/ నేటి నిజం నింగి భవితవ్యాన్ని/ అందుకోవాలని ప్రయత్నం/ జ్ఞాపకాల నెమలీకలను/ భద్రంగా దాచి గుండె గుమ్మంలో ఎదురుచూస్తుంది కొత్త దనం" అంటారు. ఇక్కడ గతం చేతివేళ్ళను వదిలి పెట్టడం అనే భావం ఎంతో సున్నితంగా, హృద్యంగా గోచరిస్తుంది.

అసలు కవి తన కవిత్వాన్ని మొదలు పెట్టేది అమ్మ అనే పదంతోనే అనిపిస్తుంది. ప్రతి బిడ్డ తన మొదటి అక్షరం దిద్దుకునేది అమ్మనుండే. అలాగే తిరిగి ఆ బిడ్డ ఎదిగి తనలోని భావాల్ని తనంతట తాను బయటపెట్టుకునే సమయం వచ్చిందంటే అది కూడా అమ్మ తోనే ప్రారంభమవుతుంది. అమ్మ అనేది ఒక వ్యక్తి కాదు. ఒక సందర్భం. కనుకనే అమ్మ, ఉగాది, నూతన సంవత్సరం, ఆగస్టు 15 వంటి అతి ముఖ్యమైన సందర్భాల నుండే కవి తనలోని భావజాలాన్ని బయటపెట్టుకునే ప్రయత్నం చేస్తాడు. బహుశా మొదటి సంపుటిలో అమ్మను గురించి శ్రీదేవి రచించే ఉంటారు. ఈ సంపుటిలో 'బతుకమ్మ మా అమ్మ!' అంటూ ఒక కవిత రచించారు. కవిత్వం కనిపించకుండా రచించినా అది కవిత్వం అయ్యే సందర్భం ఏదయినా ఉంటే అది అమ్మను గురించే లేక బతుకమ్మను గురించే అనిపిస్తుంది. అలాగే బతుకమ్మ ను గురించిన కవిత పొందుపరిచారు.


కవయిత్రి శ్రీదేవి ఒక్కోచోట తన భావాలతో మనల్ని కట్టిపడేస్తారు. ఉదాహరణకు "దిక్కులు విడిచిన వలసలు" అనే కవిత్వంలో "పల్లె తల్లితండ్రులను విడిచి రెక్కలు / రాకముందే చుక్కల దారిలో దిక్కుల వైపుకు పోయి /పల్లెను ఒంటరిగా చేసాయి// వలసపోయిన పల్లె ఆకురాలిన శిశిరంలో/ చెట్టుమాదిరి మూగబోయి వసంతపు/ కొడుకుల కోసం ఎదురు చూస్తుంది" అంటారు. ఇక్కడ పల్లెను ఒంటరి చేయడం, వసంతాన్ని కొడుకులతో పోల్చడం ఎంతో కవితాత్మను చూపుతుంది.

అలాగే కొడుకులు, కూతుర్లు ఇద్దరూ ఒక్కటే అని అనేక సందర్భాలలో మనకు తెలుస్తున్నా ఇంకా ఆడపిల్ల పుట్టగానే విసిరేయడం, మగపిల్లవాడు పుట్టలేదని కట్టుకున్న భార్యను పుట్టింటికి పంపేయడం జరుగుతూనే ఉంటోంది. ఆశ్చర్యం ఏమిటంటే ఇన్ని సమస్యలకు మూలకారణం అయిన సైన్స్‌ను ఇలాంటి మూర్ఖులకు బోధించేవారే లేరు. ఈ వస్తువు సమాజానికి ఎంతో అవసరం అనుకున్నారేమో శ్రీదేవి "ధృతారాష్ట్రుని పుత్రోత్సాహం" అనే కవితను రచించారు. "పుత్రుడు పుట్టగానే సరిపోదు/ విశ్వమంతా ఎదిగి/ ఒదిగిన తర్వాతే అవుతాడు పుత్రుడు" అంటూ నేడు కొడుకులు సృష్టిస్తున్న మారణహోమాన్ని మహాభారతంలోని పాత్రలు, కురుక్షేత్రంలోని పాత్రలతో పోల్చి పూర్తి చేసి ఒక స్ఫూర్తిని కలిగించడం ఎంతో అవసరం అనిపించింది.


కవి విపరీతంగా ఆగ్రహించినా, ఆవేదన చెందినా, నిర్లిప్తత ఎదురు చూసినా తనలోని ఆ అంతర్యుద్ధాన్ని అక్షరాలుగా పండిస్తే ఎదురయ్యే కవితలు అస్త్రాలై ఎదుటివారిని నిలదీసేలా సాగుతాయి.

అలవోకగా రచించిన కవితలు కేవలం విషయాలుగా నిలిచిపోతాయి. అందుకేనేమో కవిని మండుతున్న అగ్నిగోళంతో పోల్చుతారు లేదా ఎగసిపడుతున్న కెరటంతో పోల్చుతారు. పారే సెలయేరును చూస్తే ప్రశాంతత నొందుతాము. అదే ఎగసిపడే కెరటాన్ని చూస్తే ఒకింత ఆలోచిస్తాము. ఆ వ్యత్యాసంలో కదిలేదే కవిత్వం. సముద్రాల శ్రీదేవి కవిత్వంలో ఇలాంటి అనేక భావాలు కనిపిస్తాయి. వారికి నా అభినందనలు..

ప్రతులకు: డా॥ సముద్రాల శ్రీదేవి
ఫోన్: 99498 37743



-శైలజామిత్ర
9290900879



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 557వ రోజు 'హైదరాబాదు' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'హైదరాబాదు' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక &
దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

## భాగ్యనగరము


సీ. సౌరభశిఖలన్నిజగజగజగ జగ
జ్జేగీయమానమై జిలుగువెలుగు
నింగికెగురునలలునిత్యమైకాంతుల
హుస్సేనుసాగరమున్నతమ్ము
ప్రతిభాప్రపంచానభాగ్యమైవిద్యల
రంజిల్లుసంకేతరాజధాని
కార్మికశ్రామికగౌరవమునుపాధి
సస్యకేదారాలస్థావరమ్ము
తే.గీ. భాగ్యనగరముజ్ఞానమారోగ్యపురము
కళలుసంస్కృతుల్కలిసినకలిమిచెలిమి
సర్వమతములసంద్రమౌశాంతిపూత
హైదరాబాదువిద్వత్తుకాశ్రయమ్ము
ఉ. భారతదేశమందుగలపట్నములందునగొప్పపేరుతో
పేరుగడించె గొప్పదని విశ్వము మెచ్చగ శాస్త్రశోధనన్
చారిమినారుసుందరముసంపదశిల్పముగోలకొండలో
ధీరులవీరసాహసముదివ్యపురమ్మిది హైద్రబాదుయే!!.



-మాడుగుల నారాయణమూర్తి

## హైరాణాబాద్

ఒక్కపుడు భాగ్య నగరం
ఇప్పుడదే అయోమయ నగరం
ఎక్కడ ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న
భయం
భద్రత కరువు
భయంతో బతుకు
భాగ్యవంతుల వింత చేత లకు
ఎందరో అబలలు
బలి అవుతున్న నగరం
గత చరిత్ర చూసి మురిసి పోవాలో
నడుస్తున్న చరిత్ర చూసి
నవ్వుకోవాలో
అర్థం కానీ నగర సగటు జీవి
నిజమే భాగ్య నగరంలో
భాగ్యం కను మరుగవుతోంది
మానవత్వము మూసీలో కలిసిపోతోంది
బతుకుదెరువుకు భాగ్యనగరం
బతకడం బరువైన భాగ్యనగరం
హైదరాబాద్..
ఇప్పుడు హైరాణాబాద్.



-పరాంకుశం నారాయణ రావు

## నాడు-నేడు!

హై..రానా! ఇస్సుఉస్సుఖజానా
ద..గాపడిన చిల్లి బతుకులు!
రా..బందుల రాస్తాలు గోతులు!
బా..రులుగా బార్లు.. పబ్బులు జిమ్ములు!
దు..కాణాల కోలాహలం!.
మింగుడు పడని హాలాహలం!
మేడిపండు జీవితాలు!
రేగుతున్న గాయాలు!
హైటెక్ హీటెక్కురాజకీయాలు!?
బాల్యంలో నా హైదరాబాద్
పచ్చదనాలతోట!
ఆప్యాయత ఊట!
మార్వాడీ ముస్లిం బాలలతో
ఆటపాటలు!కేరింతలు!
"ఖేలేంగే ఆవో-డబల్కా మీఠా ఖావో!"
మతం మత్తు లేని పాతనగరం!
అమ్మా నాన్నలతో పిల్లిలా
కిరాయి ఇళ్లల్లో కొత్త దోస్తులు!
సురాయ్ ఠండాపానీ!
కొత్త కహానీ!
నానాజాతి సమితి జీవనం !
ఐనా చెదరని ప్రేమాభిమానాలు!.
చెమ్కీ గౌనులు లంగాలు!
నల్లబుర్ఖాల్లో ఎర్రగోరింటతో
మెరిసే తెల్లపాదాలపై
వాలేవి నాచూపులు!
బస్సు యానం
భలే సందడి
ఆనందం!.
మరి నేడో!?
ప్రపంచ మహానగరాల్లో ఒకటి
ముత్యాల భాగ్యనగరంలో
సాఫ్ట్ వేర్లు వచ్చాయి!
సభ్యతా సంప్రదాయాలు
హుస్సేన్ సాగర్ కూపంలో కలిశాయి?
కలుపుతున్నామా??
హార్డ్ వేర్ బతుకుల్తో
స్మార్ట్ ఫోన్ లో నగరవీక్షణం!
చెప్పేందుకు ఏమీలేని
ఎవరికి వారు యమునా తీరే
ఎవరిగోల వారిదే!
ఫారిన్ కల్చర్తో
పొగరుబోతు (అ)భాగ్యనగరం!!?

-ఎ.రాజ్యశ్రీ

## హమారా షహర్

కాలం కాటు వేస్తే
కరువులు వెంటాడుతుంటే
కన్నతల్లిని
ఉన్న ఊరుని వొదిలేస్తే
అమ్మలా ఆదరించి!
అక్కున చేర్చుకుంది హైదరాబాదు !!
బంధుత్వం లేకున్నా
బతకమన్నది భాగ్యనగరం
పేదవాన్ని పెద్దోని చేసింది
మతాలకతీతంగా ముద్దాడింది
అమ్మలా ఆప్యాయంగా
అక్కున చేర్చుకుంది హైదరాబాద్ !!
భాషలు వేరైనా
భవితవ్యాన్ని చూపింది
శిక్షణలిచ్చి సిరిసంపదలు పెంచింది
అలసిన దేహాలకు
స్వేదాన్ని తుడిచి సేదతీర్చింది
అమ్మలా ఒడిలోకి చేర్చింది
హమారా హైదరాబాద్!!.
నవీన నాగరికతకు నజరానా
అత్యాధునికమైన పోకడలకు చిరునామా
భిన్న సంస్కృతులు
సంప్రదాయాలు
కొలువులకు నిలయమైన
కోహినూరు వజ్రం
భారతదేశంలో భాగ్యనగరం
హమారా షహర్!!.



-గుండవరం కొండల్ రావు

## పట్టణం ఎప్పుడు పట్టణమే

ప్రగతి సాధించే దిశ
ఎందరో డిగ్రీలు చేత పట్టుకుని
హైదరాబాద్ చేరి
తమవంతు కర్తవ్యం లో లీనమై
ప్రగతి సాధిస్తూ
గుర్తింపు పొందుతూ
ఎంత చెట్టుకు అంత గాలి జీవితంలో
ఎదిగి తమ గమ్యాన్ని చేరడమే లక్ష్యం
హైదరాబాద్ అంటే
చార్మినార్
రాళ్ళ గాజులు
ముత్యాలు
చెమ్కీ చీరలు
మూసీనది
బిర్లా టెంపుల్
సాలార్జంగ్ మ్యూజియం
పబ్లిక్ గార్డెన్
జూలాజికల్ పార్క్
ఇంకా ఎన్నో ఎన్నెన్నో.
అన్నీచూస్తూ బుద్ధుడు
శాంతి చిహ్నం లా
నీళ్ల మధ్యలో
నెక్లెస్ రోడ్డు అందాలు
కొత్త వాళ్ళకి చూపిస్తారు కానీ
మెరుపులు వేరు జీవితం వేరు
పట్టణం ఎప్పుడు పట్టణమే.



-నారుమంచి వాణీప్రభాకరి

## ప్రేమ చిహ్నం

నాలుగు శతవర్షాల చరిత్ర
అందమైన పరిసరాలు
విలసిల్లే ప్రకృతి సౌందర్యం
కులీ కుతుబ్ షాచే నిర్మితం
తగ్గిన ప్లేగు వ్యాధి కి గుర్తుగా
చార్మినార్ నిర్మాణం
వజ్రాలకు, ముత్యాలకు
రాళ్ల గాజులకి ప్రసిద్ధి.
అభివృద్ధికి బాటలు..
పెద్దజలాశయాల నిర్మాణం
ప్రజల దాహార్తి కోసమే..
భారత్ లో పెద్ద సంస్థానం
స్వతంత్ర కాంక్ష
భారత్ లో విలీనం కి
వ్యతిరేకం
ఆపరేషన్ పోలో
ఫలితం విలీనం..
చారిత్రక చార్మినార్
చుట్టూ అత్తరు
ఘుమ ఘుమలు..
రంగుగాజుల
గలగలలు..
అద్దాలు రాళ్లగాజుల
మిలమిలలు..
సుహృద్భావ వాతావరణం
సౌభ్రాతృత్వ పరిమళాలు
అంతులేని వలసలు
అందరికీ లభించే ఆదరణ..
మెడికల్ హబ్ గా ప్రసిద్ధి
నలుదిశ లా విస్తరించిన
ఐ టీ కంపెనీలు
విభిన్న సంస్కృతుల సమ్మేళనం
సంగీత, సాహిత్యాలకి సమాదరణ
ఇవన్నీ ఒక ఎత్తు
హైదరాబాద్ బిర్యానీ
ప్రపంచ ప్రసిద్ధం
పేరు వింటే చాలు
ఘుమ ఘుమలు
ముక్కు పుటా లదురు
రుచులు నోరూ రించు..
హస్త కళల నిలయం
మన భాగ్య నగరం..



-మోటూరి శాంతకుమారి

## సౌభాగ్య నగరం

దక్కను పీఠభూమిగా
ఘనతకెక్కిన ఘనమైన నేల
కాకతీయుల ప్రాభవానికి
చిరునామాగా గోల్లకొండ
బహమనీయుల రాజ్యభాగంనుండి
కుతుబ్ షాహీ రాజ్యం
ఘనమైన గోల్కొండ సామ్రాజ్యమై
భరత ఖండంలో
భాగమతి పేర మూసీనది తటాన
కుతుబ్ షాహీల ప్రేమకు చిహ్నం
భాగ్యనగరం సౌభాగ్య నగరం
నాలుగు శతాబ్దాల నవనాగరికతా క్షేత్రం
ఘనమైన వజ్ర సంపదకు ఆలవాలం
నిజాంల ఏలికలో విశ్వవిఖ్యాతి
వారసత్వ సంపదలకు ఘనవెలుగులు
కుతుబ్ షాహీల ఖండాంతర
ఖ్యాతిగా చార్మినార్ కట్టడం
అపూర్వ తారకగా
హైదరాబాద్ కీర్తిచంద్రికగా
ఫలక్ నుమా కట్టడం
ఉర్దూ మాధ్యమ విశ్వవిద్యాలయంగా
ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఖండాంతరంలో వాసి
సంపదలో హైదరాబాద్
ఘనమైన పట్టణ ప్రణాళిక
జంట జలాశయాలు
భూగర్భ మురుగునీటి వ్యవస్థ
అన్నింటా ప్రత్యేకంగా
అవనిపై హైదరాబాద్
నేటికీ విరివనాల
నగరంగా హైదరాబాద్
ఆధునిక హంగులతో
అన్నిరంగాల్లో అగ్రపథంలో
తెలంగాణ సిరులఝరి
మన భాగ్యనగరి!.



- లక్ష్మారెడ్డి పసుల

## భాగ్యనగరం

హైదరలీ పేరుతో హైదరాబాద్
భాగమతి పేరున భాగ్యనగరం
తెలుగుగణం పేరున తెలంగాణ
రకరకాల పేర్లు
దక్కన్ పీఠభూమిగా వెలుగు జిలుగులు
చార్మినార్ మక్కా మజీద్
సాలారుజంగు మ్యూజియం
జూపార్కు గోల్కొండ ఖిలా
హుస్సేన్ సాగర్
ట్యాంక్ బండు
ఉస్మానియా విశ్వవిద్యాలయం
ఉస్మానియా గాంధీ ఆస్పత్రులు
అసెంబ్లీ ఇందిరా పార్కు
చూడచక్కనైనది హైదరాబాద్
ప్రపంచానికే ఆకర్షణగా
ముత్యాల నగరి
వసతినిచ్చే వసతి గృహాలు
ఉజ్వల భవితకు
సాయం కళాశాలలు
ఇరానీ ఛాయ్ బిర్యానీ లు
హైదరాబాదుకు వన్నె చిన్నెలు
గంగా జమునా
తహజీబుకు ఆదర్శం
విభిన్న సంస్కృతుల నిలయం
బహు భాషలకు ఆలయం.



-గుండం మోహన్ రెడ్డి



# బహుముఖ ప్రజ్ఞాశాలి ద్రౌపది ముర్మ?.!

**(రాష్ట్రపతి అభ్యర్థిగా మన్యం మహిళ ద్రౌపదీ ముర్మును ఎంపిక చేసిన భాజపా/యన్‌డిఏ నేపథ్యంలో)**

దేశ అత్యున్నత రాజ్యాంగ పదవి అయిన భారత రాష్ట్రపతిగా తొలి హిందూ గిరిజన మహిళ భాజపా/యన్‌డిఏ అభ్యర్థిగా నామినేషన్ వేయడం చకచక జరిగి పోయింది. విద్యావంతురాలైన మాజీ జార్ఖండ్ తొలి గవర్నర్‌గానే కాకుండా ఒడిసా రాష్ట్ర మంత్రిగా 64 ఏళ్ళ ద్రౌపదీ ముర్మును భాజపా నేతృత్వంలోకి యన్‌డిఏ నిర్ణయించడంతో ప్రతిపక్షాల ఐక్యతకు చిచ్చు పెట్టడమే కాకుండా గెలుపును లాంఛనప్రాయం చేసినట్లు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిని నిలపాలన్న మమతా బెనర్జీ, కెసిఆర్ లాంటి ముఖ్యమంత్రుల ప్రయత్నాలకు, గెలుపు దారులకు ముర్ము ఎంపిక గండి కొట్టినట్లు అయ్యింది. ప్రతిపక్షాల ప్రయత్నాలను తొలి నుంచి సమర్థించిన జార్ఖండ్ ముక్తి మోర్చా (జెయంయం) నేడు తొలి మన్యం బిడ్డ ద్రౌవదీ ముర్మ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడం అసాధ్యంగా తోస్తున్నది. ఆంధ్రప్రదేశ్ సియం జగన్మోహన్ రెడ్డితో పాటు బియస్‌పి అధినేత మాయావతి, ఒడిసా ముఖ్యమంత్రి నీన్ పట్నాయక్, తమిళనాడు ఏఐఏడియంకె లాంటి ప్రాంతీయ పార్టీలు ముర్ముకు అనుకూలంగా ప్రకటనలు చేయడంతో ఈ ఎన్నికలో మన్యం మహిళ విజయం ఖాయంగానే తోస్తున్నది. 18 జూలై 2022న జరుగనున్న రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా యశ్వంత్ సిన్హా పోటీ చేయనున్నారు. మన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పదవీ కాలం 24 జూలై 2022న ముగియనుందనే విషయం మనకు తెలిసిందే. మన్యం మహిళ, ఆదివాసీ అతివ, గిరిజన పక్షపాతి అయిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతి అభ్యర్థిగా నిర్ణయించిన భాజపా/యన్‌డిఏలు గెలుపును ఖాయం చేసుకుంటూ, ప్రతిపక్షాలను ఇరుకున పెట్టినట్లు స్పష్టం అవుతున్నది.

వ్యక్తిగత జీవితం:

20 జూన్ 1958న ఒడిసాలోని మయూర్భంజ్ జిల్లా, బైదపోసి అనబడే మారుమూల గ్రామంలో సంతాలీ ఆదివాసి గిరిజన హిందూ కుటుంబంలో జన్మించిన ద్రౌపదీ ముర్మ ఉన్నత విద్య రమాదేవి మహిళా కళాశాల నుంచి బిఏ డిగ్రీ పొందారు. తండ్రి బిరాంచి నారాయణ్ తాండు, తాతలు గ్రామ పంచాయతీ పెద్దలుగా పేరును గడించారు. బ్యాంకు ఉద్యోగి శ్యాంచరణ్ ముర్మును వివాహమాడిన ద్రౌపదీ ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఇతిశాకు జన్మనిచ్చినా, దురదృష్టవశాత్తు ఇద్దరు కుమారులు, భర్త అకాల మరణం కూడా మరణించడంతో మనోవేదనను అనుభవించారు. డిగ్రీ పూర్తి చేసిన అనంతరం రాయ్‌రంగాపూర్‌లోని శ్రీ అరబిందో సంస్థలో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగపర్వం ప్రారంభించి, ఒడిసా ప్రభుత్వంలో వ్యవసాయ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు.

రాజకీయ జీవితం:

1997లో భారతీయ జనత పార్టీలో సభ్యురాలిగా చేరి రాయ్‌రంగాపూర్ పంచాయత్ కైన్సిలర్‌గా ఎంపికై రాజకీయ జీవితం ప్రారంభించారు. మయూర్‌భంజ్ జిల్లా భాజపా అధ్యక్షురాలిగా, ఒడిసా రాష్ట్ర భాజపా యస్‌టి మోర్చా విభాగానికి అధ్యక్షురాలిగా పని చేశారు. భాజపా, బిజెడి సంకీర్ణ ప్రభుత్వంలో రాయ్‌రంగాపూర్ అసెంబ్లీ స్థానానికి యంయల్‌ఏగా ఎంపికై 2000-04 మధ్య రాష్ట్ర వాణిజ్య/రవాణా/మత్స్య/పశుసంవర్ధక శాఖల మంత్రిగా సేవలు అందించారు. 2000, 2004లో రెండు సార్లు శాసన సభ్యురాలిగా ఎంపికై ఉత్తమ యంయల్‌ఏగా ఒడిసా అసెంబ్లీలో 'నీలకంత పురస్కారం' అందుకున్నారు ద్రౌపదీ ముర్మ. 2015-21 కాలానికి జార్ఖండ్ రాష్ట్ర తొలి గవర్నర్‌గా సేవలు అందించిన మన్యం ముద్దు బిడ్డ ఆదివాసీ గిరిజనుల అభ్యున్నతికి పాటు పడుతూ బడుగులు, అల్పాదాయ వర్గాల సాధికారతకు కృషి చేశారు.

బహుముఖీ ప్రతిభ:

దేశ స్వాతంత్ర్యానంతరం జన్మించి రాష్ట్రపతిగా పోటీ చేస్తున్న తొలి అభ్యర్థిగా ప్రత్యేకత చాటుకున్నారు. ఉపాధ్యాయురాలు, సామాజిక సేవా కార్యకర్త, విలువలు కలిగిన రాజకీయవేత్త, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా పలు రంగాల్లో విస్తృత సేవలందించిన ఆదివాసీ అతివ ముర్మ రాష్ట్రపతిగా ఎంపిక కావడం నల్లేరుపై బండి నడకగానే తోస్తున్నది. ఒడిసా రాష్ట్ర గవర్నర్‌గా పూర్తి కాలం సేవలందించిన తొలి భారతీయ మహిళగా పేరు తెచ్చుకున్నారు. ఒక వేళ ఎన్నిక అయితే దేశ తొలి ఆదివాసీ రాష్ట్రపతిగా, స్వతంత్ర భారతంలో జన్మించిన తొలి అభ్యర్థిగా, రెండవ మహిళ రాష్ట్రపతిగా పలు ప్రత్యేకతలను స్వంతం చేసుకోనున్న ద్రౌపదీ ముర్మ ఏ పదవిని అలంకరించినా తన భవిష్యత్తు జీవితం ఫలప్రదంగా సాగాలని, బలహీన వర్గాలకు దారి దీపం కావాలని, దేశ పరువు ప్రతిష్ఠలు కాపాడగల బహుముఖీన ప్రతిభవంతురాలుగా ద్రౌపదీ ముర్మ పేరు తెచ్చుకోవాలని కోరుకుందాం. 2009 వరకు స్వంత ఇల్లు కూడా లేని ద్రౌపదీ ముర్మ ప్రదర్శించిన మానవీయ విలువలు, అత్యుత్తమ ఆదర్శవంతమైన రాజకీయ జీవితం నేటి కుటిల, కుహనా రాజకీయవేత్తలకు మార్గదర్శనం చూపగలదని ఆశిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ 6వ జాతీయస్థాయి వచన కవితల పోటీ

గుంటూరుకు చెందిన "బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్" నిర్వహిస్తున్న 6వజాతీయస్థాయి వచన కవితల పోటీకి కవితల్ని ఆహ్వానిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, కవి రచయిత బండికల్లు జమదగ్ని, ప్రధాన కార్యదర్శి బండికల్లు శ్యాంప్రసాద్ సంయుక్తంగా తెలియజేస్తున్నారు. కవిత నిడివి 30 పంక్తులకు మించకూడదు. సామాజిక అంశాలను ప్రతిబింబించే కవితలకు, క్లుప్తత, గాఢత వున్న కవితలకు ప్రాధాన్యత.. ఒక్కొక్కరికీ రెండు కవితల వరకు పంపే అవకాశం వుంది. ఒక్కో కవిత రెండు కాపీలు పంపాలి. కవిత రాసిన పేజీ పై కవి పేరు గానీ, ఇతర సమాచారం గానీ రాయకూడదు. హామీపత్రం పై మాత్రమే ఆ వివరాలు రాయాలి. ఆసక్తి గల కవులు తమ కవితలను బండికల్లు జమదగ్ని, ప్లాట్ నెం. 402, హిమజ టవర్స్, 3/10 బ్రాడీపేట, గుంటూరు-522 002 చిరునామాకు 2022 జులై 30వ తేదీలోపు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ పంపాలి. ఎంపిక విషయంలో నిర్వాహకులకు పూర్తి స్వేచ్ఛ వుంటుంది. ప్రథమ బహుమతికి ఎంపికైన కవితకు రు.2,500/- ద్వితీయ బహుమతి కవితకు రు.2,000/-లు, తృతీయ బహుమతి కవితకు రు.1,500/- మరియు రు.750/-ల చొప్పున నాలుగు ప్రోత్సాహక బహుమతులుంటాయని నిర్వాహకులు తెలియజేస్తున్నారు. మరిన్ని వివరాలకు బండికల్లు జమదగ్ని, 98482 64742 నెంబరులో సంప్రదించవచ్చు.




24.06.2022న హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికలో సాహితీకిరణం నిర్వహించిన కార్యక్రమంలో జన్నాభట్ల నరసింహప్రసాద్ రచించిన 'సంగమం' నవలికను డా॥ముక్తేవి భారతి ఆవిష్కరించారు. చిత్రంలో వి.వి.రాఘవరెడ్డి, కమలాకరభారతి, వసుమతి, గుదిబండి వెంకటరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, ఆచార్య ముదిగొండ శివప్రసాద్(సభాధ్యక్షులు), రమణ వెలమకన్ని, పెద్దూరి వెంకటదాసు.




27.06.2022న శ్రీ త్యాగరాయ గానసభ మెయిన్ హాలులో శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహించిన ఎందరో మహానుభావులు మధురస్మృతులతో కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పి.వి.నరసింహారావు జయంతి కార్యక్రమంలో పాల్గొన్న తాళ్ళవల్లి చక్రపాణి, సి.హెచ్.త్రినాథరావు, డా॥వకుళాభరణం కృష్ణమోహన్(ముఖ్యఅతిథి), కళా వి.ఎస్.జనార్దనమూర్తి (సభాధ్యక్షులు), పొత్తూరి సుబ్బారావు (విశిష్ట అతిథి), వై.సుబ్రహ్మణ్యం

# డాక్టర్ రహమతుల్లా ఘంటసాల గానావధానిగారిని సత్కరించిన వంగాల బాలరాజ్‌గౌడ్



తెలుగు సాహిత్య కళాపీఠం నిర్వాహణలో ఘంటసాల శత జయంత్యుత్సవముల సందర్భంగా రవీంద్రభారతిలో ఘంటసాల గానావధానము ఘనంగా నిర్వహించబడింది. ముఖ్య అతిథిగా డా॥ కె.వి. రమణాచారిగారు హాజరై రహమతుల్లా గారిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ సంస్థల అధినేత వంగాల బాలరాజ్‌గౌడ్ రహమతుల్లాగారిని ఘనంగా సత్కరించి, అభినందించారు.

గత 36 సం॥రాలుగా ఘంటసాలగారి గానామృతాన్ని దేశవ్యాప్తగా ఘంటసాల అభిమానులను రంజింపచేస్తూ, 189వ అవధానం నిర్వహించడం అభినందనీయమని వంగాల తెలిపారు. ఘంటసాల మరియు రహమతుల్లాగారి అభిమానులతో హాలు క్రిక్కిరిసిపోయి కార్యక్రమం విజయవంతమైంది. సాహిత్య కళాపీఠం అధ్యక్షులు చిక్కా రామదాసు, సభాధ్యక్షులు డా॥ ఈటెల సమ్మన్న నిర్వహించారు.




అఖిల భారత పద్మశాలి సంఘం న్యూ ప్రెసిడెంట్‌గా నియమితులయిన కందగట్లస్వామిని సత్కరిస్తున్న వంగల బాల్‌రాజ్‌గౌడ్, చిక్కా రాందాసు, చిక్కా దేవదాసు, పద్మశాలి ప్రముఖులు.

# తూములూరి శాస్త్రి రచించిన "భారతీ విలాసము' గ్రంథావిష్కరణ




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి తదితరులు.

తూములూరి శాస్త్రి రచించిన భారతీ విలాసము (శ్రీకాళిదాస చరిత్ర-నాటకము) గ్రంథావిష్కరణ సభ మంగళవారం రాత్రి ఆస్ట్రేలియాలోని తెలుగుమల్లి సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు డా॥కే.వి.రమణాచారి మాట్లాడుతూ విదేశాల్లో స్థిరపడిన తెలుగువారు మాతృభాషను ప్రేమిస్తున్నారన్నారు. శాస్త్రి సుధూర ప్రాంతంలో ఉన్నా తెలుగుభాషా ప్రేమికుడని, ఆయన కాళిదాసు చరిత్రను నాటక రూపంలో రాసి తెలుగువారికి అందించాలనే తపనతో తెలంగాణాలోని గ్రంథాలయాలకు ఉచితంగా అందించడం ఆదర్శనీయమన్నారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ గ్రంథాలు ఇంట్లో ఉంచుకునేకంటే రచయితలు గ్రంథాలయాలకు ఉచితంగా ఇవ్వాలన్నారు. గ్రంథాలయ పరిషత్ చైర్మన్ అయాచితం శ్రీధర్, వ్యక్తిత్వ వికాస నిపుణులు రాఘవేంద్ర తెలుగుమల్లి అధ్యక్షుడు మల్లికేశ్వరరావు, సుంకరపల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## కణిక



అడ్మిన్: రమాదేవి కులకర్ణి

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా'
పోటీ ఫలితాలు



నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

(ప్రథమ)

## ఆమె సజీవ శిల్పం

తూరుపు కొండ మీదనుండి
బయలుదేరిన చైతన్యకిరణాలు
ఖగాలై మేను కొమ్మలుపై
వాలుతున్నాయి,..నువ్వేనా
అని ప్రశ్నాపత్రాలను మోసుకొస్తూ..
మార్పుకై..
తనకై బాల్యములో నిర్మించుకున్న
ఆశల గూడును
అంతరంగ పొరలతో కప్పి..
గతము మరిచిన పాత్ర
సహజనటిలా పోషిస్తూ..
అధరాలకు చిరునవ్వు కాంతిని
పూసుకుని..
ఆమె
సజీవ శిల్పమై నిల్చుంది
ఇంటికి వెలుగై..వరాల నొసగె
వరలక్ష్మి...
బాధ్యతల సింహాసనమెక్కించి
సహనకిరీటముతో అలంకరించాయి తనలో
భాగమంటూ మోసుకొచ్చిన కొత్తపాత్రలు...
స్వేచ్ఛకు కంచెలు వేస్తూ...
నీవులేక మేము లేమంటూ
బాధ్యతల లక్ష్మణ రేఖ గీస్తూ,.
అంతే ..అంతా ..నూతన
మబ్బులతో మనోవీధి అలుముకుంది...
తనతో నిండిన
గతము పరులదిగా చూపబడింది..
కొత్త లోకం ఆవిష్కరింపబడింది
నీదంటూ..కట్టుబాట్ల కంచెలో..
ఏది నాదంటూ ..
రెండు పడవలపై
ప్రయాణం మొదలుపెట్టింది..
సృష్టి ఆది నుండి ..



-కుసుమంచి శ్రీదేవి

## సజీవ శిల్ప కళ

ఇద్దరు శిల్పుల చేతిలో
రూపుదిద్దుకున్న శిల్పం
ఏడడుగులు జతగా
ప్రేమ ఉలితో చక్కగా
చెక్కిన శిల్పం
పుష్పాల పానుపు మీద
అనురాగానికి పరిమళాన్ని
అద్దిన జక్కన్న శిష్యుల
చిరు చెమట సాక్షిగా
రూపుదిద్దుకున్న అంగుళం శిల్పం.
తరాల వంశ చరిత్రని
తరగని ధనం గా పోసి
ఆరంగు లాళ గర్భగుడిలో
తనువుల మేళ తాళాలు
మధ్య ఒక నవమాసాల
నూతన శిల్పానికి
నాంది పలికింది.
అదే శిల్పపానికి తన
ఒడిలో అందమైన ఆకృతి ఇచ్చింది
జవసత్వాలు అన్నీ జీవనదులగా
మలచింది..
ఒంపుసొంపులు హ్వాయలు ఇచ్చింది
శక్తి యుక్తులను మేళవించి
విశ్వం ఉలిక్కి పడేలా ఒణుకుతున్న
చేతులతో నగిషీలు అద్దింది
ప్రపంచ వేదిక మీద
ఒక ప్రత్యేక స్థాయినిచ్చింది...
ప్రేమతో చెక్కిన తన నూరేళ్ల
ప్రతిరూపానికి చిలుక పలుకులు నేర్పిన వేళ
..
ఒక్కసారే మాటలు నేర్చిన
నేర్పరి తనంతో అచ్చెరువు నొందింది...
కష్ట సుఖాల రుచి చూసింది
మంచి చెడుల మేలు కలయికే
ఈ మానవ లోకం అని తెలుసుకుంది
క్షణ క్షణానికి రంగులు
మార్చుకుంటున్న మాయాలోకంలో
మాటే రాని ఒక సజీవ శిల్పం అయ్యింది...
మంచి తనానికి సాక్ష్యంగా
మౌనానికి మరో రూపం అయ్యింది..
మహా...



-దుర్గా మహాలక్ష్మి.ఓలేటి

# కుందేలు ఉపాయం (కథ)

ఒక కుందేలు వేసవిలో తన దప్పిక తీర్చుకోవడం కొరకు ఒక మడుగు దగ్గరకు వెళ్ళింది. అక్కడ దానికి మడుగులోని చేపలు స్వాగతం పలికాయి. అవి కుందేలుతో " కుందేలు మామా! మాకు ఇక్కడ ఒక నక్క వలన ఆపద కలుగుతున్నది. అది రోజూ నీటిని త్రాగటానికి వచ్చి ఈ మడుగులోని కొన్ని చేపలను పట్టుకొని తింటున్నది. మాకు దాని పీడ విరగడ అయ్యేటట్లు ఏదైనా ఒక ఉపాయం చెప్పవా "అని అడిగాయి. అప్పుడు కుందేలు వాటితో "రేపు నక్క వస్తే ఒక మొసలి వచ్చి ఈ నీటిలో చేరిందని చెప్పండి. తర్వాత సంగతి నేను చూస్తాను" అని అంది. చేపలు సంతోషంతో సరేనన్నాయి.

మరునాడు నక్క ఆ మడుగు వద్దకు రాగానే చేపలు " నక్కమామా! ఇక్కడకు కొత్తగా నిన్ననే ఒక మొసలి వచ్చి చేరింది. అది మాకు రక్షణగా ఉంటానని అన్నది.ఇక నీ ఆటలు సాగవులే!" అని అన్నాయి .నక్క వాటి మాటలను తేలికగా కొట్టిపారేసింది. " ఈ మడుగులో నాకు తెలియని మొసలి ఇక్కడెక్కడ ఉంది" అని ఆ మడుగు లోనికి చేపలు పట్టుకోవడం కొరకు దిగింది. వెంటనే దానికి తన కాలును ఏదో దొరకబుచ్చుకున్నట్లు మరియు ఆ కాలును కొరికినట్టు అయింది.ఆ నక్క వెంటనే గట్టిగా "బాబోయ్ మొసలి! మొసలి!" అంటూ తన కాలును పైకి లాక్కొని మడుగు ఒడ్డు పైకి వచ్చి వేగంగా ఒకే పరుగుతీసింది.

ఆ నక్క కాలును దొరకబుచ్చుకొని దానిని కొరికింది ఒక తాబేలని పాపం ఆ నక్కకు తెలియదు. ఇది కుందేలు చెప్పిన ఉపాయం అని ఆ చేపలకు కూడా తెలియదు. ఆ తాబేలు పైకి వచ్చి ఈ సంగతి ఆ చేపలకు చెప్పగానే ఆ చేపలు తమకు నక్క పీడ విరగడ చేసినందుకు దానికి ధన్యవాదాలు తెలిపాయి.

మరునాడు చేపలు ఆ మడుగులో నీటిని త్రాగటానికి వచ్చిన ఆ కుందేలుకు కూడా కృతజ్ఞతలు తెలిపాయి. నక్క ఆ తర్వాత ఈ మడుగు వైపు కన్నెత్తి కూడా చూడలేదు.అందుకే ఆపద వచ్చినప్పుడు భయపడకుండా ధైర్యంతో మనకు ఉపాయం తెలియకున్నా ఇతరుల సాయాన్ని తీసుకోవాలి.



-సంగనభట్ల చిన్న రామ కిష్టయ్య
9908554535.


**BEFORE THE HONOURABLE COMMISSIONER FOR WORKMEN'S COMPENSATION & ASST LABOUR COMMISSIONER-IV**
**RTC X ROADS, HYDERABD**
***E.C. NO.44 OF 2022***

Between;
Smt. Jada Shanthi ...Applicant
AND
M. Gopi Chand & Another ...Opp. Parties

TO.
M. Gopi Chand,S/o. Venkatasubbaiah
Aged about: Major, Occ: Business
R/o. H.No. 4-32-169, Shapur Nagar
Quthbullapur, R.R.Dist., T.S.

**NOTICE**

Please take notice that in the above matter Applicant had filed a case against you (Opposite Party No.1) for compensation of Rs.16,00,000/- and the same is posted for your appearance on **04-07-2022.**

You are advised to appear on **04-07-2022** at 11.00 AM/ 3.00 P.M. before the said court either in person or throgh an Advocate failing which, the case will be decided exparte
( BY THE ORDER OF THE COURT )

**M/S. B. KALAVATHI REDDY**
**GODUGU KRISHNA**
Advocates
# H.No.12-11-1556/AB, Flat No.001, Harika Enclave,
Boudh Nagar, Warasiguda,Secunderabad-61.
Cell:7675975689


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.